
ఆదివారం
గత వారం జిల్లాలపై విశ్లేషణ
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల
ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ
పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో
ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
రాజమహేంద్రవరం
: fb.com/vaartha Digital

సంబరాల జీవితం సౌభాగ్యాల సౌరభం
KAPIL GROUP
కపిల్ చిట్స్
Visit Us:
www.kapilchits.com
కపిల్ చిట్స్ మీ కలలకు సాకారం

Published from Rajahmundry, Vijayawada, Hyderabad, Visakhapatnam, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
31-12-2025 బుధవారం సంపుటి: 31 సంచిక: 330 పేజీలు: 8+4 వెల: 6.50

# నేటి నుంచి కొత్త జిల్లాలు



మార్కాపురం, పోలవరం జిల్లాల మ్యాప్‌లు

## తుది నోటిఫికేషన్ జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

### కొత్తగా పోలవరం, మార్కాపురం

### అన్నమయ్య జిల్లా కేంద్రంగా మదనపల్లె

### కొన్ని మండలాల సరిహద్దుల్లో మార్పులు

### 28 జిల్లాలు, 5 కొత్త రెవెన్యూ డివిజన్లతో మారిన రాష్ట్ర రూపు రేఖలు

**విజయవాడ,డిసెంబరు 30,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రంలో కొత్తజిల్లాల ఏర్పాటుపై తుది నోటిఫికేషన్‌ను మంగళవారం విడుదలచేసింది. ఏపీలో కొత్తగా మార్కాపురం, పోలవరం జిల్లాలనుఏర్పాటు చేస్తూ అధికారిక ఉత్తర్వులు జారీ అయ్యాయి. రంపచోడవరం కేంద్రంగా పోలవరం జిల్లా ఏర్పాటు చేసినట్లు, మార్కాపురం కేంద్రంగా మార్కాపురం జిల్లా ఏర్పాటు చేసినట్లు నోటిఫికేషన్‌లో పేర్కొంది. 2కొత్త జిల్లాల ఏర్పాటుతో రాష్ట్రంలో మొత్తం జిల్లాల సంఖ్య 26నుంచి 28కి పెరిగింది. మదనపల్లి కేంద్రంగా జిల్లా ఏర్పాటు చేస్తామని సీఎం హామీ ఇచ్చిన నేపథ్యంలో అన్నమయ్య జిల్లా హెడ్ క్వార్టర్‌ను రాయచోటి నుంచి మదనపల్లికి మార్చారు. ప్రజలకు వేగంగా పాలన అందించడం, సుపరిపాలనే లక్ష్యంగా రాష్ట్రంలో కొత్త జిల్లాలు ఏర్పాటు చేసిన ప్రభుత్వం కొత్తగా 5 రెవెన్యూ డివిజన్లనూ ఏర్పాటుచేసింది. పలు మండలాల సరిహద్దులనూ మార్చింది. ప్రజల కోరిక మేరకు సమీప జిల్లాల్లో కలిపింది. కొత్తగా రెవెన్యూ డివిజన్లుగా అనకాపల్లి జిల్లాలో అడ్డరోడ్డు జంక్షన్, ప్రకాశం జిల్లాలో అద్దంకి, అన్నమయ్య జిల్లాలో పీలేరు, శ్రీ సత్యసాయి జిల్లాలో మడకశిర, నంద్యాల జిల్లాలో బనగానపల్లి రెవెన్యూ డివిజన్లు కొత్తగా ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం తుది నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ మార్పులు బుధవారం నుంచి అమల్లోకి రానున్నాయి. మార్పుల్లో నందిగామ మండలాన్ని పలాస రెవెన్యూ డివిజన్ నుంచి టెక్కలి డివిజన్‌కు మార్చింది. సామర్లకోట మండలాన్ని కాకినాడ డివిజన్ నుంచి పెద్దపురం డివిజన్‌కు మారుస్తూ ఏపీ సర్కార్ కీలకమార్పులు చేసింది. అలాగే, పాడేరు కేంద్రంగా అల్లూరి సీతారామరాజు జిల్లా రీస్ట్రక్చర్ చేయడం,పెనుగొం >>2



### కొత్త రెవెన్యూ డివిజన్లు

- అనకాపల్లి జిల్లా: అడ్డరోడ్డుజంక్షన్
- ప్రకాశం జిల్లా: అద్దంకి
- అన్నమయ్య జిల్లా: పీలేరు
- శ్రీసత్యసాయి జిల్లా: మడకశిర
- నంద్యాల జిల్లా: బనగానపల్లి

గూడూరు నియోజకవర్గంలోని మూడు మండలాలు నెల్లూరుకు

రైల్వేకోడూరు నియోజకవర్గం తిరుపతి జిల్లాలోకి

రాజంపేట నియోజకవర్గం వైఎస్ఆర్ కడపలోకి

ఎటువంటి మార్పులు లేని తొమ్మిది జిల్లాలు



## బంగ్లా తొలి మహిళా ప్రధాని ఖలీదా జియా కన్నుమూత

కొన్ని వారాలుగా తీవ్ర అనారోగ్యంతో మాజీ ప్రధాని

5లో

## 2 నుంచి 21.80 లక్షల పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణి

**విజయవాడ,డిసెంబరు 30,ప్రభాతవార్త ప్రతినిధి:** జనవరి నెల 2 నుంచి 9 లోపు రాష్ట్ర వ్యాప్తంగా 21.80 లక్షల పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేస్తామని రెవిన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. ప్రభుత్వ రాజ ముద్రతో కొత్తగా ముద్రించిన వీటి పంపిణీకి ఏర్పాట్లు చేస్తామని సోమవారం ఆయన సచివాలయంలో విలేకరులతో మాట్లాడుతూ తెలిపారు. 'గత పాలకుడు తన ఫొటోను రైతుల పట్టాదారు పాస్ పుస్తకాలపై ముద్రించారు. సర్వే రాళ్ళను సైతం వదల్లేదు. పెద్ద ఎత్తున ప్రజాధనం దుర్వినియోగం చేశారు. ప్రస్తుతం పంపిణీ చేయనున్న పాస్ పుస్తకాల్లో తప్పు లేమైనా దొర్లితే వెంటనే సరి చేయాలని అధికారులను >>2



## సంక్రాంతికి మరో 11 ప్రత్యేక రైళ్లు

**విజయవాడ,డిసెంబరు 30,ప్రభాతవార్త ప్రతినిధి:** సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రయాణీకుల రద్దీ ఎక్కువగా ఉండటంతో దక్షిణ మధ్య రైల్వే 11 ప్రత్యేక రైళ్ళను ప్రకటించింది. ఈ ప్రత్యేక రైళ్ళు కాకినాడ టౌన్, వికారాబాద్, పార్వతీపురం, సికింద్రాబాద్ మధ్య జనవరి 7 నుంచి 12,2026 మధ్య వివిధ తేదీల్లో నడుస్తాయి. కొన్ని రైళ్ళు సాయంత్రం లేదా రాత్రి బయలుదేరి మరుసటి రోజు గమ్యస్థానానికి చేరుకుంటాయి. ఈ రైళ్ళలో ఏసీ,స్లీపర్, జనరల్ బోగీలు ఉంటాయి. >>2

## స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు గ్రామ, వార్డు సచివాలయాల పేరు మార్పు

**విజయవాడ,డిసెంబరు 30,ప్రభాతవార్తప్రతినిధి:** గ్రామ, వార్డు సచివాలయాల పేర్లు స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డుగా మార్చేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఉద్దేశించిన చట్ట సవరణ ఆర్డినెన్స్ ప్రతిపాదనను తాజా మంత్రిమండలి ఆమోదించింది. స్వర్ణాంధ్ర లక్ష్య సాధనలో గ్రామ, వార్డు సచివాలయాలు కీలకపాత్ర పోషించనున్నాయని ఇందుకుగాను కార్య నిర్వాహకుల పాత్రలు, బాధ్యతలు సవరించాల్సిన అవసరముందని అభిప్రాయ పడింది. అందుకే సచివాలయాల పేరు మారుస్తున్నట్లు తెలిపింది. ఈ మేరకు ఏపీ ప్రభుత్వం అదికారికంగా ఉత్తర్వులు జారీ చేయనున్నది. ఇక రాజధాని అమరావతిలో మౌలిక సదుపాయాల కల్పనకు వివిధ ప్రాజెక్టుల అమలుకు నాబార్డు, నాబార్డు ఇన్‌ఫ్రా అసిస్టెన్స్ పథకాల కింద రూ. 7,387కోట్ల రుణం తీసుకునే ప్రతిపాదనకూ కేబినెట్ ఆమోదముద్ర >>2

## 'ఫుట్‌పాత్'వాసులను 'హోమ్'లకు పంపండి




### రాత్రివేళ రోడ్లపక్క నిద్రిస్తున్న అభాగ్యుల దీనస్థితిపై హైకోర్టు స్పందన

### మహిళలకు ఆశ్రయం లేకపోవడంపై విస్మయం

**వివిధ జిల్లాల్లో ఏచర్యలు తీసుకొంటున్నారో చెప్పాలని ఆదేశం**

**విజయవాడ,డిసెంబరు 30, ప్రభాతవార్తప్రతినిధి:** రాత్రి వేళల్లో దయనీయ స్థితిలో ఫుట్‌పాత్‌లపై నిద్రిస్తున్న ఎంతో మంది అభాగ్యుల దీనస్థితి చూసి హైకోర్టు స్పందించింది. ఈ క్రమంలోనే నిరాశ్రయులు, అనాథలు రాత్రివేళల్లో ఫుట్‌పాత్‌ల మీద నిద్రించడంపై హైకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. రాష్ట్ర ప్రభుత్వాన్ని ఈ వ్యవహారంపై దృష్టి పెట్టాలని స్పష్టం చేసింది. అనుభవం ఉన్న స్వచ్ఛంద సంస్థల సహకారం తీసుకుని షెల్టర్ హోంల నిర్వహణ ఏర్పాటు తప్పనిసరి అని సూచించింది. ఈ నేపథ్యంలో విజయవాడతోపాటు రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాలలో ఆశ్రయ/వసతి గృహాలు (షెల్టర్ హోం) ఏర్పాటు విషయంలో తీసుకుంటున్న చర్యలపై రెండు వారాల్లో అఫిడవిట్ వేయాలని పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శిని ఆదేశించింది. విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్‌కు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి ఫుట్‌పాత్‌లపై నిద్రిస్తున్నవారిని తక్షణమే ఆశ్రయ కేంద్రాలకు తరలించాలని స్పష్టం చేసింది. ఈనెల 31కి తదుపరి విచారణను వాయిదా వేసింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్, జస్టిస్ చీమలపాటి రవిలతో కూడిన ధర్మాసనం ఈ మేరకు ఉత్తర్వులిచ్చింది. విజయవాడ కృష్ణా బ్యారేజ్ ఫుట్‌పాత్‌లపై నిరాశ్రయులు రాత్రి వేళల్లో దయనీయ స్థితిలో నిద్రపోతున్నారని వారికి ఆశ్రయం కల్పించే విషయంలో అధికారులు చర్యలు తీసుకోవడం లేదని పేర్కొంటూ న్యాయవాది ఆది రామకృష్ణుడు పిల్ వేశారు. ఆయన నేరుగా వాదనలు వినిపిస్తూ పట్టణ నిరాశ్రయుల పథకం (షెల్టర్ ఫర్ అర్బన్ హోంలెస్ఎస్‌యూహెచ్) కింద నిరాశ్రయులకు ఆశ్రయం కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. విజయవాడ నగరపాలక సంస్థ కొన్ని ప్రాంతాల్లో షెల్టర్ హోంలు ఏర్పాటు చేసినప్పటికీ ఇంకా ఎంతోమంది ఫుట్‌పాత్‌లపై నిద్రిస్తున్నారన్నారు. ధర్మాసనం స్పందిస్తూ ఫుట్‌పాత్‌లపై నిద్రించడం ప్రమాదకరమని, చలికాలంలో పరిస్థితి మరింత దారుణంగా ఉంటుందని వ్యాఖ్యానించింది. విచారణ సందర్భంగా, మహిళలకు ఆశ్రయ హోంలు లేవని తెలుసుకొని >>2

## సంక్షేమగృహాలపై గట్టి నిఘా

**విజయవాడ,డిసెంబరు 30,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో సంక్షేమ వసతి గృహాల్లో ఆరోగ్యపరిస్థితులపై నిరంతరం నిఘా ఉండాలని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టళ్లల్లో తనిఖీలను విస్తృతంగా నిర్వహించాలన్నారు. మంచినీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాల న్నారు. వసతి గృహాల్లో పరిశుభ్రత ఉండాలన్నారు. విద్యార్థులకు తరచు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలన్నారు. ఆయా హాస్టళ్ళ నిర్దేశిత అధికారులు బాధ్యతగా వ్యవహారించకుంటే తీవ్ర చర్యలు తప్పవన్నారు. మంత్రులు, ఆయా శాఖల ఉన్నతాధికారులు మొదలుకుని క్షేత్రస్థాయి సిబ్బంది వరకు తమ విధి నిర్వహణలో భాగంగా చేసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ హాస్టళ్ల, రెసిడెన్షియల్ స్కూళ్లల్లోని నీటి సరఫరా, పారిశుద్ధం, ఇతర సదుపాయాలపై ముఖ్యమంత్రి సంబంధిత శాఖాధికారులను ఆరా తీసారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వారికి మార్గదర్శనం చేస్తూ సంక్షేమ శాఖ హాస్టళ్ల, రెసిడెన్షియల్ స్కూళ్లల్లో పారిశుద్ధం నూటికి నూరు శాతం నిర్వహించాలి. ఎక్కడా ఏ చిన్న పొరపాటు జరిగినా సహించేది లేదు. ఇటీవల కాలంలో హాస్టళ్లల్లో జరిగిన తప్పిదాలు మళ్లీ రిపీట్ కాకూడదు. అలాంటివి పునరావృతమైతే ఏం జరిగిందని తెలుసుకునేది ఉండదు. నేరుగా బాధ్యులపై చర్యలు తీసుకుంటాం. 20 శాతం హాస్టళ్లల్లో టాయిలెట్ల నిర్మాణం ఇంకా జరపాల్సి ఉంది. ఈ టాయిలెట్ల నిర్మాణం కోసం అవ సరమైన రూ. 40కోట్లు విడుదల చేస్తామన్నారు. టాయిలెట్ల నిర్మాణం యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలి. ఆర్వో ప్లాంట్లు, టాయిలెట్లు లేకుండా హాస్టళ్ల ఉండడం సరికాదు. గత ప్రభుత్వం చేసిన నిర్లక్ష్యం వల్ల ఇవన్నీ జరిగాయి. ఆర్వో ప్లాంట్లు లేని ప్రతి హాస్టల్లోనూ... ప్రతి రెసిడెన్షియల్ పాఠశాలల్లోనూ ఆర్వో ప్లాంట్లను ఏర్పాటు చేయాలి. డాక్టర్లతో విద్యార్థులకు రెగ్యులర్ హెల్త్ చెకప్స్ చేయించాలి. హాస్టళ్లలోని 4.17 లక్షల మంది విద్యార్థుల రక్త నమూనాలు సేకరించి సమస్యలు ఉన్నవారిని ముందుగానే గుర్తించి చికిత్సలు అందించాలి అన్నారు., బడుగు విద్యా ర్థులకు చేసే సాయాన్ని బాధ్యతగా తీసుకోవాలి. సమాజంలో ప్రతి ఒక్కరికీ సమాన అవకాశాలు కల్పించాలనే ఉద్దేశ్యంతో హాస్టళ్ల పెట్టారు. దీనికి విఘాతం కల్గించేలా అలక్ష్యం చేస్తే ఊరుకునేది లేదు. హాస్టళ్లల్లో పరిస్థితి >>2

### విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలి

### ఆర్వోప్లాంట్లు, టాయిలెట్లు తప్పనిసరి

### స్టూడెంట్ల రక్త నమూనాలు సేకరించి పరీక్షించాలి: సిఎం చంద్రబాబు ఆదేశం



## శంకరగుప్తం డ్రెయిన్ ఆధునీకరణ


శంకరగుప్తం మేజర్ డ్రెయిన్ ఆధునీకరణ పనులకు వర్చువల్‌గా శంకుస్థాపన చేస్తున్న డిసిఎం పవన్

### కోనసీమ కొబ్బరి రైతు కన్నీరు కదిలించింది

### సినిమా అడ్వాన్స్ డబ్బు రూ.5కోట్లు కౌలురైతులకు ఇచ్చేశా: డిసిఎం పవన్

**విజయవాడ,డిసెంబరు 30,ప్రభాతవార్తప్రతినిధి:** అన్నం పెట్టే రైతుకు కూటమి ప్రభుత్వం అండగా నిలబడుతుంది అని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్ అన్నారు. మన రాష్ట్రం రైతు కన్నీరు పెట్టని రాష్ట్రంగా ఉండాలన్నది కూటమి ఆకాంక్ష అని తెలిపారు. ఆ దిశగా అడుగులు వేస్తున్నామన్నారు. గత నెలలో రాజోలు పర్యటనకు వెళ్లినప్పుడు సముద్రం పోటుతో శంకరగుప్తం మేజర్ డ్రెయిన్ ఏ విధంగా సమస్యగా మారి కొబ్బరి తోటలు నాశనం అవుతున్నాయో చూశామన్నారు. మరో కొబ్బరి చెట్టు దెబ్బ తినక ముందే ఈ సమస్యను పరిష్కరించాలని నిర్ణయించుకున్నా. ముక్కోటి ఏకాదశి రోజున శంకరగుప్తం డ్రెయిన్ ఆధునికీకరణ పనులకు శంకుస్థాపన చేయడం ఆనందంగా ఉందని రాష్ట్ర ఉపముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. కోనసీమ కొబ్బరి రైతుల సమస్య తెలియ జేసిన వెంటనే మనసుతో విని తక్షణం స్పందించి నిధులు మంజూరు >>2

## మినీ అంగన్వాడీల స్థాయి పెంపు

### మంత్రి సంధ్యారాణి



**విజయవాడ,డిసెంబరు 30,ప్రభాతవార్తప్రతినిధి:** ఈ ఏడాది మహిళా, శిశు సంక్షేమ శాఖల్లో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చామని రాష్ట్ర మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. అందులో భాగంగా మినీ అంగన్వాడీలను ప్రధాన అంగన్వాడీలుగా మార్చాం అని పేర్కొన్నారు. రాష్ట్రంలో 5 వేల మినీ అంగన్వాడీలను ప్రధాన అంగన్వాడీలుగా మార్చాం అని పేర్కొన్నారు. రాష్ట్రంలో 5 వేల మినీ అంగన్వాడీలను అప్‌గ్రేడ్ చేశామన్నారు. అంతేకాకుండా అంగన్వాడీలకు సెల్‌ఫోన్ సౌకర్యం అందుబాటులోకి తెచ్చామన్నారు. అంగన్వాడీ కార్యకర్తలు మెరుగైన సేవలు అందించడానికి పాత 4జీ ఫన్ల స్థానంలో 5జీ స్మార్ట్ ఫోన్లను కూటమి ప్రభుత్వం అందిస్తోందన్నారు. తద్వారా క్షేత్రస్థాయి నివేదికలు వేగవంతమవుతాయని, గర్భిణీలు, తల్లులు, పిల్లలకు సేవలు సమర్థవంతంగా అందుతాయని వివరించారు. రాష్ట్రం లోని గిరిజన ప్రాంతాల్లో డోలీ మోతలు లేకుండా రహదారుల సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. తద్వారా గర్భిణులు, అనారోగ్యంతో బాధపడే వారు ఆస్పత్రికి తీసుకెళ్ళేందుకు ఇబ్బందులను తొలగిస్తున్నామని స్పష్టం చేశారు. >>2

## ప్రశాంతంగా 'ఉత్తరద్వార' దర్శనాలు


వైకుంఠద్వార దర్శనాలతో ఆలయం వెలుపల భక్తులు

### తిరుమలలో టోకెన్ భక్తులకు పూర్తి సౌకర్యాలు

### నేడు పుష్కరిణిలో చక్రత్తాళ్వార్‌కు చక్రస్నానం

### భక్తుల రద్దీ అత్యధికంగా ఉన్నట్లు అధికారుల వెల్లడి

**తిరుమల,డిసెంబరు 30ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామి నిలయమైన ఆనందనిలయానికి ఆనుకునే ఉన్న వైకుంఠద్వార దర్శనాలను సినీప్రముఖులతో బాటు సామాన్యభక్తులు వైకుంఠ ఏకాదశి ఘడియల్లో ప్రశాంతంగా చేసుకుంటున్నారు. మంగళవారం వేకువజామున వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని వైకుంఠద్వార దర్శనాలు మొదలయ్యాయి. వేకువజామున 1.30గంటలకు మొదలైన ప్రోటోకాల్ ప్రముఖుల దర్శనాలు ఏకధాటిగా ఉదయం 6గంటల వరకు సాగాయి. ఆ తరువాత ముందుగా నిర్దేశించిన సమయం ప్రకారం టోకెన్లుపొందిన భక్తులను స్లాట్‌ల వారీగా సమయం ప్రకారం ఆలయంలోనికి అనుమతించారు. సర్వదర్శనం ప్రారంభించడంతో సామాన్యభక్తులు ఏడుకొండల స్వామితోబాటు >>2

## గ్రూప్-2 అభ్యర్థులకు హైకోర్టులో ఊరట

**విజయవాడ,డిసెంబరు 30,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ గ్రూప్2 అభ్యర్థులకు భారీ ఊరట దక్కింది. గ్రూప్2 రిజర్వేషన్లపై దాఖలైన పిటిషన్లను ఏపీ హైకోర్టు కొట్టివేసింది. కాగా, 2023లో విడుదలైన గ్రూప్2 నోటిఫికేషన్‌పై రిజర్వేషన్ల విధానాన్ని సవాల్ చేస్తూ పలువురు అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా రిజర్వేషన్ రోస్టర్‌ను పాటించాలని కోరుతూ అభ్యర్థులు పిటిషన్లు దాఖలు చేశారు. 2023లో విడుదలైన గ్రూప్2 నోటిఫికేషన్‌ను రద్దుచేసి, పాత నోటిఫికేషన్‌కు బదులు కొత్త నోటిఫికేషన్ జారీ చేయాలని అభ్యర్థులు కోరారు. >>2



మంగళవారం తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి కుటుంబ సభ్యులతో తిరుమలలో ఉత్తరద్వార దర్శనం

# ప్రశాంతంగా 'ఉత్తరద్వార' దర్శనాలు

>> వైకుంఠద్వార దర్శనం ప్రశాంతంగా చేసుకొంటున్నారు. తమిళనాడు, కర్నాటక, కేరళ,తెలుగురాష్ట్రాలకు చెందిన భక్తులు తిరుమల ఆలయంలో వైకుంఠదర్శనాలు చేసుకున్నారు. సాయంత్రం వరకు 40వేలమంది భక్తులకు మహాలఘులో దర్శనం కల్పించారు. తిరుమలలో సామాన్యభక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ముందుగానే మూడునెలల నుండి ప్రణాళికా బద్ధంగా టిటిడి,పోలీసు యంత్రాంగం చక్కటి ఏర్పాట్లు చేపట్టింది. క్యూలైన్లలో, కంపార్టుమెంట్లలో ఉన్న భక్తులకు నిరంతరాయంగా టీ,పాలు, అల్పాహారం, అన్నప్రసాదాలు పంపిణీ చేస్తున్నారు. సోమవారం రాత్రికి తిరుమల కొండ సామాన్యభక్తుల తో నిండిపోయినా టోకెన్ ఉన్నవారినే ఆలయంలోనికి అనుమతించడం జరిగింది. ఏడుకొండలు గోవిందనామాలతో మారుమోగుతున్నాయి.

**సంతృప్తికరంగా వైకుంఠద్వార దర్శనం:** వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని తిరుమల శ్రీవారి ఆలయంలో భక్తులకు సంతృప్తికరంగా వైకుంఠ ద్వార దర్శనం టిటిడి అధికారులు చేయిస్తున్నారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా చక్కటి ఏర్పాట్లు చేశారు. స్లాట్ల వారీగా సర్వదర్శనం అనుమతి నిస్తున్నారు. రోజుకు 65వేలమంది భక్తులకు దర్శనం చేయించేలా ప్రణాళికలు సిద్ధం చేసి టోకెన్లు జారీచేశారు. పదిరోజులకు 7.50లక్షలమంది భక్తులు వైకుంఠద్వారంలో వేంకటేశ్వరుని దర్శించుకునేలా ఏర్పాట్లు జరిగాయి. **నేడు చక్రస్నానం:** వైకుంఠ ద్వాదశి పర్వదినాన బుధవారం ఉదయం స్వామివారి పుష్కరిణిలో చక్రత్తాళ్వార్‌కు చక్రస్నానం జరిపిస్తారు. ఆగమోక్తంగా అర్చకులు పవిత్ర కార్యక్రమం నిర్వహించిన అనంతరం సామాన్యభక్తులు పుణ్యస్నానాలాచరిస్తారు.

# భారత్, పాక్‌లమధ్య మళ్లీ యుద్ధ మేఘాలు!

## అమెరికా థింక్‌ట్యాంక్ విశ్లేషణ

**న్యూఢిల్లీ, డిసెంబరు 30:** భారత్ పాకిస్తాన్‌లమధ్య వచ్చే ఏడాది మరోసారి యుద్ధంజరిగే అవకాశం ఉందని అమెరికన్ విదేశాంగ నిపుణులను సర్వేచేసే యుఎస్ థింక్‌ట్యాంక్ నివేదిక విడుదలచేసింది. కౌన్సిల్ ఆన్ ఫారిన్ రిలేషన్స్ సాయుధ సంఘర్షణ అవకాశాలకు ఎక్కువ ఆస్కారం ఉందని తెలిపింది. అమెరికన్‌ప్రయోజనాలపై పరిమిత ప్రభావం చూపవచ్చని ఉగ్రవాద కార్యకలాపాల పెరుగుదల కారణంగా భారత్, పాక్ మధ్య తిరిగి సాయుధ సంఘర్షణకు అవకాశం ఉన్నట్లు సిఎఫ్ఆర్ తన కాన్‌ఫ్లిక్ట్ వాచ్‌ఇన్ 2026 నివేదికలో ఉటంకించింది. భారత్‌తోనే కాకుండా పాక్ ఆఫ్ఘనిస్తాన్ మధ్యకూడా సాయుధ పోరాటం ఉంటుందని హెచ్చరించింది. పహల్గాంవ్ ఉగ్రదాడి తర్వాత భారత్ ఆపరేషన్ సిందూర్‌తో పాక్ వ్యాప్తంగా ఉన్న లష్కరే, జైషే ఉగ్రవాద స్థావరాలు కార్యాలయాలపై దాడులుచేసింది. వందలాదిమంది ఉగ్రవాదులు హతమయ్యారు. తర్వాత పాక్‌సైన్యం భారత్‌పై దాడులకు ప్రయత్నిస్తే పాక్ ఎయిర్‌ఫోర్స్‌కు చెందిన 11 ఎయిర్‌బేస్‌లను భారత్ క్షిపణులు డీకొట్టాయి. తర్వాత తాజాగా థింక్‌ట్యాంక్‌నుంచి ఈ నివేదికవచ్చింది. ప్రత్యేకించి ఆర్మీచీఫ్‌గా ఆసిమ్‌మునీర్‌కు అత్యున్నత పదవి లభించిన తర్వాత భారత్ లక్ష్యంగా కార్యకలాపాలు పెరిగాయి. రెండుదేశాలు కూడా రక్షణ వ్యవస్థను బలోపేతంచేసుకుంటున్నాయి. రెండురోజులక్రితమే రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ 79 వేల కోట్ల విలువైన రక్షణ సామగ్రి కొనుగోలుకు ఆమోదం తెలిపారు. అదేవిధంగా పాక్ కూడా అమెరికా,చైనాలపై రక్షణ సామగ్రి దిగుమతికి ఆధారపడింది. దీనికితోడు ఆసిమ్‌మునీర్ హయాంలోనే ఉగ్రవాదం ఇతర దేశాలకు కూడా పాకుతోంది. ఇటీవలే స్పానిష్ పోలీసులు 11 మంది పాకిస్తానీ దేశీయులను తాలిబన్ టెర్రరిస్టులుగా అనుమతనిస్తూ అరెస్టులుచేయడంతో జీహాదీ చర్యలు బలపడ్డాయి. ఉత్తర అమెరికాలోకూడా 20 ఏళ్ల పాకిస్తాన్ వ్యక్తిని కెనడాలో ఉండగా అరెస్టుచేసారు. కాగా భారత్‌లో తీవ్రమైన చలివాతావరణంలో భారీ ఎత్తున మంచుకురుస్తున్నప్పటికీ ఇప్పటికే 30 మంది ఉగ్రవాదులు ఉన్నట్లు నిఘా ఏజెన్సీలు గుర్తించాయి. వీటన్నింటి దృష్ట్యా వచ్చే ఏడాదిలో మళ్లీ యుద్ధమేఘాలు అలుముకునే ప్రమాదం ఉందన్న అమెరికా థింక్‌ట్యాంక్ విశ్లేషణ నిజమనిపిస్తోంది.

# అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌నకు ఇజ్రాయెల్ అత్యున్నత పురస్కారం

**ఫ్లోరిడా, డిసెంబరు 30:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు ఇజ్రాయెల్ ప్రభుత్వం అరుదైన గౌరవాన్ని ప్రకటించింది. ఆ దేశ అత్యున్నత పౌర పురస్కారమైన "ఇజ్రాయెల్ ప్రైజ్ ఫర్ పీస్"ను ట్రంప్‌నకు ప్రదానం చేయనున్నట్లు ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు వెల్లడించారు. ఫ్లోరిడాలోని మార్‌ఎలాగోలో ఇరువురు నేతల మధ్య జరిగిన ద్వైపాక్షిక భేటీ అనంతరం ఈ ప్రకటన వెలువడింది. గత 80 ఏళ్ల చరిత్రలో ఈ పురస్కారాన్ని ఓ విదేశీయుడికి (నాన్‌ఇజ్రాయెల్ సిటిజన్) ఇవ్వడం ఇదే తొలిసారి కాగా శాంతి విభాగంలో అవార్డును ప్రకటించడం కూడా ఇదే మొదటిసారి కావడం విశేషం. ఈ ఏడాది జులై లో ఇజ్రాయెల్ తమ నిబంధనలను సవరించి మరీ విదేశీయులకు ఈ అవార్డు ఇచ్చేలా మార్పులు చేసింది. ఇజ్రాయెల్ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు హాజరై ట్రంప్ ఈ అవార్డును స్వీకరించే అవకాశం ఉంది.ట్రంప్ ఎన్నో సంప్రదాయాలను తిరగరాసి అందరినీ ఆశ్చర్యపరిచారు. అందుకే మేం కూడా సంప్రదాయాన్ని పక్కనపెట్టి తొలిసారి ఓ ఇజ్రాయేలేతరుడికి ఈ అవార్డును ఇస్తున్నాం. యూదు ప్రజలకు, ఇజ్రాయెల్ భద్రతకు ట్రంప్ చేసిన సేవలకు ఇది గుర్తింపని నెతన్యాహు పేర్కొన్నారు. దీనిపై స్పందించిన ట్రంప్ ఈ గౌరవం తనను ఆశ్చర్యపరిచిందని, ఇజ్రాయెల్ గుర్తింపు పట్ల ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. భేటీలో భాగంగా గాజా శాంతి ఒప్పందం రెండో దశ, వెస్ట్ బ్యాంక్ అంశాలపై ఇరువురు నేతలు సుదీర్ఘంగా చర్చించారు. వెస్ట్ బ్యాంక్ విషయంలో తమ మధ్య కొన్ని భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికీ ఇజ్రాయెల్ ఒప్పందానికి కట్టుబడి ఉందని, ఆ దేశం బలంగా ఉందని ట్రంప్ కితాబునిచ్చారు. చర్చలు ఫలప్రదంగా జరిగాయని నెతన్యాహు వెల్లడించారు.

# నేటి నుంచి కొత్త జిల్లాలు

>> దను వాసవి పెనుగొండగా మార్చడం వంటి మార్పులు కూడా నోటిఫికేషన్‌లో చేర్చింది. అనకాపల్లి జిల్లాలో అడ్డరోడ్డు జంక్షన్‌తో రెవెన్యూ డివిజన్‌ను ఏర్పాటు చేయడం, అంబేద్కర్ కోనసీమ జిల్లాలో మండలాలను మార్చడం ద్వారా స్థానిక పరిపాలన మరింత సులభతరం అవుతుందని కూటమి ప్రభుత్వం భావించింది. ఈ మార్పుల ద్వారా జిల్లా పరిపాలన, రెవెన్యూ కార్యకలాపాలు మరింత సమర్థవంతంగా నిర్వహించడానికి అవకాశం ఉంటుందని ప్రభుత్వం అనుకుంటుంది. ఈ నిర్ణయం గ్రామీణ, పట్టణ ప్రాంతాల ప్రజలకు సమగ్ర సేవలందించడానికి తీసుకున్నదని ఏపీ ప్రభుత్వం పేర్కొంది. కొత్త జిల్లాల ఏర్పాటుతో పౌరుల సేవల చేరిక వేగవంతం అవుతుందని... రెవెన్యూ డివిజన్ల మార్పులు, చేర్పులు స్థానిక అధికారుల ప్రవర్తనను మరింత సమర్థవంతంగా చేస్తాయని భావిస్తోంది. తుది నోటిఫికేషన్ ప్రకారం, రేపటి నుంచి కొత్త జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు, మండలాల సరిహద్దుల మార్పులు అధికారికంగా అమల్లోకి రానున్నాయి. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో మండలాలను మార్చారు. గూడూరు నియోజకవర్గంలోని 3మండలాలు నెల్లూరుకు తీసుకువచ్చారు. రైల్వే కోడూరు నియోజకవర్గాన్ని తిరుపతిజిల్లాలోకి, రాజంపేట నియోజకవర్గాన్ని వైఎస్ఆర్ కడపలోకి మార్చాలని ప్రజల కోరిక మేరకు క్యాబినెట్ ఆమోదం తెలపగా వాటికి సంబంధించి తుది నోటిఫికేషన్‌లు విడుదలయ్యాయి. 17జిల్లాల్లో 25 మార్పులు చేస్తూ క్యాబినెట్ ఆమోదం తెలపగా వాటన్నింటికీ సంబంధించి తుది ప్రకటన జారీ అయ్యాయి. కొత్త జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు, సహా మార్పులు చేర్పులన్నీ డిసెంబర్ 31నుంచే అమల్లోకి వస్తాయని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. ప్రజలు, స్థానిక సంస్థలు, అధికారులు అన్నివిధాలుగా ఈ మార్పులకు అనుగుణంగా తమ కార్యకలాపాలను సర్దుబాటు చేసుకోవాల్సి ఉంది. ఈ కొత్త ఏర్పాట్లు ఏపీలో పరిపాలనలో మరింత సమర్థత, ప్రజల చేరికలో సౌలభ్యం, స్థానిక అభివృద్ధికి దోహదపడతాయని ప్రభుత్వం అభిప్రాయపడుతోంది.

# 'ఫుట్‌పాత్'వాసులను 'హోమ్'లకు పంపండి

>> విస్మయం వ్యక్తం చేసింది. ఈ విషయంలో జాప్యం చేయడానికి వీల్లేదని స్పష్టం చేసింది. విజయవాడ నగరపాలక సంస్థ తరపు న్యాయవాది స్పందిస్తూ మహిళలకు షెల్టర్ హోంలు ఏర్పాటు ప్రతిపాదన ఉందని ధర్మాసనం దృష్టికి తెచ్చారు. విజయవాడ కృష్ణా బ్యారేజ్ ఫుట్‌పాత్‌పై నిరాశ్రయులు రాత్రి వేళల్లో దయనీయ స్థితిలో నిద్రపోతున్నారని వారికి ఆశ్రయం కల్పించే విషయంలో అధికారులు చర్యలు తీసుకోవడం లేదని పేర్కొంటూ న్యాయవాది ఆది రామకృష్ణుడు పిల్ వేశారు. ఆయన నేరుగా వాదనలు వినిపిస్తూ పట్టణ నిరాశ్రయుల పథకం (షెల్టర్ ఫర్ అర్బన్ హోంలెస్-ఎస్‌యూహెచ్) కింద నిరాశ్రయులకు ఆశ్రయం కల్పించాల్సిన బాధ్యత అధికారులపైనే ఉందన్నారు. విజయవాడ నగరపాలక సంస్థ కొన్ని ప్రాంతాల్లో షెల్టర్ హోంలు ఏర్పాటు చేసినప్పటికీ ఇంకా ఎంతోమంది ఫుట్‌పాత్‌పై నిద్రిస్తున్నారన్నారు. ధర్మాసనం స్పందిస్తూ ఫుట్‌పాత్‌పై నిద్రించడం ప్రమాదకరమని, చలికాలంలో పరిస్థితి మరింత దారుణంగా ఉంటుందని వ్యాఖ్యానించింది. విచారణ సందర్భంగా, మహిళలకు ఆశ్రయ హోంలు లేవని తెలుసుకొని విస్మయం వ్యక్తం చేసింది. ఈ విషయంలో జాప్యం చేయడానికి వీల్లేదని స్పష్టం చేసింది. విజయవాడ నగరపాలక సంస్థ తరపు న్యాయవాది స్పందిస్తూ మహిళలకు షెల్టర్ హోంలు ఏర్పాటు ప్రతిపాదన ఉందని ధర్మాసనం దృష్టికి తెచ్చారు. కోర్టుకు సహాయకులుగా వ్యవహరించేందుకు అమికస్ క్యూరీగా నియమితులైన సీనియర్ న్యాయవాది కేఎస్ మూర్తి వాదనలు వినిపిస్తూ గతంలో షెల్టర్ హోంలను స్వచ్ఛంద సంస్థలు నిర్వహించేవన్నారు. గత ప్రభుత్వం సొమ్ము చెల్లించకపోవడంతో హోంల నిర్వహణ నుంచి ఎన్జీవోలు తప్పుకున్నాయని పేర్కొన్నారు. దారిలేక కొందరు దారితప్పి మరికొందరు పనికోసం ఒకరు పనిలేక మరొకరు ఇలా చాలా మంది విజయవాడ నగరానికి చేరుతున్నారు. వీరిలో ఉపాధి కోసం నగరానికి వచ్చే వారి సంఖ్యనే అధికం. రాత్రుళ్లు లాడ్జిలో ఉండాలన్నా అధిక మొత్తం చెల్లించాల్సి ఉంటుంది. దీంతోపాటు భోజనం, ఇతర అవసరాలకు మరింత ఖర్చు పెట్టాల్సి ఉంటుంది. ఇలా ఖర్చు పెట్టలేక చాలా మంది వలసొచ్చిన కార్మికులు, నిరాశ్రయులు నగరంలోని బస్టాండ్, రైల్వేస్టేషన్, బీఆర్టీఎస్ రోడ్డు, దుర్గగుడి ఫ్లై ఓవర్ కింద, ప్రకాశం బ్యారేజి, ఏలూరు రోడ్డులోని ఫుట్‌పాతలు, డివైడర్లులను ఆవాసాలుగా చేసుకుంటున్నారు. ఇలాంటి వారి కోసం పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ నగరంలో నాలుగు నిరాశ్రయుల వసతి గృహాలను అందుబాటులోకి తీసుకొచ్చింది. వీటి గురించి తెలియక చాలా మంది ప్రధాన కూడళ్లు, ఫుట్‌పాత్‌లపైనే రాత్రుళ్లు పడుకుంటున్నారు.

# శంకరగుప్తం డ్రెయిన్ ఆధునీకరణ

>> చేయించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కోనసీమ రైతాంగం తరఫున ధన్యవాదాలు తెలిపారు. సుబ్రహ్మణ్య షష్టి రోజు సమస్య తెలుసుకుని.. ముక్కోటి ఏకాదశి నాటికి పరిష్కరించడం ఎంతో సంతృప్తినిచ్చిందన్నారు. మంగళవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా పరిధిలోని శంకరగుప్తం మేజర్ డ్రెయిన్ ఆధునికీకరణ పనులకు రాజధాని ప్రాంతంలోని క్యాంపు కార్యాలయం నుంచి వర్చువల్ గా శంకుస్థాపన చేశారు. రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఈ కార్యక్రమంలో వర్చ్యువల్ గా పాల్గొన్నారు. రాజోలు శాసన సభ్యులు దేవ వరప్రసాద్ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్‌శంకరగుప్తం నుంచి పాల్గొన్నారు. రూ. 20.62 కోట్ల అంచనా వ్యయంతో శంకరగుప్తం మేజర్ డ్రెయిన్ 8.50 కిలోమీటర్ నుంచి 16.50 కిలోమీటర్ వరకు ద్వారా పూడిక తీత పనులు, డ్రెయిన్ మొదలైన ప్రాంతం నుంచి 14.50 కిలోమీటర్ వరకు ఇరువైపులా గట్లు పటిష్టపరచడం తదితర పనులు చేపట్టనున్నారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ "శంకరగుప్తం డ్రెయిన్ సమస్యను పరిశీలన చేసేందుకు రాజోలు నియోజకవర్గం కేశవదాసుపాలెం వచ్చినప్పుడు తలలు వాల్చిన కొబ్బరి తోటలు చూస్తే బాధ కలిగింది. రెండు దశాబ్దాల రైతుల ఆవేదన స్వయంగా విన్నాను. సుమారు లక్షన్నర చెట్లు మోడుబారిపోయిన విషయం తెలుసుకుని కలత చెందాను. కొబ్బరి తోటలు లేని కోనసీమను ఊహించలేం. అక్కడ పరిస్థితి చూసి తిరిగి వచ్చిన వెంటనే సమస్యను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళ్లా. 45 రోజుల్లో సమస్య పరిష్కారానికి ఒక యాక్షన్ ప్లాన్ అవసరం అని వివరించా. ఆయన సకాలంలో స్పందించి ఈ రోజున 35 రోజుల్లోపే రూ. 20.77 కోట్లు కేటాయించి ముక్కోటి ఏకాదశి పర్వదినాన పనులు ప్రారంభించే అవకాశం కల్పించారు. డ్రెయిన్ ఆక్రమణలపై అధికారులు దృష్టి సారించాలి. డ్రెయిన్ ఆధునికీకరణ చేయడంతో పాటు డ్రెయిన్ ఆక్రమణలు ఉన్న విషయం మా దృష్టికి వచ్చింది.

శంకరగుప్తం డ్రెయిన్ లో 250 ఎకరాలు అన్యాక్రాంతం అయినట్టు తెలిసింది. ఈ ఆక్రమణలపై జిల్లా కలెక్టర్ దృష్టి సారించాలి. నవంబర్ 26న కేశవదాసుపాలెంలో పర్యటించినప్పుడు తక్షణ ఉపశమన చర్యల ఆవశ్యకతను గుర్తించాం. ఫైలు ముఖ్యమంత్రి గారి కార్యాలయంతో పాటు సంబంధిత ప్రభుత్వ శాఖల ముందు ఉంచాం. ఆర్థిక పరిస్థితి చూస్తే ఈ ఏడాది బడ్జెట్ కేటాయించేందుకు నిధుల సమస్య ఉంది. అలాంటి పరిస్థితుల్లో కూడా కోనసీమ కొబ్బరి రైతుల సమస్యను ప్రాధాన్యతాంశంగా స్వీకరించి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సహకారంతో నిధులు మంజూరు చేయించుకోగలిగాం. కోనసీమ కొబ్బరి రైతుల సమస్యకు ప్రాధాన్యత ఇచ్చి అండగా నిలిచినందుకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాం.

**నాడు కౌలు రైతుల కుటుంబాలకు భరోసా**

పది మందికి అన్నం పెట్టే రైతుకు కష్టం వస్తే చాలా బాధ కలుగుతుంది. గతంలో ఒక ముక్కోటి ఏకాదశి రోజున మంత్రి నాదెండ్ల మనోహర్ కౌలు రైతుల ఆత్మహత్యల అంశాన్ని నా దృష్టికి తీసుకువచ్చారు. ఆ రోజున కౌలు రైతుల కుటుంబాలకు ఎంత మేరకు సహాయం చేయగలం, వారి బతుకులకు భరోసా ఇవ్వాలని ఆలోచన నుంచే కౌలు రైతు భరోసా యాత్ర అనే గొప్ప కార్యక్రమం మొదలయ్యింది. అదే రోజు ఓ సినిమా ఒప్పుకొని, అప్పుడు వచ్చిన అడ్వాన్స్ డబ్బు రూ. 5 కోట్లను కౌలు రైతుల కోసం ఇచ్చేసి కౌలు రైతు భరోసా యాత్ర ప్రారంభించాం. మరికొందరు దాతల సహకారంతో కూటమి ప్రభుత్వం రైతుల కోసం ఎన్నో చేస్తుంది. త్వరలో పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయబోతున్నాం.

ఆ దిశలోనే ఇప్పుడు శంకరగుప్తం డ్రెయిన్‌కి రూ. 20.77 కోట్లతో ఊపిరిపోయబోతున్నాం. శంకరగుప్తం మేజర్ డ్రెయిన్ ఆధునీకరణతో వందలాది మంది కొబ్బరి రైతులకు ఉపసమనం కలుగుతుంది. ఇప్పటి వరకు జరిగిన నష్టాన్ని పూడ్చలేకపోయినా.. భవిష్యత్తు నష్టాన్ని నివారించేందుకు ఆధునికీకరణ పనులు ఉపయోగపడతాయి.

ఈ కార్యక్రమానికి సహకరించిన జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ కూడా ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. ఇది ఆరంభం మాత్రమే. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో డ్రెయిన్లు, పంట కాలువల ఆధునీకరణకు సుమారు రూ. 4 వేల కోట్లు అవసరం అని గత పర్యటనలో అధికారులు చెప్పారు.

కోనసీమ ప్రాంతంలో డ్రెయిన్లపై నీటిపారుదలశాఖ నిపుణులు బి.సి. రోశయ్య గారి రిపోర్టుపై అధ్యయనం చేస్తున్నాం. నివేదిక వచ్చిన వెంటనే మంత్రివర్గంలో చర్చించి డ్రెయిన్ల ఆధునీకరణ అంశాన్ని ముందుకు తీసుకువెళ్తాం. కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమానికి, ముఖ్యంగా కోనసీమ కొబ్బరి రైతుల సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉంది. కోనసీమలో కోకోనట్ బోర్డు ఏర్పాటు అంశాన్ని కేంద్రం దృష్టికి తీసుకువెళ్తాం" అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కృష్ణ తేజ, ఇతర ఉన్నతాధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# తెలంగాణలో పలువురు ఐఏఎస్‌ల బదలీలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్.డిసెంబరు30:**తెలంగాణ రాష్ట్రంలో పలువురు ఐఏఎస్ అధికారుల బదిలీలు, నియామకాలకు సంబంధించి ప్రభుత్వం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. పరిపాలనా వ్యవస్థను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఈ మార్పులు చేపట్టినట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఈ బదిలీల్లో జీహెచ్ఎంసీ, జిల్లా కలెక్టర్ పదవులు, కీలక శాఖల కమిషనర్ పోస్టులు ఉన్నాయి. పంచాయతీరాజ్ డైరెక్టర్‌గా ఉన్న జి.శ్రీజనను గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో (కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి, కుత్బుల్లాపూర్ జోన్లు) అదనపు కమిషనర్‌గా బదిలీ చేశారు. నిజామాబాద్ కలెక్టర్‌గా ఉన్న వినయ్ కృష్ణారెడ్డిని జిహెచ్ఎంసీ(మల్కాజ్‌గిరి, ఎల్‌బినగర్, ఉప్పల్‌జోన్లు)లో అదనపు కమిషనర్‌గా బదిలీ అయ్యారు. హైదరాబాద్ నగర పరిపాలన మరింత సమర్థవంతంగా ఉండేందుకు ఈ నియామకాలు దోహదపడతాయని అధికారులు భావిస్తున్నారు. నగర అభివృద్ధి, మౌలిక సదుపాయాలు, పారిశుద్ధం, పట్టణ ప్రణాళిక వంటి అంశాల్లో వీరి పాత్ర కీలకంగా ఉండనుంది. వుమెన్ చైల్డ్ వెల్‌ఫేర్ డైరెక్టర్‌గా ఉన్న శృతి ఓజాకు పంచాయతీరాజ్ శాఖ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు ఇచ్చారు. గ్రామీణ అభివృద్ధి, పంచాయతీరాజ్ సంస్థల పర్యవేక్షణ, గ్రామస్థాయి పరిపాలన బలోపేతం దిశగా ఈ నియామకం ప్రాధాన్యత సంతరించుకుంది. గ్రామీణ మౌలిక వసతులు, సంక్షేమ పథకాల అమలుపై ప్రత్యేక దృష్టిసారించే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. నల్గొండ జిల్లా కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఇలా త్రిపాఠిని నిజామాబాద్ జిల్లా కలెక్టర్‌గా బదిలీ చేశారు. సంగారెడ్డి అదనపు కలెక్టర్ బదులు చంద్రశేఖర్‌ను నల్గొండ జిల్లా నూతన కలెక్టర్‌గా బదిలీ చేశారు. నల్గొండ జిల్లాలో సాగునీరు, వ్యవసాయం, పరిశ్రమలు, ఉపాధి వంటి రంగాలపై ప్రత్యేక దృష్టి పెట్టే అవకాశం ఉందని అధికార వర్గాలు చెబుతున్నాయి. ఇక నారాయణపేట జిల్లాలో అదనపు కలెక్టర్‌గా ఉమాశంకర్ ప్రసాద్‌ను నియమించారు.

# హైకోర్టులో ఊరట

>> రిజర్వేషన్ల పాయింట్లను సవాల్ చేస్తూ, ప్రభుత్వ నిర్ణయాలు సుప్రీం కోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా ఉండాలని పేర్కొన్నారు. ఈ విషయంపై విచారణ జరిపిన ఆంధ్రప్రదేశ్ హైకోర్టు, రిజర్వేషన్‌ను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లను తిరస్కరించింది.



మంగళవారం కోలకతాలో మీడియాతో మాట్లాడుతున్న కేంద్రహోంమంత్రి అమిత్‌షా

# సంక్షేమగృహాలపై గట్టి నిఘా

>> పరిశీలించేందుకు క్షేత్రస్థాయి పర్యటనల చేపట్టడంతో పాటు పరిస్థితులపై నిత్యం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించుకోవాలి.సంక్షేమ రంగానికి చెందిన శాఖలన్నీ కలిపి ఉమ్మడిగా ఓ కమాండ్ కంట్రోల్ రూం ఏర్పాటు చేసుకోవాలి. అన్ని హాస్టళ్లల్లోని విద్యార్థులకు డిజిటల్ హెల్త్ రికార్డ్స్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలి. వైద్య పరీక్షలు నిర్వహించే సందర్భంగా విద్యార్థుల్లో ఏమైనా ఆరోగ్య సమస్యలు గుర్తిస్తే,ఆ అనారోగ్య సమస్యలకు గల మూలాలను విశ్లేషించాలి. దానికి అనుగుణంగా వైద్యం అందేలా చూడాలి. ఏజెన్సీ ప్రాంతాల్లోని హాస్టళ్లపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం పెరిగేలా ప్రత్యేక కౌన్సిలర్లతో కౌన్సిలింగ్ ఇప్పించండి. బాలుర హాస్టళ్లల్లోని వారికి మగ కౌన్సిలర్ల ద్వారా బాలికల హాస్టళ్లోని వారికి మహిళాకౌన్సిలర్లతో కౌన్సిలింగ్ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలి. ఎలాంటి పరిస్థితుల నైనా తట్టుకునే ఆత్మస్థైర్యంతో నిలబ డగలిగేలా విద్యార్థులను తీర్చి దిద్దాలి. హాస్టళ్లల్లో నీటి సరఫరా విషయంలో పంచాయతీరాజ్, హెల్త్, మున్సిపల్ శాఖలు, సంక్షేమ, వైద్యారోగ్య శాఖలు కలిసి పని చేయాలి. అన్ని హాస్టళ్లల్లో వాటర్ శాంపిల్స్ కూడా తీసుకోవాలి. ఎనిమియా, సికెల్ సెల్ వ్యాధులపై అవగాహన కల్పించే బాధ్యతను అధికారులపైనే ఉందని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

# ఆర్థికవృద్ధిలో జపాన్‌ను అధిగమించిన భారత్

## 4.1 లక్షలకోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థకు చేరిక

## 2030 నాటికి జర్మనీని సైతం అధిగమిస్తుందని రేటింగ్స్ అంచనాలు

**న్యూఢిల్లీ, డిసెంబరు 30:** ఆర్థిక వ్యవస్థ వృద్ధితో భారత్ ప్రపంచంలోనే నాలుగో అతిపెద్ద ఆర్థికవ్యవస్థ ఉన్న దేశంగా నిలిచింది. ప్రస్తుతం నాలుగోస్థానంలో ఉన్న జపాన్‌ను అధిగమించి 4.18 లక్షలకోట్ల డాలర్లకు చేరింది. 2030 నాటికి జర్మనీని సైతం అధిగమిస్తుందని అంచనాలున్నాయి. శరవేగంగా అభివృద్ధిచెందుతున్నదేశంగా కొనసాగుతున్న భారత్ దేశీయంగా వినియోగం, నిర్మాణాత్మక సంస్కరణలతో మరింత వృద్ధి వేగవంతం అవుతోంది. భారత్ వాస్తవ జిడిపి 8.2శాతం రెండోత్రైమాసికంలో పెరిగింది. అంతకుముందు తొలిత్రైమాసికంలో 7.8శాతంకాగా గత ఏడాది నాలుగో త్రైమాసికంలో 7.4శాతం మాత్రమే వృద్ధిని నమోదుచేసింది. 2030 నాటికి భారత్ 7.3 లక్షలకోట్ల డాలర్ల జిడిపితో ఉంటుందని అంచనా. అంతర్జాతీయ సంస్థలు కూడా భారత్ వృద్ధి అవకాశాలపై సానుకూలంగా రేటింగ్ ఇచ్చాయి. ప్రపంచ బ్యాంకు 2026 లో 6.5శాతం ఉంటుందని,మూడీస్ రేటింగ్ అయితే 6.4శాతంగా ఉంటుందని 2027లో 6.5శాతం ఉంటుందని అంచనాలు వేసింది. ఇక అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ అయితే భారత్ అంచనాలు 2025లో 6.6శాతం, 2026లో 6.2శాతంగా ఉంటాయి. ఇక ఒఇసిడి అంచనాలు 2025లతో 6.7శాతం, 2026లో 6.2శాతంగా ఉంటాయని తేల్చింది. ఇక అమెరికాకు చెందిన ఎస్‌అండ్‌పి 6.5శాతం 2025-26లోను వచ్చే 2026 ఆర్థికసంవత్సరానికిగాను 6.7శాతంగాను ఉంటుందని వెల్లడించింది. ఆసియా అభివృద్ధి బానయంకు కూడా భారత్ వృద్ధి అంచనాలను 7.2శాతంగా వెల్లడించింది. ఫిట్చ్ రేటింగ్స్ కూడా భారత్ 2026 ఆర్థికవృద్ధి 7.4శాతంగా ఉంటుందని తెలిపింది. వృద్ధికి మూలకారణాలు ద్రవ్యోల్బణం అందుపులోనే ఉండటం, రిజర్వుబ్యాంకు అంచనాలకు అనుగుణంగానే కొనసాగడం, నిరుద్యోగం తగ్గడం, ఎగుమతులు పెరగడం వంటివి మూల కారణాలుగా రేటింగ్స్ సంస్థలు వర్ణిఇస్తున్నాయి. ఆర్థిక పరిస్థితులు స్థిరంగాను పటిష్టంగాను ఉన్నాయని, వాణిజ్యరంగానికి రుణసాయం కూడా సులువుగానే అందుతోంది.

# పాస్ పుస్తకాల పంపిణి

>> ఆదేశించాం. గ్రేటర్ విజయవాడ,తిరుపతి ప్రతిపాదనలు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయి. రాబోయే రోజుల్లో వాటిని మహా నగరాలుగా అభివృద్ధి చేయనున్నాం'అని సత్యప్రసాద్ వివరించారు.

# మరో 11 ప్రత్యేక రైళ్లు

>> కొన్ని రైళ్ళకు టికెట్ బుక్కింగ్ ఈ రోజు ఉదయం 8 గంటల నుంచి ప్రారంభమైంది. సంక్రాంతికి స్వగ్రామాలకు వెళ్ళే వారికి ఈ ప్రత్యేక రైళ్ళు చాలా ఉపయోగంగా ఉంటాయని రైల్వే అధికారులు తెలిపారు. ప్రయాణానికి ముందు రైలు సమయాలు చూసుకొని టికెట్ బుక్ చేసుకోవాలని సూచించారు.

# స్థాయి పెంపు

>> గిరిజన ప్రాంతవాసులు సౌక ర్యవంతమైన రోడ్డు ప్రయాణం అందించడమే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వం గిరిజన ప్రాంతాల సర్వతోముఖాభివృద్ధికి పెద్ద పీట వేస్తోందన్నారు. అందులో భాగంగా గిరిజన రైతుల జీవనోపాధిని మెరుగుపర్చేందుకు రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో అన్ని ఐటీడీఏలకు రూ.13.70కోట్ల నిధులను విడుదల చేశామన్నారు. 9ఐటీడీఏల పరిధిలో ట్రైకార్ రుణాలను పునరుద్ధరించామన్నారు. గిరిజన రైతులకు 90శాతం భారీ సబ్సిడీతో ట్రాక్టర్లు,మినీ ట్రాక్టర్లు,ట్రక్కులు,ఆయిల్ ఇంజిన్లు,టార్పాలిన్లు పంపిణీ చేయనున్నామని ప్రకటించారు. అంతే కాకుండా పశుపోషణ ద్వారా అదనపు ఆదాయం కలి ్పంచేందుకు గోకులాలు మంజూరు చేస్తున్నా కీలక నిర్ణయం తీసుకున్న విషయాన్ని గుర్తు చేశారు. రానున్న 2026లో మరింత రెట్టింపు ఉత్సాహంతో పని చేస్తామని ప్రకటించారు.

# పేరు మార్పు

>> వేసింది. రాజధానిలో రూ.538 కోట్ల విలువైన వివిధ పనుల ప్రతిపాదనల్నీ ఆమోదించింది. రాజధానిలో రూ.137 కోట్లతో అమరావతి క్వాంటమ్ కంప్యూటింగ్ సెంటర్ నిర్మాణ పనులను టెండర్‌లో తక్కువకు కోట్ చేసిన ఎల్ అండ్ టీ కి అప్పగిస్తూ ఈ నిర్ణయం తీసుకుంది.రూ. 41.61 కోట్ల వడ్డీ మాఫీ: తద్వారా నెలకు రూ.22.5 కోట్లు, ఏడాదికి రూ. 270 కోట్లు ఆదాయం వస్తుందని అంచనా వేస్తోంది. కేంద్ర ప్రాయోజిత పథకాలైన జాతీయ ఎస్సీ ఆర్థికాభివృద్ధి సంస్థ ఎన్ఎస్ఎఫ్‌డీసీ (నేషనల్ షెడ్యూల్డ్ కాస్ట్స్ ఫైనాన్స్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్), జాతీయ సఫాయి కర్మచారీ ఆర్థికాభివృద్ధి సంస్థ కింద రాయితీ రుణాలు పొందిన 11,479 మందికి ప్రభుత్వం తీపికబురు చెప్పింది. కొన్నేళ్లుగా వాయిదాలు చెల్లించకపోవడం వల్ల పేరుకుపోయిన రూ.41.61 కోట్ల రూపాయల వడ్డీ మాఫీకి ఆమోదం తెలిపింది.

## వారం - వర్జ్యం

31-12-2025, బుధవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
పుష్యమాసం, దక్షిణాయణం
హేమంత ఋతువు, శుక్లపక్షం
ద్వాదశి రా.1.46
కృత్తిక రా.1.28, పూర్వాషాఢ కార్తె
వర్జ్యం : మ.3.41-5.06
దు.ఉ.11.41-మ.12.33
శుభసమయం : ఉ.6.30-7.30
రాహుకాలం - మ.12.00-1.30

## వార్తాఫలం

**మేషం:**జీవిత భాగస్వామి సలహాతో కొత్త కార్యక్రమాలు చేపడతారు. వ్యాపారాలలో మంచి మార్పులు ఉంటాయి.

**వృషభం:** జీవితాశయాన్ని ఏ విధంగానయినా సరే సాధించాలని దృఢ నిర్ణయానికి వస్తారు. సోదరుల కలయిక.

**మిథునం:**చర్మసంబంధిత బాధలు కలుగ కుండా జాగ్రత్తలు పాటించండి. మొండి వ్యవహారాలను కాలానికి వదిలివేస్తారు.

**కర్కాటకం :**మీ పరోక్షంలో జరుగుతున్న అన్ని పనులను కూడా గమనిస్తూ కఠినంగా ప్రవర్తిస్తారు. ప్రయాణాలు.

**సింహం:**సంతానాన్ని సక్రమమైన పంథాలో నడిపించడానికి విశేషంగా కృషి చేస్తారు. ఆరోగ్యం పట్ల జాగ్రత్త అవసరం.

**కన్య :** చికాకు కలిగించే కుటుంబ పరిస్థితులకు దూరంగా పారిపోకుండా సమర్థవంతంగా బాధ్యతలు నెరవేరుస్తారు.

**తుల :**అప్పుచేయకపోవటమే నిజమైన పొదుపు అని గుర్తిస్తారు. ప్రతికూల వాతావరణాన్ని కూడా కృషితో అనుకూలంగా మలచుకుంటారు.

**వృశ్చికం:** ఎదుటివారి సంభాషణలలోని నిజానిజాలను గుర్తెరిగి తదనుకూలంగా నడుచుకుంటారు. వాహనయోగం.

**ధనుస్సు:** ఇంటా బయటా సమస్యలు ఎదురైన అధిగమిస్తారు. కుటుంబ సభ్యుల సహాయసహకారాలు అందుకుంటారు.

**మకరం:** సంతానరీత్యా సంఘంలో గౌరవ మర్యాదలు లభిస్తాయి. సన్నిహితుల నుండి విలువైన సమాచారం అందుకుంటారు.

**కుంభం:** అమ్మకాలు కొనుగోలుకు సంబంధించిన వ్యవహారాలు స్తబ్ధతగా ఉంటాయి. ఆధ్యాత్మిక కార్యక్రమాల పట్ల ఆసక్తి కనబరుస్తారు.

**మీనం :** జీవిత భాగస్వామితో సంయమనం పాటించి సానుకూల ఫలితాలు సాధిస్తారు. కోర్టుకేసుల నుండి బయటపడతారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# పవిత్ర 'వైకుంఠవాకిలి' దర్శనంతో పులకింత

**తిరుమల,డిసెంబర్ 30ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగవైకుంఠం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఎల బ్రహ్మముహూర్తంలోపెద్దసంఖ్యలో ప్రముఖులు పవిత్రమైన వైకుంఠవాకిలి దర్శనాలను చేసుకున్నారు. ధనుర్మాసంలో వైకుంఠ ఏకాదశి ఘడియలు అర్ధరాత్రి దాటిన తరువాత ఆరంభం కావడంతో మంగళవారం వేకువజామున 1.30గంటల నుండి ఉదయం 6.30గంటల వరకు ఏకధాటిగా దేవదేవుడ్ని వైకుంఠద్వారంలో దర్శనం చేసుకున్న ప్రముఖులు పులకించారు. వైకుంఠ ఏకాదశి పర్వదినాన పవిత్రత ప్రతి ఒక్కరి జీవితంలో శాంతి ,సద్గుణాలు, ఆధ్యాత్మిక ఉత్సాహాన్ని నింపాలని ప్రముఖులంతా ఆకాంక్షించారు. ఆపదమొక్కులవాడి ఆశీస్సులతో తెలుగుప్రజలు సుభిక్షంగా ఉండాలని వేడుకున్నట్లు ప్రముఖులు తెలిపారు. వైకుంఠ ఏకాదశి ఘడియల్లో మంగళవారం వేకువజామున ఆలయంలో వైకుంఠద్వారాలు తెరచుకున్నాయి. విశేష పూజలు నిర్వహించిన అనంతరం రాజ్యాంగపరిధిలోని ప్రోటోకాల్ ప్రముఖులు సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులు, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కుటుంబంతో కలసి ఆలయంలోనికి ప్రవేశం కల్పించారు. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణమరాజు, తెలంగాణ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, కేంద్రమంత్రి కింజారపు రామ్మోహన్‌నాయుడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమంత్రులు నిమ్మలరామానాయుడు, అచ్చెన్నాయుడు, పయ్యావుల కేశవ్, కొండపల్లి శ్రీనివాస్, అనగాని సత్యప్రసాద్, కొల్లురవీంద్ర,సవిత, ఎంఎల్‌సిలు పోచంపల్లి శ్రీనివాస్, కల్యాణి, దువ్వాడ శ్రీనివాస్ దంపతులు, ఎంపిలు మిథున్‌రెడ్డి, డికె అరుణ, ఎమ్మెల్యేలు రాజాసింగ్, మల్లారెడ్డి, మాజీ ఎంపి సంతోష్ వైకుంఠమ్ 1క్యూకాంప్లెక్స్ మార్గంలో ఆలయంలోనికి ప్రవేశించిన ప్రముఖులందరూ హారతి లేని లఘు దర్శనంలో వైకుంఠద్వార దర్శనం చేసుకున్నారు. సాక్షాత్తు వైకుంఠంలో శ్రీమహావిష్ణువే కలియుగంలో శ్రీవేంకటేశ్వరస్వామిగా కొలువై భక్తులను కటాక్షిస్తున్నారు.



కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు ,ఎపి మంత్రులు

వైకుంఠద్వారంలో వేంకటేశ్వరునిదర్శించుకుని ప్రముఖులంతా భక్తిపారవశ్యం చెందారు. తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, టిటిడి ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, టిటిడి సివిఎస్‌ఒ కెవి మురళీకృష్ణ ,పలుశాఖల అధికారులు చక్కగా దర్శనం ,వసతి సౌకర్యాలు కల్పించారని ప్రముఖులు అభినందించారు. వేకువజామున 1.30గంటలనుండి ఉదయం 6గంటల వరకు ఏకధాటిగా ఐదుగంటల పాటు రాజ్యాంగపరిధిలోని ప్రముఖులు ఏడుకొండల వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. వీరందరికీ స్వయంగా టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, టిటిడి అదనపు ఇఒ వెంకయ్యచౌదరి ఆలయ వర్గాలు చక్కటి సంతృప్తికర దర్శనం చేయించారు. ఉదయం ఆరుగంటలకు ఆన్‌లైన్‌లో టోకెన్లు పొందిన స్లాట్ భక్తులను దర్శనాలకు అనుమతించారు. భక్తులు గోవింద నామస్మరణలు చేసుకుంటూ ఆలయంలోనికి చేరుకున్నారు. తొలిరోజు ప్రముఖులతో బాటు సామాన్యభక్తులు భక్తితో ప్రశాంతంగా వైకుంఠవాకిలి దర్శనం చేసుకోవడం విశేషం.

# తిరుమల సమాచారం

## వైకుంఠ ఏకాదశినాడు స్వర్ణరథమెక్కిన శేషాచలాధీశుడు

**తిరుమల,డిసెంబర్ 30ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగవైకుంఠంగా విరాజిల్లుతున్న శేషాచలకొండల్లో కొలువైన శ్రీవేంకటేశ్వరస్వామి వైకుంఠ ఏకాదశి పర్వదినాన మంగళవారం ఉదయం స్వర్ణమయమైన మహోన్నత రథం అధిరోహించి భక్తులను కటాక్షించాడు.శ్రీదేవిభూదేవిసమేత మలయప్పస్వామి ఉత్సవ మూర్తులను విశేషాభరణాలంకృతుడ్ని చేసిన అర్చకులు బంగారురథంపై అధిరోహింపజేశారు. ఉదయం చక్కటి వాతా వరణంలో చల్లటిగాలులు వీస్తుండగా భగవంతుడు శైల్య,సుగ్రీవ, మేఘ,పుష్ప, పలహాకా అనే నాలుగు గుర్రాలు పూన్చిన స్వర్ణరథం ఎక్కి విహరించాడు. దారుకుడు ఆయన సారధి. ఈ రథంమీద పయనిస్తూన్న శ్రీమలయప్పస్వామిని దర్శించిన భక్తులు గోవిందనామంతో పునీతులయ్యారు. ఈ వాహనసేవలో పెద్ద జీయంగారు, చిన్నజీయంగారు, టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, టిటిడి ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, సివిఎస్‌ఒ మురళీకృష్ణ, బోర్డు మహిళ సభ్యులు, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, అర్చకులు, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.



## వైకుంఠాన్ని తలపిస్తున్న తిరుమలగిరులు

### - తిరుమల ఆలయం వెలుపల సినీనటుడు చిరంజీవి కుటుంబం



**తిరుమల,డిసెంబర్ 30ప్రభాతవార్తప్రతినిధి:** దేవలోకంలో వైకుంఠాన్ని తలపించేలా కలియుగక్షేత్రం తిరుమలను టిటిడి అధికారులు అద్భుతంగా ఫల, పుష్పఅలంకరణలు, విద్యుద్దీపకాంతులతో చక్కగా తీర్చిదిద్దారు. అన్నిటికంటే మించి తిరుమల ఆలయం సమీపంలో శ్రీరంగాన్ని తలపించేలా రంగనాధస్వామి ఆలయ సెట్టింగ్స్‌తో దర్శనం టోకెన్ లేని భక్తులు ఈ ఆలయాన్ని సందర్శించి మోక్షం పొందామని అనుభూతి కలుగుతోంది. ఆలయంలోపల, వెలుపల సువాసనల పుష్పాలతో బంగారువాకిలి, ఆనందనిలయం, వెండివాకిలి, ధ్వజస్తంభం, బలిపీఠం,మహాద్వారం ,గోపురం ప్రాంతాలను ఆధ్యాత్మిక అనుభూతి కలిగించేలా తీర్చిదిద్దారు.ఆలయంపైభాగాన మహాద్వారం గేట్‌పైన వైకుంఠంలో శ్రీమహావిష్ణువు కొలువైనట్లు అద్భుతంగా తీర్చిదిద్దారు. వైకుంఠ ఏకాదశి పర్వదినాన పలువురు సినీప్రముఖులు ప్రముఖ నటుడు చిరంజీవి కుటుంబసభ్యులు, సినీనటుడు రాజేంద్రప్రసాద్, సినీనటుడు బాలకృష్ణ సతీమణి నందమూరి వసుంధర, నారారోహిత్,శివాజీ, శ్రీలీల,నటి హేమ, సినీనిర్మాతలు దానయ్య, బండ్ల గణేశ్, ఇండియన్‌క్రికెటర్ తిలక్‌వర్మ, సూర్యకుమార్‌యాదవ్, చాముండేశ్వరినాథ్, సామాన్యభక్తులు వెంకన్న దర్శనంతో బాటు వైకుంఠద్వార దర్శనం ప్రశాంతంగా చేసుకున్నారు. రాత్రి వరకు 55వేలమంది భక్తులకు మహాలఘులో దర్శనం కల్పించారు. రు.



శ్రీవారి వైకుంఠద్వార దర్శనంలో సినీ ప్రముఖులు

## వైకుంఠ ఏకాదశి సందర్భంగా మాజీ సిఎం జగన్ శుభాకాంక్షలు

**విజయవాడ,డిసెంబరు 30,ప్రభాతవార్తప్రతినిధి:** వైకుంఠ ఏకాదశి సందర్భంగా .మంగళవారం వైసిపి అధినేత వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి తెలుగు ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఆ వైకుంఠవాసుడి ఆశీస్సులు అందరిపై ఉండాలని కోరుకుంటూ.. తెలుగు ప్రజలందరికీ వైకుంఠ ఏకాదశి శుభాకాంక్షలు అంటూ తన ఎక్స్ ఖాతా ద్వారా జగన్ పోస్టు పెట్టారు.

## దేవాదాయ ధర్మాదాయ శాఖ సలహాదారుగా చుండూరి సీతారామాంజనేయ ప్రసాద్ నియామకం



**విజయవాడ,డిసెంబరు 30,ప్రభాత వార్తప్రతినిధి:** చుండూరి సీతారామాంజనేయ ప్రసాద్‌ను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ సలహాదారుగా రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. పదవీ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ఆయన రెండేళ్ల పాటు ఈ పదవిలో కొనసాగుతారు. ఒంగోలులో జన్మించి, అక్కడే విద్యాభ్యాసం పూర్తి చేసిన సీతారామాంజనేయ ప్రసాద్ చిన్నతనం నుంచే ఆధ్యాత్మిక భావాలతో పెరిగారు. యువకుడిగా ఉన్నప్పుడే అనేక ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహిస్తూ గుర్తింపు పొందారు. 2014-19 మధ్య కాలంలో తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ హయాంలో దేవాదాయ శాఖ పరిధిలోని హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్ట్ (హెచ్‌డీపీటీ) చైర్మన్‌గా ఆయన సేవలందించారు. ఆ సమయంలో రాష్ట్రంలోని అనేక దేవాలయాల జీర్ణోద్ధరణ చేపట్టడంతో పాటు, పలు ప్రాంతాల్లో కోటి దీపోత్సవం, దశ సహస్ర సువాసినీ పూజ వంటి విశిష్ట కార్యక్రమాలను నిర్వహించారు.

## అజ్ఞాతంలోకి వైసిపి నేత వల్లభనేని వంశీ



**విజయవాడ,డిసెంబరు 30,ప్రభాత వార్తప్రతినిధి:** గన్నవరం మాజీ ఎమ్మెల్యే, వైసీపీ కీలక నేత వల్లభనేని వంశీ అజ్ఞాతంలోకి వెళ్ళిపోయారు. ఈ అంశం తాజాగా రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. కొన్ని రోజులుగా ఆయన ఎవరికీ అందుబాటులోకి రాకుండా అండర్‌గ్రౌండ్‌లోకి వెళ్లినట్లు తెలుస్తోంది. విజయవాడలోని మాచవరం పోలీసులు తనను ఏ క్షణమైనా అరెస్టు చేసే అవకాశం ఉందన్న అనుమానంతోనే ఆయన అందుబాటులోకి లేకుండా పోయినట్లు భావిస్తున్నారు. ఈ నెల 17న విజయవాడ మాచవరం పోలీస్ స్టేషన్‌లో నమోదైన హత్యాయత్నం కేసులో వంశీని ప్రధాన నిందితుడిగా (ఏ1) పోలీసులు చేర్చారు. 2024 జూన్ 7న సునీల్ అనే వ్యక్తిపై దాడి చేయాలని తన అనుచరులను వంశీ రెచ్చగొట్టడంతో వారు కర్రలు, మారణాయుధాలతో తీవ్రంగా గాయపరిచారని నేరాభియోగం నమోదైంది. ఈ కేసులో వంశీతో పాటు యతీంద్ర రామకృష్ణ, కొమ్మా కోట్లు, ఒలుపల్లి రంగా, కాట్ర శేషు, ఎం.బాబు, మల్పూరి ప్రభుకాంత్, అనగాని రవి సహా పలువురు నిందితులుగా ఉన్నారు.

వారం రోజుల క్రితమే వంశీ నివాసానికి వెళ్లిన పోలీసులు సమన్లు ఇచ్చేందుకు ప్రయత్నించగా, ఆయన అక్కడ అందుబాటులో లేరు. ఈ క్రమంలోనే ముందస్తు బెయిల్ కోసం ఆయన హైకోర్టును ఆశ్రయించినా,

న్యాయస్థానం నుంచి ఎలాంటి ఉపశమనం లభించలేదు. దీంతో ఆయన తన ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి అజ్ఞాతంలోకి వెళ్లారు. తాజాగా సోమవారం విజయవాడ ఎస్సీ, ఎస్టీ కోర్టులో జరగాల్సిన సత్యవర్ధన్ కేసు విచారణకు కూడా వంశీ, ఆయన అనుచరుడు ఒలుపల్లి రంగా గైర్హాజరయ్యారు. ప్రస్తుతం వంశీ కోసం పోలీసులు ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టారు.

# వైకుంఠ ఏకాదశి పర్వదినాన ఆలయాలకు పోటెత్తిన భక్తజనం

- తెల్లవారుజామునుంచే భక్తులు బారులు
- ప్రత్యేక పూజలు, గ్రామోత్సవాల నిర్వహణ

విజయవాడ, డిసెంబరు 30 ప్రభాతవార్త ప్రతినిధి: వైకుంఠ ఏకాదశి వేడుకలు రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా జరిగాయి. ధనుర్మాసంలో వచ్చే వైకుంఠ ఏకాదశికి ప్రత్యేక విశిష్టత వుందనీ, ఈ రోజున విష్ణుమూర్తి వైకుంఠ ద్వారాలు తెరుస్తారనీ, ఆయనను దర్శించుకుంటే మోక్షం లభిస్తుందని భక్తుల నమ్మకం, స్వర్గద్వార ఏకాదశి అని కూడా పిలిచే ఈ రోజునే మహావిష్ణువు గరుడ వాహనంపై మూడు కోట్ల దేవతలతో భూలోకానికి వచ్చి భక్తులకు దర్శనమిస్తారని పురాణాలు చెబుతున్నాయి.. తెల్లవారుజాము నుంచే వైష్ణవాలయాలకు భక్తులు భారీగా తరలివచ్చారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా కడప జిల్లాలోని ఆలయాలు తెల్లవారుజామున నుంచే భక్తులతో రద్దీగా మారాయి. కడపలోని తిరుమల తొలిగడప దేవుని కడప శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయం, ఒంటిమిట్ట శ్రీ కోదండరామయ్య స్వామి ఆలయాలకు తెల్లవారుజామున రెండు గంటల నుంచే భక్తులు పోటెత్తారు. ఉత్తర ద్వార దర్శనం ద్వారా స్వామివారిని దర్శించుకుని పునీతులయ్యారు. భక్తులకు ఇబ్బందులకు కలగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. జమ్మలమడుగులోని శ్రీ నారాపుర వెంకటేశ్వరస్వామి దేవాలయంలో భక్తుల సందడి నెలకొంది. ఆలయ పూజారులు వైకుంఠ ఏకాదశి విశిష్టతను భక్తులకు తెలియజేశారు. కోనసీమ తిరుమలగా పేరుగాంచిన ఆత్రేయపురం మండలం వాడపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆలయాన్ని వివిధ రకాల పుష్పాలతో అందంగా అలంకరించారు. భక్తులు వేల సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతపురం జిల్లా రాయదుర్గం కోటలో వెలసిన సుప్రసిద్ధ శ్రీదేవి భూదేవి సమేత శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామికి అర్చకులు వేదమంత్రోచ్చరణల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీవారిని దర్శించుకోవడానికి భక్తులు పెద్ద ఎత్తున బారులు తీరారు. ఉరవకొండ శ్రీవెంకటేశ్వరస్వామి,



బెలుగుప్ప మండలం శ్రీరంగాపురం రంగనాథస్వామి ఆలయాల్లో వైకుంఠ ఏకాదశి వేడుకలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తుండడంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు చర్యలు చేపట్టారు. ప్రకాశం జిల్లాలోని యర్రగొండపాలెం, కనిగిరి, పామూరు మండలాల్లోని ఆలయాలు గోవిందా నామస్మరణతో మార్మోగాయి. విష్ణుమూర్తి ఉత్తర ద్వారం ద్వారా ప్రత్యేక అలంకరణతో భక్తులకు దర్శనమిచ్చారు. నందిగామలోని శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయం, తిరువూరు శ్రీ కోదండ రామాలయం, జగ్గయ్యపేటలోని దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పెనుగంచిప్రోలులోని శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవాలయంలో ఉత్తరద్వార దర్శనానికి జనం పోటెత్తారు. భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని పట్టణాలు, గ్రామాల్లోని వెంకటేశ్వరస్వామి ఆలయాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి.

# అంతర్ రాష్ట్ర బ్యాగ్ లిఫ్టింగ్ ముఠా అరెస్ట్

- రూ.75లక్షల బంగారు, వెండి నగలు స్వాధీనం
- మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్





**కడప క్రైం, డిసెంబరు 30, ప్రభాతవార్త:** కడప జిల్లాలో బస్సులు, బస్సు స్టాండ్లు మరియు ఆటోలలో ప్రయాణికులను లక్ష్యంగా చేసుకొని బ్యాగ్ లిఫ్టింగ్‌కు పాల్పడుతున్న అంతర్‌రాష్ట్ర దొంగల ముఠాను ఎర్రగుంట్ల పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసులో భారీగా దొంగ సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు కడప జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ మంగళవారం స్థానిక పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో మీడియా సమావేశంలో తెలిపారు. ఎర్రగుంట్ల, ముద్దనూరు, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, మైదుకూరు, బద్వేలు తదితర ప్రాంతాల్లో చోరీలకు పాల్పడిన ముఠా సభ్యుల నుంచి రూ.75లక్షలు విలువైన బంగారు, వెండి వస్తువులు స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. ప్రస్తుతం ఈ ముఠాపై 23 కేసులు చేధించడం జరిగిందని ఎస్పీ పేర్కొన్నారు. గత 10 సంవత్సరాలుగా గుంటూరు, శ్రీకాకుళం, నెల్లూరు, నంద్యాల, తూగో, కాకినాడ, బీఆర్ అంబేద్కర్ తదితర జిల్లాల్లో అనేక కేసులు నమోదయ్యాయన్నారు. పోషమ్మపై 15 కేసులు, ఆమె భర్త పోతురాజుపై 42 కేసులు, రావుల లక్ష్మి అలియాస్ అంబటి సీత అలియాస్ పిచ్చిలక్ష్మిపై సుమారు 10 కేసులు ఉన్నాయన్నారు. వారితో పాటు కావేటి అరుణపై 1, పాల శ్రీకాంత్ అలియాస్ స్వామిపై ఒక కేసు ఉందన్నారు. జిల్లాలో జరుగుతున్న బ్యాగ్ లిఫ్టింగ్ ఘటనలపై జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు జమ్మలమడుగు డీఎస్పీ పర్యవేక్షణలో ఎర్రగుంట్ల పీఎస్‌లో సీఐ విశ్వనాథ్, ఎస్సై నాగ మురళీ, సిబ్బందిలు తమ సిబ్బందిలో నిఘా ఉంచి బ్యాగ్‌లిఫ్టింగ్ ముఠాను తమకు రాబడిన సమాచారంతో ముద్దనూరు-కడప మెయిన్ రోడ్డు, వలసపల్లె క్రాస్ వద్ద సోమవారం అరెస్టు చేయడం జరిగిందన్నారు. ముఠాను అరెస్టు చేయడంలో తమ సిబ్బంది చేసిన కృషిని ఎస్పీ అభినందించారు.

## జగన్ అంటేనే ఒక ఫెయిల్యూర్ పొలిటీషియన్ :మంత్రి కొల్లు రవీంద్ర



**విజయవాడ,డిసెంబరు 30,ప్రభాతవార్తప్రతినిధి:** జగన్ అంటేనే ఒక ఫెయిల్యూర్ పొలిటీషియన్ అని మంత్రి కొల్లు రవీంద్ర కీలక వ్యాఖ్యలు చేసారు.మంగళవారం మంత్రి మీడియాతో మాట్లాడుతూ మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డిపై తీవ్రస్థాయిలో విమర్శలు చేసారు. దోచుకోవటం, దౌర్జన్యాలు చేయడం , ప్రజలను మభ్యపెట్టే కార్యక్రమాలు చేయడమే అతని విధానమన్నారు. తన విలాసవంతమైన నివాసం కోసం రిషికొండలో రూ.400 కోట్ల ప్రజల సొమ్ముతో విలాసవంతమైన భవనాన్ని కట్టుకున్నారన్నారు.రుషికొండ భవనానికి, యోగాకి లింకు పెడుతున్నాడు అంటే ఇలాంటి వ్యక్తులు ఉండటం దురదృష్టకరమన్నారు. యోగా అనేది మన సనాతనమైన ఆస్తి అని తెలిపారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చొరవతో 2014 నుంచి ప్రతి సంవత్సరం దేశంలో ఒక్కో ప్రాంతంలో నిర్వహిస్తున్నారని అన్నారు. వైజాగ్‌లో నిర్వహించిన యోగా డే ఖర్చు రూ.18 కోట్లు అని.. దానిని కేంద్ర ప్రభుత్వమే భరిస్తుందన్నారు. యోగా వల్ల ప్రజల మానసిక శారీరక ఆరోగ్యం మెరుగుపడుతుందని అన్నారు. ఏపీ ప్రభుత్వం నెల రోజుల పాటు యోగాపై ప్రజలకు అవగాహన కల్పిస్తే, అవగాహన లేని జగన్ దానిని రాజకీయం చేయాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ గురించి ఏం మాట్లాడాలో అర్థం కావట్లేదన్నారు. అతనికి ప్రజలే తగిన తీర్పునిచ్చారని తెలిపారు. స్టీల్ ప్లాంట్‌ను మరలా రివైజ్ చేస్తున్నామన్నారు. లాభాలలో నడుస్తోందని అన్నారు. అభివృద్ధి చేస్తున్నా ప్రజలను తప్పుదోవ పట్టించే దుర్మార్గమైన మనస్తత్వం కలిగిన వ్యక్తిగా జగన్ ఉన్నారంటూ విరుచుకుపడ్డారు. ప్రజల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాష్ట్రం అభివృద్ధి చెందటం జగన్మోహన్ రెడ్డికి ఇష్టం లేదన్నారు. జగన్ ఇలాంటి కార్యక్రమాలు చేస్తే వైఎస్ఆర్ పార్టీ సమాధిగా మారి పోతుందంటూ మంత్రి కొల్లు రవీంద్ర హెచ్చరించారు.

## ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుల్ కుటుంబానికి రూ.1 కోటి పరిహారం అందజేసిన సిఎం

**విజయవాడ డిసెంబర్ 30,ప్రభాతవార్తప్రతినిధి :** విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు మృతి చెందిన ఎక్సైజ్ శాఖ హెడ్ కానిస్టేబుల్ పిచ్చేశ్వర రావు కుటుంబానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రూ.1 కోటి పరిహార చెక్కును అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం-స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మధ్య 2025 మార్చిలో కుదిరిన అవగాహన ఒప్పందం ప్రకారం అమలులో ఉన్న ఎస్‌బీఐ బీమా పథకం కింద ఈ పరిహారం మంజూరైంది. ఒప్పందం తర్వాత ఈ పథకం ద్వారా పరిహారం అందజేయడం ఇదే తొలిసారి. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మృతుడి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కుటుంబ సభ్యుల్లో అర్హులైన వారికి కారుణ్య నియామకం కల్పిస్తామని తెలిపారు. ఎక్సైజ్ శాఖను ప్రభుత్వం ఏర్పడిన తక్కువ సమయంలోనే పునఃవ్యవస్థీకరించి, సమర్థంగా ముందుకు నడిపించినందుకు ముఖ్యమంత్రికి ఎక్సైజ్ అధికారులు, ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. శాఖ అభివృద్ధికి సహకరించిన ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్రకు, ముఖ్య కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనాలను అభినందించారు. ఎక్సైజ్ శాఖ అధికారులను ఉద్దేశించి ముఖ్యమంత్రి మాట్లాడుతూ, అందరూ నిబద్ధతతో పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. ప్రభుత్వ ఆదాయం కన్నా ప్రజల ఆరోగ్యం ఎంతో ముఖ్యమని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు.

## వైకుంఠ ఏకాదశి సందర్భంగా సిఎం చంద్రబాబు శుభాకాంక్షలు

**విజయవాడ,డిసెంబరు 30,ప్రభాతవార్తప్రతినిధి:** వైకుంఠ ఏకాదశ పవిత్ర దినాన్ని తెలుగు వారు భక్తి ప్రపత్తులతో జరుపుకుంటారు. ఈ సందర్భంగా తెలుగు ప్రజలకు సీఎం చంద్రబాబు నాయుడు శుభాకాంక్షలు తెలిపారు. శ్రీమహావిష్ణువుకు అత్యంత ప్రీతిపాత్రమైన వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా తెలుగు ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ పర్వదినాన ఉత్తర ద్వార దర్శనం చేసుకుంటే సకల పుణ్యాలు లభిస్తాయని పురాణాలు చెబుతున్నాయన్నారు. పవిత్రమైన ఈ పండుగ సందర్భంగా అందరికీ మంచి జరగాలని ప్రార్థిస్తూ శుభాకాంక్షలు చెప్పారు. ఈ మేరకు తన ఎక్స్ ఖాతా ద్వారా సీఎం చంద్రబాబు నాయుడు శుభాకాంక్షలు తెలియజేశారు.ఏడాదిలో తొలి ఏకాదశి, వైకుంఠ ఏకాదశి అత్యంత పవిత్రమై రోజులు. ఈ రోజులను ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రజలు పర్వదినాలుగా భావిస్తారు.


PUB/1674

**పత్రికా ప్రకటన**
**భారత ప్రభుత్వం**
**పౌర విమానయాన మంత్రిత్వ శాఖ**
**రైల్వే భద్రతా కమిషన్**

29.12.2025న విజయవాడ (BZA) డివిజన్ యొక్క VSKP BZA సెక్షన్‌లో ఎలమంచిలి (YLM) స్టేషన్ వద్ద TR NO. 18189 (TATA-ERS) UP ఎక్స్‌ప్రెస్‌పై అగ్ని సంఘటనకు సంబంధించిన విషయమై చట్టబద్ధమైన విచారణ చేపట్టబడుతుంది.

పౌర విమానయాన మంత్రిత్వ శాఖ నుండి సికింద్రాబాద్, దక్షిణ మధ్య రైల్వే రైలు భద్రతా కమిషనర్ శ్రీమతి మాధవి, పై సంఘటనకు సంబంధించిన చట్టబద్ధమైన విచారణను 31.12.2025 మరియు 01.01.2026న "ఎలక్ట్రిక్ ట్రాక్షన్ ట్రైనింగ్ సెంటర్ (ETTC), విజయవాడ" వద్ద నిర్వర్తిస్తారు.

పై ప్రమాదానికి సంబంధించిన ఎరుకగల ప్రజానీక సభ్యులు మరియు అక్కడితో సంబంధించిన ఆ విషయాలతో తెలిసినవారు మరియు సాక్ష్యం ఇవ్వదలచిన కోర్కెగల వారు విచారణ యొక్క తేదీన పై ప్రదేశం వద్ద ఆ విధంగా చేయవచ్చును. లేదా ఈ క్రింది అధికారయుత చిరునామాకు ఆమెకు లిఖితపూర్వకంగా వ్రాయవచ్చును.

ది కమిషనర్ ఆఫ్ రైల్వే సేఫ్టీ, సౌత్ సెంట్రల్ సర్కిల్, రైల్ నిర్మాణ్ భవన్, సరోజినీ దేవీ రోడ్, సికింద్రాబాద్ 500025 లేదా వారిని ఫోన్ నంబర్ 040-27820104 పై కాంటాక్ట్ చేయవచ్చును.

చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్
వారిచే జారీ చేయబడింది
దక్షిణ మధ్య రైల్వే

A2130


## స్థానిక సంస్థలకు 15వ ఆర్థిక సంఘం నిధులు ఆంక్షలు లేకుండా చూడండి

### రాష్ట్రన సర్పంచుల సంక్షేమ సంఘం ముఖ్య సలహాదారు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు

**విజయవాడ, డిసెంబరు 30,ప్రభాతవార్తప్రతినిధి:** స్థానిక సంస్థలకు 15వ ఆర్థిక సంఘం నిధులు ఆంక్షలు లేకుండా చూడాలని ఆంధ్రప్రదేశ్ సర్పంచుల సంక్షేమ సంఘం ముఖ్య సలహాదారు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు విజ్ఞప్తి చేసారుజ.రాష్ట్రవ్యాప్తంగా సర్పంచ్ ల సమస్యలను శశి భూషణ్ కుమార్ కు తెలియజేస్తూ వినతి పత్రాన్ని అందజేశారు ప్రధానంగా ఇటీవల రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి కార్యాలయం నుంచి వచ్చిన ఉత్తర్వుల ప్రకారం ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ మరియు గ్రామీణ అభివృద్ధి శాఖ కమిషనర్ 15 వ ఆర్థిక సంఘం నిధుల వినియోగం పైన తదుపరి ఆదేశాలు వచ్చేవరకు కరెంటు బకాయిలు గ్రీన్ అంబాసిడర్ జీతాలు చెత్త సేకరణ వాటికి ఖర్చు పెట్టాలని ఆదేశాలు ఇచ్చిన దృష్ట్యా రాష్ట్ర వ్యాప్తంగా సర్పంచులు ఆందోళనలో ఉన్న విషయాన్ని ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దృష్టికి తీసుకువెళ్లారు ఆదేశాలను సడలించాలని గతంలో మాదిరిగానే చేసిన పనులకు అంగన్వాడి భవనాలకు సీసీ రోడ్లకు, సైడ్ డ్రయిన్స్ కు విద్యుత్ పరికరాల కొనుగోలు రిపేర్లు, మోటార్ రిపేర్లకు వాడుకునే విధంగా ఆదేశాలు జారీ చేయాలని డాక్టర్ జాస్తి వీరాంజనేయులు వినతిపత్రాన్ని ఇచ్చారు.

గత 25 రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా గ్రామపంచాయతీలలో సాధారణ నిధులు కూడా బిల్లులు పాస్ కాకుండా ఉన్న విషయాన్ని కూడా ప్రత్యేక ప్రధాన కార్యదర్శి తో చర్చించారు ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ మరియు గ్రామీణ అభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శశిభూషణ్ కుమార్ మాట్లాడుతూ సాధారణ నిధులు బిల్లులు పాస్ అయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు వినతి పత్రాన్ని పరి శీలించి చర్యలు తీసుకుంటామన్నారు.



శశిభూషణ్‌కు వినతి పత్రం అందజేస్తున్న జాస్తి


**AMARAVATI GROWTH AND INFRASTRUCTURE CORPORATION LTD.**
Project Office, Rayapudi, Amaravati, AP - 522 237

**Employment Notification No.3/2025, Dt. 30.12.2025**

Notification is hereby issued for engagement of services in AGICL, Amaravati on Deputation/contract basis. **From Sl. No. 1 to Sl. No. 10 on Deputation/contract basis. From Sl. No. 11 to Sl. No. 18 on contract basis only.** Online application is available in the APCRDA & AGICL website in careers tab and can be submitted **from dt.31.12.2025 to dt.19.01.2026.** For further details, please visit **https://crda.ap.gov.in & www.agicl.org**

| Sl. No | Name of the Post | Nos |
|---|---|---|
| 1 | Chief Eng-1 (Civil) | 1 |
| 2 | EE- (Civil) | 2 |
| 3 | DE- (Civil) | 2 |
| 4 | AE- (Civil) | 5 |
| 5 | AE- (Mechanical) | 1 |
| 6 | AE- (Electrical) | 1 |
| 7 | Environment Engineers | 2 |
| 8 | Manager Lands | 2 |
| 9 | Asst. Manager Lands | 2 |
| 10 | Peshi - MD AGIC | 2 |
| 11 | GIS & Remote sensing | 2 |
| 12 | Surveyor (Outsource), DGPS, GPS | 2 |
| 13 | IT | 1 |
| 14 | DEO | 5 |
| 15 | Receptionist | 1 |
| 16 | Attenders | 4 |
| 17 | Admin Officer | 1 |
| 18 | Executive Assistants - MD Support | 2 |

**Sd/- Managing Director, AGICL, Amaravati.**

వార్త

అంతరంగపు ఓటమి తప్పితే, మరెలాంటి ఓటమి లేదు. ఉద్దేశపూర్వమైన అంతరంగిక బలహీనత తప్ప మనం దాటలేని అడ్డంకులంటూ ఏమీ లేవు.

-ఎమర్సన్

# పతనం అంచుకు ప్రజారోగ్యం?

జనారోగ్యమే జాతి మహాభాగ్యమనే లక్ష్యంతో దేశప్రజలను సంపూర్ణ ఆరోగ్యవంతులుగా చేసేందుకు స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి అనేక పథకాలు ప్రవేశపెట్టారు. లక్షలాది కోట్లరూపాయలు ఖర్చుచేశారు. చేస్తూనే ఉన్నారు. అటు కేంద్ర ప్రభుత్వం కానీ, ఇటు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు కానీ ప్రజలను అనారోగ్యం భారి నుండికాపాడేందుకు శక్తిమేరకు కృషి చేస్తూనే ఉన్నట్లు చెబుతున్నారు. ఇందుకోసం దేశవ్యాప్తంగా లక్షలాది మంది వైద్యసిబ్బందిని కూడా నియమించారు. మన రాజ్యాంగ నిర్మాతలు ప్రజారోగ్యం విషయంలో పాలకులు తీసుకోవాల్సిన చర్యల గూర్చి రాజ్యాంగంలో స్పష్టంగా పేర్కొన్నారు. స్వాతంత్ర్యం వచ్చి దాదాపు ఎనిమిది దశాబ్దాలు కావస్తున్నా అందరికి కనీస ఆరోగ్య వసతులు కల్పించడంలో పాలకులు విఫలమవుతున్నారనే చెప్పొచ్చు. ప్రజారోగ్యంపై రోగాల దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. కొన్ని వ్యాధులను కొందరు వ్యక్తులు తమకు తాముగా తెచ్చుకొని సమాజంపై వదులుతుంటే మరికొన్ని ప్రకృతి విసురుతున్నట్లుగాచెప్పొచ్చు. ఇవన్నీ కలిసి ప్రజారోగ్యంపై దాడులు కొనసాగిస్తూనే ఉన్నాయి. ముఖ్యంగా గిరిజనప్రాంతాల్లో నేటికీస్వాతంత్ర్యం పూర్వం ఉన్న పరిస్థితిని గుర్తు తెస్తున్నాయి. ఇప్పటికీ దారుల్లేక డోలీ కట్టుకొని రోగులను మోసుకుపోవాల్సిన పరిస్థితుల నుంచి బయటపడలేకపోతున్నారు. సకాలంలో వైద్యసహాయం అందక ఎందరు మరణిస్తున్నారో లెక్కలకే అందదు. ఇక వ్యాధులు కూడా రకరకాలుగా విస్తరిస్తున్నాయి. ఎంతో ఆధునిక విజ్ఞానం సముపార్జించుకున్నామని విర్రవీగే మానవజాతిపై ప్రకృతి విసురుతున్న సవాళ్లకు వారూ వీరు అని తేడా లేకుండా అందరూ బలైపోతున్నారు. ఆ శక్తి ముందు మానవుడు ఎప్పుడూ తలవంచుకోవాలనే వాస్తవాన్ని చాటుతూ వ్యాధులు ప్రబలిపోతున్నాయి. కొత్త కొత్త మందులు, చికిత్సలు, ఆధునిక పరిజ్ఞానాన్ని సంపాదించుకుంటున్నా అంతకు రెట్టింపుస్థాయిలో కొత్త కొత్త వ్యాధులు వస్తున్నాయి. కోట్లాది మంది రోగ పీడితులుగా మారుతుంటే లక్షలాది మంది ప్రాణాలు వదులుతున్నారు. నిన్నమొన్నటి వరకు ప్రపంచాన్నే గడగడలాడించిన కరోనా బారినపడినవారు వాడిన మందుల ప్రభావం నుండి ఇప్పటికీ కోలుకోలేకపోతున్నారు. ఇటీవల గుండెజబ్బులు పెరిగిపోయాయి. వయస్సుతో సంబంధం లేకుండా పదిహేనేళ్ల వయసు నుంచి అరవైయేళ్ల వరకు గుండెపోటుకు గురై క్షణాల్లో మరణిస్తున్నారు. అయితే ఇందుకు కరోనా నివారణ మందులు కారణమనే ప్రచారాన్ని తాజాగా ఢిల్లీలోని వైద్యనిపుణుల బృందం తోసిపుచ్చింది. ఈ గుండెజబ్బులకు ఆ మందులకు సంబంధం లేదని తమ పరిశోధనల్లో తేలినట్లు వారు స్పష్టంచేశారు. దీంతో ఈ జబ్బులు ఎందుకు ఎక్కువ అవుతున్నాయనేది అర్థంకాకుండా పోతున్నది. అయితే మారిన, మారుతున్న అలవాట్లు, కాలుష్యం లాంటివి ఎన్నోకారణాలు ఉండవచ్చుననే ఊహలు వెలువడుతున్నాయి. ఇదికాక దోమల నుండి వస్తున్నవ్యాధులు అన్నీఇన్నీకావు. గతంలో వచ్చిన స్వైన్‌ఫ్లూ, ఎబోలా, డెంగ్యూ, చికెన్‌గున్యా, ఒకటేమిటి రకరకాల విషజ్వరాలు విస్తరిస్తూనే ఉన్నాయి. ఇంకొకపక్క చిన్నా, పెద్ద అనే తేడా లేకుండా ప్రాణాంతకమైన కేన్సర్ వ్యాధి చాపకింద నీరులా విస్తరిస్తున్నది. పాలకులు చేస్తున్న ప్రయత్నాలు దీన్ని నివారించలేకపోతున్నాయి. చికిత్స ఉన్నా సకాలంలో ముఖ్యంగా ప్రారంభదశలో ఈ వ్యాధిని గుర్తించగలిగితే నియంత్రించగలుగుతున్నారు. కానీరెండు, మూడు దశలు దాటిపోతే పరలోకానికి పయనం కట్టాల్సిందే. వీటన్నింటి కంటే మించి రకరకాల కారణాలతో కిడ్నీవ్యాధులు ఊహించనిరీతిలో విస్తరిస్తున్నాయి. డయాలసిస్‌కు ప్రభుత్వపరంగా ఏర్పాటు చేసినా అవి అవసరానికి తగినంతగా లేవు. కిడ్నీమార్పిడి అనేది సామాన్యులకు అందుబాటులో లేకుండా పోయిందనే చెప్పొచ్చు. ఇలా రకరకాల వ్యాధుల విస్తరణతో దేశవ్యాప్తంగా ప్రభుత్వ ఆస్పత్రులతోపాటు ప్రైవేట్ దవాఖానాలు కూడా కిటకిటలాడిపోతున్నాయి. అయితే వ్యాధివచ్చిన తర్వాత చికిత్స కంటే రాకుండా ముందుగా జాగ్రత్తలు తీసుకుంటే మంచిదనే అభిప్రాయం అందరూ డాక్టర్లు వ్యక్తం చేస్తున్నారు. వ్యాధుల నుండి రోగనిరోధక శక్తి ఉన్నవారు బయటపడే అవకాశం ఉందని వైద్యనిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఒక్క అల్లోపతి డాక్టర్లే కాదు, ఆయుర్వేదం, హోమియో, తదితర అన్ని విభాగాల డాక్టర్లు వైద్యరంగ నిపుణులు శరీరంలో ఇమ్యూనిటీని పెంచుకోవాలని సలహాలు ఇస్తున్నారు. ఇప్పుడు ఈ విషయం కొత్తగా చెప్పడం లేదు. ఏనాటినుంచో చెప్తున్నారు. అయినా రోగనిరోధక శక్తి ఎందుకు పెంచుకోలేకపోతున్నారు? అందుకు కారణాలేమిటి? కారకులు ఎవరు? తదితర అంశాలను పరిశీలించాల్సిన తరుణమిది. రోగ నిరోధకశక్తి ఒక్కరోజులోనో, వారంలోనో, నెల రోజుల్లోనో పెరిగేదికాదు. బాల్యం నుంచి సమతుల్యమైన మంచి పోషకవిలువలు కలిగిన పౌష్టికాహారం అందించాలి. ఏమేరకు అందిస్తున్నారో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. పౌష్టికాహార లోపంతో ప్రధానంగా నిరుపేదలు అల్లాడిపోతున్నారు. పౌష్టికాహారం సంగతి దేవుడెరుగు. అర్ధాకలితో అలమటిస్తున్నవారు భారత్‌లో కోట్లాది మంది ఉన్నారు. వారిలో రోగనిరోధక శక్తి ఎలావస్తుంది? ఎక్కడి నుంచి వస్తుంది? మద్యపానం లాంటి కొన్ని విధానాలు కూడా ప్రజారోగ్యానికి హాని చేస్తున్నాయి. ప్రజాసంక్షేమమే ధ్యేయమని పదేపదే చెప్పుకునే పాలకులు ప్రజారోగ్యాన్ని పణంగా పెట్టి ధనార్జనచేయడం ఎంతవరకు సమంజసమో ఆలోచించాలి. ఇప్పటికైనా పాలకులు మనసుపెట్టి ఆలోచించాలి. అలాగే ప్రజారోగ్య సంరక్షణ బాధ్యత ప్రభుత్వంపై మాత్రమే వదలకుండా ప్రజలు స్వచ్ఛంద సంస్థలు కూడా ఈ యజ్ఞంలో పాలుపంచుకోవాలి.

కోపం తెలివి తక్కువ తనంతో ప్రారంభమై, పశ్చాత్తాపంతో అంతం అవుతుంది.



తిరువళ్లువర్

జీవించడం వల్ల గొప్పగా ఏదీ గణనలోకి రాదు. కాని మన అల్పకాలపు జీవితంలో మనం ఏ చేశాం అన్నదే గణనలోకి వస్తుంది.



నెహ్రూ

# ప్రజావాక్కు



## ఆరావళి పై ఉండాల్సిన ఆలోచనా సరళి

ఆరావళి ప్రాంతంలో ఏయే గుట్టలు, పర్వతాలు ఆరావళి శ్రేణిగా నిర్వచించబడతాయో అన్న సందిగ్ధతకు సుప్రీం కోర్టు తాత్కాలిక బ్రేక్ వేయడం ముదావహం. గతంలో ప్రభుత్వ ప్రతిపాదనకు తానుఅంగీకరించి, ఇచ్చిన ఆదేశం పైతానే నేడు స్టేఇచ్చి విజ్ఞత చూపింది. ఆరావళి శ్రేణి అతి పురాతన పర్వతాల, గుట్టల వరుస. ఢిల్లీ నుంచి గుజరాత్ వరకు, నాలుగు రాష్ట్రాల్లో, 37 జిల్లాల్లో వ్యాపించి ఉత్తర భారతానికి రక్షణ గోడగా నిలిచాయి. ఆ శ్రేణి వల్ల థార్ ఎడారి తూర్పుదిశగా వ్యాపించడంలేదు. ఇసుక తుఫాన్లకు అడ్డుగోడ. ఆయా రాష్ట్రాలకు నీటి ఎద్దడి రానీయకుండా భూగర్భాన్ని రీ ఛార్జ్ చేస్తున్నాయి. పచ్చదనం నిండుగా ఉండి ఉత్తర భారతానికి ఊపిరితిత్తులుగా పిలవబడుతున్నాయి. అలాగే ఆప్రాంతంలోవిలువైన ఖనిజాలు నిక్షిప్తమై ఉన్నాయి. గనుల తవ్వకాలకు అనుమతుల విషయ మై ఆరావళి శ్రేణి ప్రాంతం అనేక నిర్వచనాలకు గురవుతుంది. అందులో ఒకటి అధికారికమైంది.

- డా.డి.వి.జి. శంకరరావు, పార్వతీపురం

## డిజిటల్ నేరస్తులు

ఈమధ్యన సైబర్‌నేరగాళ్లు బ్యాంక్ ఖాతాల్లోకి జొరబడి కొంతసొమ్మును విడతల వారీగా స్థంభింప చేస్తున్నారు. ఆ డబ్బు ఎక్కడికీపోదు. కాకపోతే సైబర్ నేరాలకు సంబంధించిన డిపార్టుమెంటు వారు పరిశీలించి విడుదల చేస్తేనేకాని ఖాతాదారునికి చెల్లింపబడదని బ్యాంక్ వారు సమాధానం ఇస్తున్నారు. ఇలా ఎన్నినెలలు కాలాయాపన చేయాలి. ఈలోగా ఖాతాదారుల జీవనం ఎలా? దేశంలో 8000కోట్లరూపాయల పైన డిజిటల్ నేరస్తుల గుప్పిట్లో ఉన్నాయనివార్త. కేంద్రం సత్వరచర్యలు తీసుకొనక పోతే ఖాతాదారులు మరింతఇబ్బందులు పడవలసి వస్తుంది.

- డా. ఎన్. ఎస్.ఆర్. మూర్తి, సికింద్రాబాద్

## పర్యవేక్షణ తప్పనిసరి

ఇప్పటి కాలంలో చిన్న పిల్లల చేతుల్లో కూడా మొబైల్ ఫోన్లు కనిపిస్తున్నాయి. చదువుకోడానికి, ఆటల కోసం అని మొదలైన ఈ అలవాటు క్రమంగా హానికరంగా మారుతోంది. ఎక్కువసేపు మొబైల్ వాడడం వల్ల కంటి చూపు తగ్గిపోవడం, నిద్ర సరిగా లేకపోవడం, శారీరక చలనం తగ్గిపోవడం జరుగుతోంది.

- నిమ్మగడ్డ కృష్ణ, హైదరాబాద్

## మార్చాల్సింది సమాజ దృక్పథాన్ని

అమ్మాయి రక్షణ గురించి చర్చ వచ్చిన ప్రతిసారీ, బాధ్యులను బోనులో నిలబెట్టాల్సింది పోయి బాధితురాలి రంగు, శరీరం, ఆమె ధరించిన దుస్తుల గురించి ప్రస్తావించడం ఒక అనాగరిక సంప్రదాయంగామారిపోయింది. అమ్మాయి సురక్షితంగా ఉండాలంటే పద్ధతిగా ఉండాలి అని సుద్దులు చెప్పే మేధావుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. అసలు రక్షణకు, దుస్తులకు ముడిపెట్టే ఈ కుసంస్కృతి ఇంకెంత కాలం కొనసాగుతుందనేది నేడు సమాజం ముందున్న అతిపెద్ద ప్రశ్న. వ్యక్తుల ప్రవర్తనను ప్రశ్నించకుండా, బాధితుల వేషధారణను విమర్శించడం అంటే పరోక్షంగా నేరాన్ని సమర్థించడమే అవుతుంది. ప్రజల ఆలోచనలను ప్రభావితం చేసే అత్యంత శక్తివంతమైన సినీరంగం నేడు మహిళల పట్ల ప్రదర్శిస్తున్న వైఖరి అత్యంత ఆందోళనకరం. ఒకప్పుడు మహిళా పాత్రలను ఎంతో గౌరవప్రదంగా, స్ఫూర్తిదాయకంగా చిత్రించిన వినోదరంగం, రానురాను వారిని కేవలం గ్లామర్ వస్తువులుగా మార్చేసింది.

- దిడ్డి శ్రీకాంత్, జమ్మికుంట, కరీంనగర్

## గ్రామీణ వ్యవస్థలోనే భారతదేశ ఆత్మ

ఎన్ని శాస్త్ర సాంకేతిక పద్ధతులు వచ్చినా భారత దేశం ఆత్మ గ్రామీణ ఆర్థిక వ్యవస్థలలోనే ఉంది. తెలంగాణను సీడ్ హబ్‌గా తయారు చేయొచ్చు. అందుకే ఇప్పుడు గ్రామాలలో వివిధ పంటల విత్తనాలను పండించి కంపెనీలకు అమ్ముతున్నారు. ఇది ఒక రకంగా తెలంగాణ రైతులలో వచ్చిన అవగాహన ఫలితం. అయితే ఒక్క తెలంగాణకు మాత్రమే ఎందుకు పరిమితం కావాలి. కేంద్రం పూర్వోదయా ప్రణాళికను అమలుచేసినట్లు భూపరివేష్టిత ప్రణాళికను అమలు చేయదు అనేది అసలు ప్రశ్న. భూ పరివేష్టిత రాష్ట్రాలకు ఉండే సౌలభ్యం మూలంగా కూడా ఈ ప్రణాళిక అమలు అవసరం.

- భారత అవినాష్, జనగామ

## వాక్ స్వేచ్ఛ.. అవగాహనకు దారితీసే సాధనం

మనరాజ్యాంగంలోని అనుచ్ఛేదం19(1)(ఎ) ప్రకారం ప్రతి పౌరునికి వాక్ స్వేచ్ఛ హక్కు కలదు. అయితే అనుచ్ఛేదం 19(2) ప్రకారం, ఆ స్వేచ్ఛ ప్రజా శాంతి, నీతి, మర్యాద, ఇతరుల గౌరవం దెబ్బతీయకుండా ఉండాలి. వాక్ స్వేచ్ఛ అంటే మనం ఇష్టం వచ్చినట్లు మాట్లాడే హక్కు కాదు. అది నిజాన్ని బాధ్యతతో వ్యక్తపరచే జ్ఞానం. వ్యంగ్యం అవమానంకాదు, అవగాహనకు దారి తీసే సాధనం కావాలి.

- వీరగంటి భాస్కర్ రావు, బొబ్బిలి

మన వి ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# వ్యక్తిగత స్వేచ్ఛకు కట్టుబాట్లు అవసరం

**మగవారికైనా, ఆడవారికైనా విచ్చల విడితనం తప్పు. అదిసమాజాన్ని కలుషితం చేస్తుంది. కలుషితమైన సమాజంలో మన కుటుంబాలు సురక్షితంగా జీవించగలుగుతాయా? ఆలోచించండి. ఇది పాతకాలంనాటి మనస్తత్వంతో చేసే వాదన కాదు. మనిషి సమాజంలో సురక్షితంగా జీవించడానికి కొన్ని కట్టుబాట్లు అవసరం. వాటిని అందరూ తప్పక పాటించాలి. స్త్రీ అయినా, పురుషుడైనా సభ్య సమాజం హర్షించే విధంగా వస్త్రాలు ధరించాలి. 'నాకు వస్త్రాలు ధరించడం ఇష్టం లేదు. అది నా స్వేచ్ఛ'అని పూర్తిగా దిగంబరులుగా తిరిగితే మనం ఊరుకోగలమా? సమాజ కట్టుబాట్లకు వ్యతిరేకంగా ఎవ్వరూ వ్యస్త్రధారణ చేయకూడదు. సందర్భానుసారంగా వస్త్రాలనుధరించడం అనేది మనసామాజిక సంస్కృతిలో భాగం. భావితరాల సురక్షిత భవిష్యత్తుకు అందించే రక్షణకవచం, వ్యక్తిత్వ వికాసం. అందుకే వస్త్రధారణ అనేది మనిషి వ్యక్తిగత స్వేద కాదు సామాజిక బాధ్యత.**



నునుబోలు రాజశేఖర్

ఇటీవల ఒక సినిమా వేడుకలో 30 ఏళ్లుగా సినీ పరిశ్రమలో అనుభవం ఉన్న ఒక వట్టి సినిమా కథానాయికల వస్త్రధారణపై చేసిన వ్యాఖ్యలు అన్ని సామాజిక మాధ్యమాల్లో ఎలక్ట్రానిక్ మీడియా న్యూస్ ఛానళ్లలో విశేషమైన చర్చకు అంశాలుగా మారాయి. సామాన్యుల నుంచి ప్రముఖ విశ్లేషకుల వరకు ముఖ్యంగా అధిక సంఖ్యలో మహిళలు వివిధ కోణాల్లో తమ అభిప్రాయాలనుసామాజిక మాధ్యమాల ద్వారా వ్యక్తపరుస్తున్నారు. అయితే, కొందరు ప్రముఖులు తమ వాదనలో ఎటువంటి ప్రామాణికత నిర్మాణాత్మకత లేకపోయినా, వస్త్రధారణపై తమ వ్యక్తిగత అభిప్రాయాలను సమాజంపై బలవంతంగా రుద్దాలని ప్రయత్నిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో స్త్రీ, పురుషులు వస్త్రధారణ ఎలా ఉండాలి అనే అంశంపై స్పష్టత అవసరం. లేకపోతే భావితరాలకు ఒక తప్పుడు సందేశం వెళ్లే ప్రమాదం ఉంది. అందుకే వస్త్రధారణ మూలాలతోపాటు చర్చించి, వస్త్రధారణ విషయంలో నిజాన్ని నిర్భయంగా సమాజానికి చాటి చెప్పాల్సిన అవసరం ఉంది. సమాజంలో మనిషి హాయిగా, ఆనందంగా, సురక్షితంగా జీవించాలంటే కొన్ని కట్టుబాట్లు తప్పనిసరిగా ఉండాలి. మనిషి దిగంబరుడిగా, అనాగరికతతో జీవించే పాత రాతి యుగం నుండి వస్త్రాలు తయారు చేసి, తన శరీరాన్ని పూర్తిగా కప్పుకొని మంచి భాషను నేర్చుకొని నాగరికుడిగా మారిన క్షణంతోనే మానవుని అభివృద్ధి ప్రారంభమైంది. మానవ అభివృద్ధి ప్రారంభమైన కాలాన్నే నాగరిక యుగంగా పిలుస్తారు. ఆ నాగరిక యుగం నుండి మన పూర్వీకులు అవలంబించి మనకు అందించిన సంప్రదాయాలు, కళారూపాలు, భాషసంభాషణ, ఆచరణలు, విలువలు అన్నీ మన సంస్కృతిగా రూపొందాయి. మనిషి కట్టు, బొట్టు, నడవడిక, ప్రవర్తన అన్నీ మనం మన రక్షణకోసం నిర్మించుకున్న సంస్కృతిలో భాగాలే. వస్త్రధారణ కూడా మన సంస్కృతిలో భాగమే. అంతేకాదు, మనిషి వ్యక్తిత్వ వికాసంలో వస్త్రధారణ కూడా ఒక ముఖ్యమైన అంశమే. చేసే వృత్తిని బట్టి, చదివే విద్యను బట్టి, వెళ్లే ప్రదేశాన్ని బట్టి కూడా మన వస్త్రధారణలో మార్పులు చేసుకుంటూ ఉంటాం. ఎందుకంటే మనం ధరించే వస్త్రాలు మన వ్యక్తిత్వాన్ని ఆవిష్కరిస్తాయి. ఏ రకమైన వస్త్రాలు ధరించాలి అన్నది ప్రాంతాన్ని బట్టి, కుటుంబాన్ని బట్టి మారుతుంటుంది. అయితే ఇందులో ముఖ్యమైన విషయం ఏమిటంటే శరీరాన్ని, సిగ్గును కాపాడే విధంగా వస్త్రాలు ధరించడమే ప్రధానమైనది. అది ఏ రకమైన వస్త్రమైనా కావచ్చు. వస్త్రధారణ స్వేచ్ఛకు సంబంధించిన విషయం కాదు. అది సమాజ సంస్కృతిలో ఒక ముఖ్యమైన భాగం. మనిషి వ్యక్తిత్వంలోనూ, సమాజ సంస్కృతిలోనూ ఎంతో కీలకమైన స్థానమున్న వస్త్రాలను నిండుగా ధరించకుండా సమాజంలో తిరగటం స్వేచ్ఛ కాదు. అది ఒక అనాగరిక చర్య. ఇది మళ్లీ నాగరిక ప్రపంచం నుండి మనిషిని అనాగరిక ప్రపంచంవైపు తీసుకెళ్లే ప్రమాదకరమైన వాదన. స్త్రీలపై జరిగే అకృత్యాలకు వస్త్రధారణే కారణమని కచ్చితంగా చెప్పలేము ఎందుకంటే, చాలీచాలని వస్త్రాలు ధరించిన మహిళలపైనే కాదు, సరైనరీతిలో వస్త్రాలు ధరించిన మహిళలపై కూడా లైంగిక దాడులు, వేధింపులు జరుగుతున్నాయి. ఇలాంటి అకృత్యాలకు పాల్పడేవారు మానవత్వాన్ని మరిచి మృగాల్లా ప్రవర్తించే సామాజిక ద్రోహులు. అలాంటి వారిపై ప్రభుత్వాలు కఠిన శిక్షలు విధించాలి. విధిస్తున్నాయి కూడా. అయితే, వస్త్రధారణ ఎలాఉన్నా అకృత్యాలు జరుగుతున్నాయనే కారణంతో మాకు నచ్చినట్లు వస్త్రాలు ధరిస్తాం అనే



వాదన చేయడం సమంజసం కాదు. ఇంటికి తాళం వేసినా కూడా దొంగతనాలు జరుగుతున్నాయని, ఇంటికి తాళం వేయడం మానేస్తామా? తాళం వేసిన ఇంటిలో దొంగతనాల శాతం తక్కువగాఉంటుంది. తాళంవేయని ఇంటిలో దొంగతనాల శాతం ఎక్కువగా ఉంటుంది. కాబట్టి మన ఇంటికి తాళం వేసి ముందు జాగ్రత్త ఎలా తీసుకుంటామో, అదే విధంగా ప్రతి ఒక్కరికి వ్యక్తిగత జాగ్రత్త అవసరం. సమా జంలో పలుకుబడి, రక్షణ వలయాలు ఉన్న స్త్రీలు ఎటు వంటి వస్త్రధారణ చేసిన వారికి భద్రత ఉంటుంది. వారిని చూసి సామాన్యులు కూడా అలాంటి వస్త్రాలను ధరించి సమాజంలో తిరిగితే ప్రతి ఆడపిల్లకు అలాంటి రక్షణ ఉండదు. ప్రభుత్వాలు సైతం ఎంతమందికి రక్షణ కల్పించగలుగుతాయి. అందుకే ఇంటి నుంచి బయటకు వెళ్లే ప్రతి ఆడపిల్ల తన వ్యక్తిగత భద్రతకోసం సమాజానికి అనుగుణంగా, సరిగ్గా వస్త్రాలను ధరించడం ఒక ప్రాథమిక జాగ్రత్త. ఇది నింద కాదు, బాధ్యత. దుష్ట ఆలోచనతో చూసే దృష్టిని మార్చుకోవాలి అన్నది నిజమే కానీ విశ్లేషణ వేదికలపై కూర్చొని చెప్పే ఇలాంటి సందేశాలతో వెంటనే దుష్ప్రభావాలను, వారి దుగ్ధ ఆలోచనలను మార్చలేం. అందుకే సంస్కారవంతులైన మనమే జాగ్రత్తగా ఉండాలి. 'చూసేవారి దృష్టే తప్పు' అనే వాదంతో మాత్రమే ముందుకు వెళ్లలేం. ఎందుకంటే సమాజంలో మంచిఉన్నట్లే చేదు కూడా ఉంది అనే సత్యాన్ని మనం మర్చిపోవద్దు. సమాజంలోస్త్రీకి అత్యంత ఉత్తమమైనస్థానం ఉంది. అందుకే అలాంటి స్త్రీ వస్త్రధారణపై ఒక్కొక్కసారి ఇలాంటి చర్చలు జరుగుతూ ఉంటాయి. అది స్త్రీ మీద ఉన్న అపారమైన గౌరవంతోనే తప్పా అగౌరవంతోకాదు అని అర్థంచేసుకోవాలి. భారతీయ స్త్రీ కట్టు, బొట్లు, ప్రవర్తన, సంస్కారం ప్రపంచ దేశాలకు ఇప్పటికీ, ఎప్పటికీ ఆదర్శమే. భారతీయ మహిళలలో సుమారు95శాతం మంది గొప్ప వస్త్ర సంస్కృతిని పాటిస్తున్నారు. మిగిలిన ఐదుశాతానికి సంబంధించిన వారితోనే సమస్యలు కనిపిస్తున్నాయి. కుటుంబ వ్యవస్థలోని తల్లిదండ్రుల పెంపకం, విద్యావ్యవస్థలో అందించే విద్యలోని లోపాలుకూడాఇందుకు కారణాలు. ఒక వ్యక్తి మంచి పౌరుడిగా లేదా అసాంఘిక శక్తిగా మారడం వెనుక అతడు పెరిగిన వాతావరణం, పొందిన విద్యకీలక పాత్ర పోషిస్తాయి. చిన్ననాటి నుంచే పిల్లలకు క్రమశిక్షణ, బాధ్యత, మానవీయ విలువలు నేర్పించడంలో తల్లిదండ్రులు, విద్యావ్యవస్థ విఫలమైతే, సమాజానికి హానికరమైన వ్యక్తులు తయారవుతారు. తల్లిదండ్రులు పిల్లలను స్వేచ్ఛపేరుతో నియంత్రణ లేకుండా పెంచడం, తప్పులను సరిదిద్దకుండా కప్పిపుచ్చడం, తప్పు చేసినా సమర్థించడం, అనే పెంపకంలోని లోపాలు పిల్లల్లో చిన్నప్పుడే అసాంఘిక ఆలోచనలకు బీజంవేస్తుంది. అందుకే అసాంఘిక శక్తులను అరికట్టాలంటే శిక్షలతోపాటు బాధ్యతాయుత మైన తల్లిదండ్రుల పెంపకం అవసరం. విద్య అంటే కేవలం మార్కులు సాధించడం మాత్రమేకాదు. నైపుణ్యం, వ్యక్తిత్వ వికాసం, నైతిక విలువలు, సామాజిక బాధ్యతను అలవర్చే ప్రక్రియకూడా. వస్త్రధారణ మన సంస్కృతిలో, వ్యక్తిత్వ వికాసంలో ప్రధాన భాగమే. సమాజానికి హానిచేసే ఏపనైనా స్వేచ్ఛలోకిరాదు. చలి నుంచి, ఎండ నుంచి, దుమ్ముధూళి నుంచి మనల్ని రక్షించేది. మన సిగ్గును కాపాడేదిసరైన వస్త్రధారణే. స్త్రీ అయినా, పురుషుడైనా సభ్య సమాజం హర్షించేదుస్తులనే వేసుకోవాలి. సమాజంలో మన మందరం హాయిగా, ఆనందంగా, సురక్షితంగా జీవించాలంటే స్త్రీ పురుషులు ఇద్దరూ తమపరిధులకులోబడి కట్టుబాటుతో జీవించాలి. సాంకేతికంగా ఎంత అభివృద్ధి సాధించినా మనిషి తన వ్యక్తిత్వాన్ని కోల్పో కూడదు. సమాజ శ్రేయస్సు కోసం సరైన రీతులో వస్త్రాలుధరించండని చెప్పడం ఏ మాత్రం తప్పుకాదు. ఒక సురక్షితమైన సమాజాన్ని నిర్మించగలిగితే అందులో మనం, మన కుటుంబంహాయిగా జీవించగలుగుతుంది. మగవారికైనా, ఆడ వారికైనా విచ్చల విడితనం తప్పు. అది సమాజాన్ని కలుషితం చేస్తుంది. కలుషితమైన సమాజంలో మన కుటుంబాలు సురక్షితంగా జీవించగలుగుతాయా? ఆలోచించండి. ఇది పాతకాలంనాటి మన స్తత్వంతో చేసే వాదన కాదు. మనిషి సమాజంలో సురక్షితంగా జీవించడాని కి కొన్ని కట్టుబాట్లు అవసరం. వాటిని అందరూ తప్పక పాటించాలి. స్త్రీ అయినా, పురుషుడైనా సభ్యసమాజం హర్షించే విధంగా వస్త్రాలు ధరించాలి. 'నాకు వస్త్రాలు ధరించడం ఇష్టం లేదు. అది నా స్వేచ్ఛ' అని పూర్తిగా దిగంబరులుగా తిరిగితే మనం ఊరుకోగలమా? సమాజ కట్టు బాట్లకు వ్యతిరేకంగా ఎవ్వరూ వస్త్ర ధారణ చేయకూడదు. సందర్భానుసారంగా వస్త్రాలనుధరించడం అనేది మనసామా జిక సంస్కృతిలో భాగం. భావితరాల సురక్షిత భవిష్యత్తుకు అందించే రక్షణకవచం, వ్యక్తిత్వ వికాసం. అందుకే వస్త్రధారణ అనేది మనిషి వ్యక్తిగత స్వేచ్ఛకాదు సామాజిక బాధ్యత. ●

# కొంపముంచుతున్న ఆన్‌లైన్ గేమ్స్

బుగ్గన మధుసూదనరెడ్డి

ఈ మధ్య కాలంలో మీడియాలో వచ్చిన ఒక వార్త తీవ్ర ఆందోళనకు కలిగించేలా వుంది. అదేమిటంటే ఒక ఆన్‌లైన్ గేమ్‌ను డౌన్‌లోడ్ చేసుకొని మరీ ఆడిన డిగ్రీ చదువుతున్న విద్యార్థి ఏకంగా ఏదోఅవసరం నిమిత్తమై తమ తల్లిదండ్రులు తన ఖాతాలోకి బదిలీ చేసిన 95 లక్షల రూపాయలను పోగొట్టుకున్న తీరును చూస్తుంటే ఈ సమాజంలోని యువత ఎలా చెడు, వక్రమార్గంలో పయనిస్తున్నారో ఇట్టే ఊహించవచ్చు. అంతేకాదు ఈ బాధాకరమైన సంఘటనకు కేవలం ఆ విద్యార్థిని ఒక్కడినే బాధ్యున్ని చేయలేం. ఎందుకంటే ఈ సంఘటనలో తమ పిల్లల అలవాటును పసిగట్టలేక అత్యంత నిద్రాణావస్థలో కూరుకుపోయి, బాధ్యతారాహిత్యంతో వ్యవహరించిన వారి తల్లిదండ్రుల ఘోర తప్పిదం కూడా అందులో దాగి వుంది. ముఖ్యంగా చేతులు కాలిన తరువాత ఆకులు పట్టుకునే కన్నా ముందుగానే మేల్కొని ప్రతి ఒక్క విద్యార్థి తల్లిదండ్రులు తమ పిల్లల వ్యవహారశైలిపై, వారి అలవాట్లపై ఎల్లవేళలా ఒక కన్నేసి ఉంచాలి. ఎందుకంటే ఈ మధ్యకాలంలో ఊహకు కూడా అందనంత రీతిలో టెక్నాలజీ తుఫాన్ వేగంతో కొత్త పుంతలు త్రొక్కుతున్న నేపథ్యంలో ఒక వైపుఅలాంటి టెక్నా లజీ మన దేశాభివృద్ధికి ఎంతగానో ఉపయోగపడుతున్నప్పటికీ, మరోవైపు విద్యార్థుల ఉజ్వల భవితకు, ఎదుగుదలకు ఒక శనిలా, శాపంలా ఆన్‌లైన్ గేమ్‌ల రూపంలో ఈ టెక్నాలజీ మాయ పరిణమించడం అత్యంత దురదృష్టకరమైన విషయం. కాబట్టి ఇప్పటికైనా మించిపోయింది లేదు ఆలస్యం అమృతం విషంలాగా పరిస్థితి తలెత్తకుండా ప్రతి ఒక్క విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లల పట్ల, ముఖ్యంగా వారి స్నేహితుల విషయంలో అత్యంత జాగరుకతతో వ్యవహారించాలి. తమ పిల్లలు మంకు పట్టు పడుతున్నారనో, వారికి బోర్ కొడుతుందనో వారి చేతికి పొరపాటున స్మార్ట్ ఫోన్ అందించి చేతులు దులుపుకున్నారు అంటే మాత్రం మున్ముందు భారీ మూల్యం చెల్లించక తప్పదు అనే విష యాన్నీ ప్రతి ఒక్క విద్యార్థుల తల్లిదండ్రులు ఎంతో వివేకం తో, పరిణతితో ఒక్కసారి ఆలోచించాలి. ఎలాగంటే ఈ పాటికే స్మార్ట్ ఫోన్‌ల వల్ల విద్యార్థులు ఎంతగా తమ చదువు సంధ్యలను, జ్ఞానాన్ని కోల్పోతున్నారో, ఎలా ఏ రీతిలో వారి అమూల్యమైన జీవితాలను భ్రష్టుపట్టించుకుం టున్నారో అందుకు సంబంధించి ఇటీవల మీడియాలలో వచ్చిన పలు వార్తలు మన కళ్లముందు సాక్షాత్కరిస్తూనే వున్నాయి అనేది ఎవరు కాదనలేని జగమెరిగిన సత్యం. ఏదిఏమైన ఇదివరకటి కంటేకూడా విద్యార్థుల తల్లిదండ్రు లు తమ పిల్లల నడవడికపై, వారి తీరు తెన్నులపై గట్టి నిఘాను పెట్టాల్సిన తరుణం ఆసన్నమైంది. తమ పిల్లలను నిరంతరం కనిపెట్టుకొని ఉండటం కోసంవిద్యార్థుల తల్లిదండ్రులు తమకు ఎన్ని పనులు, బాధ్యతలు ఉన్నప్పటికీ వాటిని కాస్త ప్రక్కకు పెట్టి పిల్లల ఎదుగుదల కోసం, వారి ఉజ్వల భవిష్యత్ కోసం రోజులో కనీసం కొంత సమయాన్ని వారికి కేటాయించక తప్పని పరిస్థితి. నేటి పిల్లలే రేపటి బాధ్యతగల పౌరులుగా నిలిచి ఈ యావత్తు దేశ ప్రజలు మెచ్చేలా నిలువాలంటే మాత్రం ఈ ఆన్‌లైన్ గేమ్‌ల వాసన కూడా తమ పిల్లల దరిచేరకుండా ప్రతి ఒక్క విద్యార్థుల తల్లిదండ్రులు జాగ్రత్త వ్యవహారించాలి. ఫోన్‌లను అందుబాటులో లేకుండా చూసుకోవాలి. ●

# పాఠాలు, గుణపాఠాలతో మరో వత్సరంలోకి..



సుంకవల్లి సత్తిరాజు

కొన్ని చేదు జ్ఞాపకాలు, మరికొన్ని మధురమైన అనుభూతులను మిగిల్చి 2025 కాలగర్భంలో ఒదిగిపోతూ, కొన్ని పాఠాలను, గుణపాఠాలను నేర్పి, 2026 నూతన సంవత్సరానికి జన వాహినిలో చోటు కల్పిస్తూ, సెలవంటూ వీడ్కోలు తీసుకుంది. 2025 సంవత్సరంలో కూడా ప్రపంచంలో అనేక దేశాలు ఆర్థిక మాంద్యాన్ని ఎదుర్కొన్నాయి. ప్రపంచంలో యుద్ధ మేఘాలు గర్జించి, పెను పిడుగులు కురిపించాయి. భారత్‌లో జరిగిన పహల్గాం సంఘటన భారత్, పాక్‌ల మధ్య పెను సంఘర్షణకు దారితీసింది. భారత్ సైనిక, ఆయుధ సామర్థ్యం ముందు పాక్ నిలువలేక శరణుజొచ్చి, అమెరికా చెంత పాదాక్రాంతమై, బేలగా విలపించింది. భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌వలన కేవలం పాకిస్థాన్ మాత్రమే కాదు, అమెరికా, చైనా లాంటి దేశాలు కూడా భారత ఆయుధ, సాంకేతిక, సైనిక సామర్థ్యాన్ని చూసి ఉలిక్కిపడ్డాయి. ఎప్పటి మాదిరిగానే రష్యా భారత్‌కు వెన్నుదన్నుగా నిలిచింది. రష్యా ఆయుధాలు పాక్‌లోని ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేయడమే కాకుండా పాక్ క్షిపణులను, యుద్ధ విమానాలను గగన తలంలోనే తునాతునకలు చేయడం ప్రపంచం దృష్టిని ఆకర్షించింది. అప్పటివరకు భారత్‌తో సత్సంబంధాలు కలిగి ఉన్న అమెరికా ఉలిక్కిపడి, ఉగ్రవాద దేశమైన పాక్‌కువంత పాడుతూ భారత్‌ను అనేక విధాలుగా ఇబ్బంది పెడుతూ ప్రపంచం దృష్టిలో చులకన కావడం జరిగింది. ప్రపంచ దేశాలు ఆయిల్ సంక్షోభం ఎదుర్కొంటున్న తరుణంలో భారత్‌కు కారు చౌకగా రష్యా ఇబ్బడిముబ్బడిగా చమురు సరఫరా చేయడాన్ని అమెరికా జీర్ణించుకోలేక, ఓర్వలేనితనంతో భారత్‌పై అకారణంగా వాణిజ్య సుంకాలను పెంచి, టారిఫ్ వార్ కొనసాగిస్తూ, భారత్ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీయాలని యత్నిస్తున్నది. అమెరికాను పట్టించుకోకుండా భారత్ రష్యాతో స్నేహం కొనసాగించడం ట్రంప్‌కుమింగుడు పడడం లేదు. సింధు జలాల నిలుపుదలతో పాక్ ఎడారిలా మారే అవకాశమున్నా, ప్రజల ఆకలి కేకలను పట్టించుకోకుండా భారత్‌ను లక్ష్యంగా చేసుకుని పావులు కదపడం, భారత్‌పై కక్షతో బంగ్లాదేశ్ ప్రజలను రెచ్చగొట్టి, చిచ్చు పెట్టాలని ప్రయత్నిస్తూ, ఇస్లామిక్ ర్యాడికల్ తీవ్రవాదులతో కలిసి, బంగ్లాదేశ్‌లో స్థిరబడిన భారత జాతీయులను హింసకు గురిచేయడం అత్యంత పాశవికమైన చర్య. అవామీ లీగ్ పార్టీని ఎన్నికల బరిలో లేకుండా చేయడానికి ప్రయత్నించిన ఒక మతోన్మాద "ఇంక్విలాబ్ మంచా" నాయకుడైన షరీఫ్ ఉస్మాన్ హాదీ హత్యకు ప్రతీకారంగా బంగ్లాదేశ్‌లోని భారతీయులను ఊచకోత కోయడం దానవ సంస్కృతికి అద్దం పడుతున్నది. అవామీ లీగ్ పార్టీని వచ్చే ఫిబ్రవరిలో జరిగే ఎన్నికల్లో పోటీ చేయనీయకుండానిషేధం చడంవలన షేక్




హసీనా ప్రత్యర్థి బేగం ఖలీదా జియా కుమారుడు తారీఖ్ రహ్మాన్ ఈఎన్నికల్లో విజయం సాధించడం కేవలం లాంఛనప్రాయమే. ఎన్నికలు జరిగే వరకు బంగ్లాదేశ్‌లో చెలరేగిన మంటలు ఆగునా? బంగ్లాదేశ్ ఉద్యమాలు ఎగదోస్తున్నదెవరు? పాక్, బంగ్లాదేశ్‌లలోని పరిస్థితులు ఇలా ఉండగా, ఆఫ్ఘానిస్థాన్ పాక్‌పై దాడులుచేస్తూ, పాక్ పాలకులకు ముచ్చెమటలు పట్టిస్తున్నది. ఇదిలా ఉండగా, ఇరాన్ ఇజ్రాయిల్ మధ్య తీవ్రమైన సంఘర్షణలు జరిగి, ప్రపంచాన్ని భయభ్రాంతులకు గురిచేసాయి. గాజాలో ఇజ్రాయిల్ మారణహోమంలో ఎంతోమంది బలైపోయారు. గాజాలో ఆకలికేకలు మిన్నంటుతున్నాయి. ఉక్రెయిన్, రష్యాల మధ్య సంవత్సరాల తరబడి సాగుతున్న యుద్ధంలో ఇరుపక్షాలకు చెందిన సైనికులు, పౌరులు లక్షల సంఖ్యలో మరణించారు. అయినప్పటికీ ఈ రెండు దేశాలమధ్య మారణహోమం ఆగడం లేదు. 2025ను యుద్ధాల సంవత్సరంగా భావించాలి. ఇక భారత్ విషయానికొస్తే సౌదీ అరేబియా నుండి 11వేలకు పైగా భారతీయులను బహిష్కరించడం దురదృష్టకరం. భారతీయులను వివిధకారణాల రీత్యా వెనక్కిపంపడంలో ప్రపంచంలో సౌదీ అరేబియా, అమెరికా దేశాలు మొదటి, రెండుస్థానాల్లో ఉన్నాయి. భారతీయుల బహిష్కరణ అంశంపై సౌదీ అరేబియా అత్యుత్సాహం ప్రదర్శించడంపై భారత్ దృష్టిసారించాలి. అమెరికా టారిఫ్‌వార్ కొనసాగిస్తున్నా, భారత్ నాల్గవ ఆర్థికవ్యవస్థగా ఎదగడంశుభసూచకం. అయితే అమెరికా డాలర్ విలువ పెరిగి, రూపాయి విలువ క్షీణించడం ఆందోళనకరం. దేశంలో సర్‌వివాదం కొనసాగుతూనే ఉంది. పశ్చిమ బెంగాల్‌లో హింసా కాండ ఫలితం రాబోయే ఎన్నికల్లో మమతా బెనర్జీ అధికారానికి మంగళం పాడే సూచనలు కనిపిస్తున్నాయి. 2025జూన్ నెలలో అహ్మదాబాద్ నుండి లండన్‌కు బయలు దేరిన ఎయిర్ ఇండియా విమానం టేకాఫ్ దశలోనే కూలిపోయి, సుమారు260మంది ప్రయాణీకులు మరణించిన సంఘటన అత్యంత విషాదాన్ని మిగిల్చింది. ఈ ప్రమాదంలో ఒకే ఒకవ్యక్తి మృత్యుంజ యుడై బయటపడడం విశేషం. ఇక తెలుగురాష్ట్రాల రాజకీయాల్లో విమర్శలు, వివాదాలు కొనసాగుతూనే ఉన్నాయి. రెండేళ్ల మౌనం తర్వా త కె.సి.ఆర్ ఫాం హౌస్‌ను వీడి రేవంత్ సర్కార్ పై విరుచుకుపడుతున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడుల కోసం విస్తృత ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. రాజధాని అమరావతి నిర్మాణ పనులు జోరందుకున్నాయి. పలు కేంద్ర ప్రభుత్వ సంస్థలు అమరావతిలో అడుగుపెట్టాయి. మెడికల్ కాలేజీల విషయంలో వై.సి.పి పోరుబాటలో పయనిస్తున్నది. పాలక కూటమిపై వై.సి.పి రప్పా రప్పా అంటూ వివాదాస్పద నినాదాలతో 2029 ఎన్నికల్లో విజయం కోసం రణనినాదం చేస్తున్నది. రాజకీయాలు హుందాగా నడపడానికి కేంద్రం, ఎన్నికల సంఘం చొరవ తీసుకోవాలి. 2025వ సంవత్సరంలో ప్రపంచ పరిణామాలు బాధను, అసంతృప్తిని మిగిల్చాయి. కాలగర్భంలో కలిసిపోతున్న 2025వ సంవత్సరపు చేదు జ్ఞాపకాలు పునరావృతంకాకుండా కొంగొత్త ఆశలతో అడుగిడుతున్న నూతన సంవత్సరం 2026 ప్రజల జీవితాల్లో సరికొత్త మార్పులు తీసుకురావాలని, యుద్ధాలు పరిసమాప్తి కావాలని, హింసకు తావులేని ప్రపంచం ఏర్పడాలనికోరుకుంటూ, కదిలేకాలంలో ఒదిగిపోయిన జ్ఞాపకాలను అనుభవాలుగా మలచుకుని, నూతన సంవత్సరాన్ని ఘనంగా స్వాగతిద్దాం. ●

# దేశం కోసం జీవితం అంకితంచేసిన అమ్మ

## ఖలీదా జియా మృతిపట్ల ఆమె కుమారుడి భావోద్వేగం





**ఢాకా, డిసెంబరు 30:** బంగ్లాదేశ్ మాజీ ప్రధాని, బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) అధినేత్రి ఖలీదా జియా మృతి పట్ల ఆమె కుమారుడు, పార్టీ తాత్కాలిక ఛైర్మన్ తారిఖ్ రెహమాన్ తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. అనారోగ్యంతో బాధపడుతున్న 80 ఏళ్ల ఖలీదా జియా ఢాకాలోని ఎవర్‌కేర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఈరోజు ఉదయం 6 గంటలకు తుదిశ్వాస విడిచారు. తల్లి మరణంపై స్పందిస్తూ తారిఖ్ రెహమాన్ సోషల్ మీడియా వేదిక ఎక్స్ లో ఒక ఉద్వేగభరితమైన పోస్ట్ చేశారు. నా తల్లి అల్లా పిలుపు మేరకు మనల్ని విడిచి వెళ్లిపోయారు. చాలా మందికి ఆమె ప్రజాస్వామ్యానికి తల్లివంటిది (మదర్ ఆఫ్ డెమోక్రసీ), రాజీపడని నాయకురాలు. కానీ, నాకు మాత్రం ఆమె దేశం కోసమే జీవితాన్ని అంకితం చేసిన ప్రేమగల అమ్మని పేర్కొన్నారు. కష్టకాలంలోనూ ఆమె కుటుంబానికి అండగా నిలిచారని తారిఖ్ గుర్తుచేసుకున్నారు. దేశం కోసం తన భర్తను, బిడ్డను కోల్పోయినప్పటికీ దేశ ప్రజలనే తన కుటుంబంగా భావించారని, ఆమె త్యాగాలు బంగ్లాదేశ్ ప్రజాస్వామ్య చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని నివాళులర్పించారు. ఖలీదా జియా మృతికి సంతాపంగా బీఎన్‌పీ 7 రోజుల సంతాప దినాలను ప్రకటించగా, బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వం 3 రోజుల అధికారిక సంతాపం, బుధవారం సాధారణ సెలవు ప్రకటించింది. రేపు ఢాకాలో ఆమె అంత్యక్రియలు నిర్వహించనున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో తారిఖ్ రెహమాన్ అధ్యక్షతన పార్టీ అత్యవసర సమావేశం నిర్వహించి భవిష్యత్ కార్యాచరణపై సీనియర్ నేతలతో చర్చించారు.

# బంగ్లా తొలి మహిళా ప్రధాని

# ఖలీదా జియా కన్నుమూత

### కొన్ని వారాలుగా తీవ్ర అనారోగ్యంతో మాజీ ప్రధాని

### మాజీ అధ్యక్షుడు జియాఉర్‌రహ్మాన్ భార్యగా రాజకీయ ప్రవేశం

### మూడుసార్లు ప్రధానిగా, బిఎన్పీఅధినేతగా బంగ్లాపై చెరగని ముద్ర

### 17 యేళ్ల తర్వాత తిరిగి స్వదేశానికి వచ్చిన కుమారుడు తారిక్ రెహ్మాన్



**ఢాకా, డిసెంబరు 30:** బంగ్లాదేశ్ రాజకీయాల్లో ధ్రువతార, ఆ దేశ తొలి మహిళా ప్రధానమంత్రి బేగం ఖలీదా జియా (80) మంగళవారం కన్నుమూశారు. కొంతకాలంగా తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆమె చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచినట్లు ఆమె నాయకత్వంలోని బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) ప్రకటించింది. 80 ఏళ్ల ఖలీదా జియా వృద్ధాప్య సమస్యలతో పాటు పలు తీవ్రమైన వ్యాధులతో బాధపడుతున్నారు. వైద్యుల కథనం ప్రకారం ఆమె కాలేయ వ్యాధి, కీళ్ల నొప్పులు, మధుమేహం, గుండె, ఊపిరితిత్తులకు సంబంధించిన సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు. కొన్ని వారాలుగా ఆమె ఆరోగ్యం మరింత క్షీణించడంతో ఆసుపత్రిలో ప్రత్యేక నిఘాలో ఉంచి చికిత్స అందించినప్పటికీ ఫలితం లేకపోయింది. ఆమె చికిత్స పొందుతున్న ఎవర్‌కేర్ ఆసుపత్రికి బ్రిటన్, అమెరికా, చైనా, ఆస్ట్రేలియాలనుంచి వైద్యనిపుణులు వచ్చి కృషిచేసినా ఆమె తుదిశ్వాస విడిచారు. బంగ్లాదేశ్ మాజీ అధ్యక్షుడు జియావుర్ రెహ్మాన్ భార్య అయిన ఖలీదా జియా తన భర్త మర ణానంతరం రాజ కీయాల్లోకి వచ్చి దేశాన్ని శాసించారు. మూడు సార్లు ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఆమె, బంగ్లాదేశ్‌లో ప్రజాస్వామ్య పునరుద్ధరణకు కృషి చేశారు. షేక్ హసీనాతో సాగించిన దశాబ్దాల రాజకీయ పోరు బంగ్లాదేశ్ చరిత్రలో ఒక ప్రధాన ఘట్టం. ఆమె మరణవార్త తెలియగానే బంగ్లాదేశ్ వ్యాప్తంగా ఉన్న బీఎన్‌పీ కార్యకర్తలు, అభిమానులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. ఖలీదాకు కుమారుడు తారిక్‌రెహమాన్, కోడలు జుబైదారహమాన్, కకుమార్తె జైమా రహమాన్‌లు ఉన్నారు. 17 ఏళ్లప్రవాస జీవితం తర్వాత తొలిసారిగా ఈనెల 25వ తేదీనే ఆమెకుమారుడు ఢాకాకు వచ్చారు. జియా చిన్నకుమారుడు అరాఫత్ రహమాన్ కోకో మలేసియాలో కొన్నేళ్లక్రితమే చనిపోయారు. బ్రిటిష్ పాలనలోని భారత్ తూర్పు బెంగాల్‌లోని దిజాన్‌పూర్‌లో 1946 ఆగస్టు 15న జన్మించిన ఖలీదాజియా తల్లితండ్రులు జల్పాయిగురిలో తేయాకు వానయపారంచేసేవారు.



తూరుపబెంగాల్‌కువెళ్లినతర్వాత తూర్పు పాకిస్తాన్‌గా మారింది. 1947లో భారత్ విభజనలో పాకిస్తాన్‌కిందకువెళ్లింది. తొలినాళ్లలో ఖలదా దినాజ్‌పూర్‌లోనే గడిపారు. ప్రభుత్వ బాలికల పాఠశాలలో చదువుకున్న తర్వాత సురేంద్రనాథ్ కళాశాలలో చేరారు. 1981లో ఆమె భర్త అప్పటి అధ్యక్షుడు జియావుర్ రెహమాన్‌ను మిలిటరీ తీరుగుబాటోల 1981 మే 30వ తేదీ ఛట్టోగ్రామ్ వద్ద హత్యకు గురికావడంతో ఖలీదా క్రియాశీలక రాజకీయాల్లోకి వచ్చారు. బిఎన్‌పిని ముందుండి నడిపించి జియావుర్‌ప్రాభవాన్ని కొనసాగించారు. రహమాన్ హత్యతర్వాత ఉపాధ్యక్షుడుఅ బ్దుస్ సత్తార్ తాత్కాలిక అధ్యక్షుడుగా వచ్చారు. కొన్ని నెలలకే ఆర్మీచీఫ్ హుస్సన్ ముహమ్మద్ ఎర్షాద్ అధికారం హస్తగతం చేసుకున్నారు. మార్షల్‌లా నడిచింది. 1982లో పార్టీలోచేరిన తర్వాత 1983లో వైస్‌ఛైర్మన్ అయ్యారు. ఆ తర్వాత 1984లో ఛైర్మన్‌గా వచ్చారు. మూడు పర్యాయాలు ఎన్నికల్లో విజయం సాధించి ప్రధానమంత్రిగా కొనసాగారు. తన దీర్ఘకాల ప్రత్యర్థి షేక్ హసీనాకు ధీటుగా ఆమె వ్యూహాలు అమలుచేసారు. రానురాను ఆమె ప్రజాజీవితం సమస్యలతో నిండిపోయింది.

# ప్రధాని మోడీ సహా పలువురు నేతల ప్రగాఢ సంతాపం

### చైనా, పాక్ నేతలతో పాటు హసీనా, యూనస్‌ల నివాళి

### సోనియా, రాహుల్ పలువురు విపక్ష నేతల సంతాపం

### ఖలీదా మృతితో బంగ్లాలో మూడురోజులు సంతాపదినాలు, నేడు అంత్యక్రియలు



**న్యూఢిల్లీ, డిసెంబరు 30:** బంగ్లాదేశ్ రాజకీయాల్లో దశాబ్దాల పాటు కీలక నేతగా వ్యవహరించిన ఆ దేశ మాజీ ప్రధాని, బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ చైర్‌పర్సన్ ఖలీదా జియా మృతి పట్ల భారత ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బంగ్లాదేశ్ తొలి మహిళా ప్రధానిగా ఆమె సృష్టించిన చరిత్రను గుర్తుచేసుకుంటూ, ఎక్స్ వేదికగా నివాళులర్పించారు. బంగ్లాదేశ్ అభివృద్ధిలో, అలాగే భారత్‌బంగ్లాదేశ్ సంబంధాలను బలోపేతం చేయడంలో ఆమె కీలక పాత్ర పోషించారని మోదీ పేర్కొన్నారు. 2015లో ఢాకా పర్యటన సందర్భంగా ఆమెతో జరిగిన భేటీని మోదీ ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. జియా మృతి పట్ల బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వ అధినేత మహమ్మద్ యూనస్ ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆమె కుమారుడు తారిఖ్ రెహ్మాన్ ఇటీవలే లండన్ నుంచి తిరిగి రాగా, తల్లి చివరి క్షణాల్లో ఆసుపత్రిలోనే ఉన్నారు. ఖలీదా జియా మృతితో బంగ్లాదేశ్ రాజకీయాల్లో ఒక శకం ముగిసినట్లయింది. కేర్‌టేకర్ ప్రధాని మహ్మద్‌యూనస్ తన సంతాప సందేశంలో బంగ్లాదేశ్ ఒక గొప్ప సంరక్షకురాలని కోల్పోయిందని, ఆమె రాజకీయ జీవితం ఎన్నో సవాళ్లు ఎదుర్కొని దేశ అభివృద్ధికి రాజీలేని పోరాటంచేసారని పేర్కొన్నారు. ఆమె పవిత్రాత్మకు శాంతిచేకూరాలని ఆకాంక్షించారు. మాజీ ప్రధాని ఆవామీ లీగ్ అధ్యక్షురాలు షేక్ హసీనా తన



సంతాప సందేశంలో బంగ్లాదేశ్ రాజకీయాల్లో తీరని నష్టం వాటిల్లిందన్నారు. దేశ రాజకీయ చరిత్రలో జియా గుర్తుంచుకోదగిన నేతగా నిలిచారన్నారు. ప్రజాస్వామ్య పునరుద్ధరణకు ఎనలేని కృషిచేసారని హసీనా కొనియాడారు. అదేవిధంగా ఎఐసిసి నాయకుడు రాహుల్‌గాంధీ, సోనియా, ప్రియాంకలు కూడా ఖలీదాజియా మృతికి సంతాపం ప్రకటించారు. పొరుగుననే ఉన్న పాకిస్థాన్, చైనా దేశాధినేతలుసైతం ఖలీదాజియా మృతికి సంతాపం ప్రకటించారు. దేశంకోసం నిరంతరం అంకితమయిన నేతగా జియాను చైనా, పాక్‌నేతలు కొనియాడారు.

# వెనెజులా భూభాగంపై తొలిసారి అమెరికా దాడి.. ధ్రువీకరించిన ట్రంప్

**వాషింగ్టన్, డిసెంబరు 30:** వెనుజులా భూభాగంపై తొలిసారిగా అగ్రరాజ్యం అమెరికా దాడికి పాల్పడింది. పడవల్లో డ్రగ్స్ లోడింగ్‌కు వాడే డాక్‌పై అమెరికా దళాలు దాడి చేశాయి. ఈ విషయాన్ని ఫ్లోరిడాలో జరిగిన సమావేశంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ధ్రువీకరించారు. 'ముందుగా అన్ని బోట్లను ధ్వంసం చేశాం. ఇప్పుడు వాటిని తరలించే ప్రాంతాన్ని కొట్టాం. ఆ డాక్ ఇక లేదు' అని తెలిపారు. గత వారం ఓ రేడియో ఇంటర్వ్యూలో కూడా ఈ దాడి గురించి ట్రంప్ ప్రస్తావించారు. ఓ పెద్ద సౌకర్య కేంద్రంపై అమెరికా ఆపరేషన్ జరిగిందని తెలిపారు. తాజాగా ఇప్పుడు రెండోసారి ఈ దాడి గురించి వెల్లడించారు. అయితే ఈ దాడి జరిగిన ప్రాంతం ఎక్కడ ఉంది? దాడి ఎప్పుడు జరిగిందనే విషయాన్ని ట్రంప్ వెల్లడించలేదు. ఈ దాడిలో కేవలం అమెరికా సైన్యమే పాల్గొందా? సిఐఎ ప్రమేయం ఉందా అన్న వివరాలు బయటపెట్టలేదు. ఈ దాడి వెనుజులా భూభాగంపైనే జరిగిందా? లేదా అన్నది కూడా ఇంకా స్పష్టం కాలేదు. ఈ దాడిపై వైట్‌హౌస్ కూడా ఎలాంటి వివరాలు వెల్లడించలేదు. గతంలో డ్రగ్స్ తరలించే బోట్లపై దాడుల సమయంలో చిత్రాలు, విడియోలను పెంటగాన్ విడుదల చేసింది. కానీ ఈ డాక్ ధ్వంసానికి సంబంధించి ఇప్పటివరకు ఎలాంటి ఫొటోలు విడుదల చేయలేదు. మరోవైపు వెనుజులా ప్రభుత్వం కూడా అధికారికంగా స్పందించలేదు. డ్రగ్స్ స్మగ్లింగ్‌పై అమెరికా గత యేడాది సెప్టెంబరు నుంచి ఉక్కుపాదం మోపుతోంది. పసిఫిక్, కరేబియన్ సముద్రాల్లో డ్రగ్స్ అక్రమ రవాణా చేస్తున్నాయని ఆరోపిస్తూ 20కిపైగా బోట్లపై అమెరికా దాడులు చేసింది. వీటిలో చాలావరకు వెనుజులాకు చెందిన బోట్లే ఉన్నాయని అమెరికా చెబుతుంది. ఈ మొత్తం దాడుల్లో 100 మంది వరకు చనిపోయినట్లు సమాచారం.

# మోడీ, అమిత్‌షాలు దుర్యోధన, దుశ్శాసనులు.. పశ్చిమబెంగాల్ సిఎం మమతా బెనర్జీ




**కోల్‌కతా, డిసెంబర్ 30:** పశ్చిమబెంగాల్ సిఎం, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ బిజెపిపై విరుచుకుపడ్డారు. ముఖ్యంగా ప్రధాని నరేంద్రమోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాలను టార్గెట్ చేస్తూ విమర్శలు చేశారు. బెంగాల్ రాష్ట్రంలో ఉగ్రవాద నెట్‌వర్క్‌లు పనిచేస్తున్నాయని అమిత్ షా చేసిన ఆరోపణలపై స్పందిస్తూ పహల్గాం దాడిని కేంద్రమే చేసిందా? అని మమతా ప్రశ్నించారు. బెంగాల్‌లోని బంకురాలోని బిర్సింగ్‌పూర్‌లో జరిగిన ఒక ర్యాలీలో ప్రసంగిస్తూ, అమిత్ షా, ప్రధానమంత్రి నరేంద్ర మోడీలను మహాభారత ఇతిహాసంలోని ఇద్దరు ప్రతినాయకులైన దుశ్శాసన, దుర్యోధనులుగా అభివర్ణించారు. శకుని శిష్యుడైన దుశ్శాసనుడు సమాచారం సేకరించడానికి బెంగాల్‌కు వచ్చాడు. ఎన్నికలు రాగానే ఈ దుశ్శాసన, దుర్యోధనులు ప్రత్యక్షమవుతారు అని ఆమె అన్నారు. బెంగాల్ ఉగ్రవాదులకు కేంద్రంగా మారిందన్న హోంమంత్రి వ్యాఖ్యలపై స్పందిస్తూ, మమతా ఎదురుదాడికి దిగారు. జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదులు లేకపోతే, పహల్గాం ఎలా జరిగింది? పహల్గాంలో దాడిని మీరే చేశారా? ఢిల్లీలో జరిగిన సంఘటన వెనుక ఎవరున్నారు? అని అడిగారు. బెంగాల్‌లో కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఓటర్ల జాబితా ప్రక్రియపై మమత విమర్శలు చేశారు.

రాష్ట్రవ్యాప్తంగా ప్రజలను ఎస్ఐఆర్ పేరుతో వేధిస్తున్నారని అన్నారు. రాజ్‌బన్షీలు, మతువాలు, ఆదివాసీలు వంటి అణగారిన వర్గాలను లక్ష్యంగా చేసుకుంటున్నారన్నారు. ఎస్ఐఆర్ కింద 1.5 కోట్ల మంది పేర్లను తొలగించాలని యోచిస్తున్నారని ఆమె అన్నారు. దీని ద్వారా బెంగాలీల ఓటు హక్కును తొలగించే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు.

# సంస్కరణల ఎక్స్‌ప్రెస్‌లోకి అడుగు పెట్టాం


**- వికసిత్ భారత్ లక్ష్యంగా సంస్కరణలు అమలు**

**- ఇంధనం, పన్నులు, విద్య రంగాల్లో విప్లవాత్మక సంస్కరణలు: ప్రధాని మోడీ**



**న్యూఢిల్లీ, డిసెంబరు 30:** ఇంధనం, పన్నులు, వాణిజ్యం, విద్య తదితర రంగాల్లో 2025లో పరివర్తనాత్మక సంస్కరణలు అమలు చేశామని, తద్వారా భారత్ సంస్కరణ ఎక్స్‌ప్రెస్‌లోకి అడుగు పెట్టిందని ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రకటించారు. వికసిత్ భారత్ లక్ష్యంగా కార్మిక చట్టాలు, జన్ విశ్వాస్, సెక్యూరిటీల మార్కెట్, ఆదాయ పన్ను, జీఎస్‌టిలో మార్పులను ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఈ మేరకు మంగళవారం లింక్డ్ఇన్‌లో ప్రధాని మోడీ పోస్ట్ చేశారు. భారత్ సంస్కరణ ఎక్స్‌ప్రెస్‌లోకి అడుగుపెట్టిందని పేర్కొంటూ, 2025లో సంస్కరణల జాబితాను జతచేశారు. “2025 వివిధ రంగాల్లో విప్లవాత్మక సంస్కరణలను చూసింది. ఇవి మన వృద్ధి ప్రయాణానికి ఊతం ఇచ్చాయి. అవి వికసిత్ భారత్‌ను నిర్మించడానికి మన ప్రయత్నాలను కూడా మెరుగు పరుస్తాయి“ అని ప్రధాని సోషల్ మీడియాలో రాసుకొచ్చారు. 2025ని నిరంతర జాతీయ మిషన్‌గా సంస్కరణలపై దృష్టి సారించిన సంవత్సరంగా అభివర్ణించారు. 'గత 11 సంవత్సరాలుగా కొనసాగుతున్న పునాదిపై నిర్మించబడిన నిరంతర జాతీయ మిషన్‌గా సంస్కరణలపై దృష్టి సారించిన సంవత్సరంగా భారతదేశానికి 2025 గుర్తుండిపోతుంది. తాము సంస్థలను ఆధునీకరించాం, పాలనను సరళీకృతం చేశాం, దీర్ఘకాలిక, సమగ్రవృద్ధికి పునాదులను బలోపేతం చేశాం' అని అన్నారు.

# తమిళ సీరియల్‌నటి నందిని ఆత్మహత్య




**చెన్నై, డిసెంబరు 30:** తమిళ టెలివిజన్ రంగంలో తక్కువ వయసులోనే మంచి గుర్తింపు తెచ్చుకున్న ప్రముఖ సీరియల్ నటి నందిని (20) ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ సంఘటన ఇండస్ట్రీని ఒక్కసారిగా షాక్‌కు గురిచేసింది. షూటింగ్ పూర్తి చేసుకుని ఇంటికి వచ్చిన కొద్దిసేపటికే ఆమె ఈ తీవ్ర నిర్ణయం తీసుకున్నట్లు ప్రాథమిక సమాచారం. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. నందిని గది నుంచి ఒక సూసైడ్ లెటర్ స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. ఆ లేఖలో కుటుంబ సభ్యులు తనపై పెళ్లి విషయంలో ఒత్తిడి తీసుకువస్తున్నారని, ఆ మానసిక వేదనను తట్టుకోలేకపోయానని నందిని పేర్కొన్నట్లు తెలుస్తోంది. గత కొన్ని రోజులుగా నందిని తీవ్ర మానసిక ఒత్తిడితో బాధపడుతోందని గుర్తించారు. కెరీర్ పరంగా ఎదుగుతున్న దశలోనే వ్యక్తిగత సమస్యలు ఆమెను కుంగదీసినట్లు తెలుస్తోంది. నందిని తెలుగమ్మాయే అయినప్పటికీ, ముందుగా కన్నడ సీరియల్ ఇండస్ట్రీలో అడుగుపెట్టి మొదటి సీరియల్‌తోనే మంచి పేరు తెచ్చుకుంది.

# రష్యా అధ్యక్షుడు పుతిన్ ఇంటి వద్ద డ్రోన్ల దాడులు

### ఉక్రెయిన్ చర్యను గగనతలంలోనే ప్రతిఘటించామన్న మాస్కో రక్షణమంత్రి

### దౌత్యచర్చల సమయంలో ఇలాంటి దాడులు మంచిదికాదు.. ట్రంప్



**మాస్కో, డిసెంబరు 30:** రష్యా ఉక్రెయిన్‌ల మధ్య యుద్ధంముగింపునకు వస్తున్న సందర్భంలో పుతిన్ నివాసంపై ఉక్రెయిన్‌డ్రోన్ దాడిచేసిందన్న వార్తలు దౌత్యచర్చలకు అంతరాయం కలిగించింది. తమ అధ్యక్షుడు వ్లాదిమిర్‌పుతిన్ నివాసంపై ఉక్రెయిన్ డ్రోన్లతో దాడిచేసిందని ఈదాడులను తీవ్రంగా ప్రతిఘటించామని రష్యా రక్షణ వ్యవస్థప్రకటించింది. ఈ ఘటనను ఉగ్రదాడిగా పేర్కొన్న మాస్కో యుద్ధవిరమణ చర్చలపై తమ వైఖరిని మార్చుకుంటామని వెల్లడించింది. ఆదివారం రాత్రినుంచి సోమవారం ఉదయం మధ్యలో మాస్కోలోని సెయింట్ పీటర్స్ బర్గ్‌మధ్య ఉన్న నోవ్గోరడ్‌ప్రాంతంలోని పుతిన్ అధికార నివాసం లక్ష్యంగా ఉక్రెయిన్ మొత్తం 91 డ్రోన్లు ప్రయోగించిందన్నారు. అయితే రష్యా గగనతల వ్యవస్థలన్నీ వీటిని ధ్వంసంచేసాయన్నారు. దీనితో యుద్ధవిరమణ చర్చలపై తమ వైఖరిని పునఃసమీక్ష చేసుకుంటామని రష్యా మంత్రి సెర్గీ లావ్రోవ్ అన్నారు. అయితే ఈఆరోపణలను ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తీవ్రంగా ఖండించారు. అమెరికా నేతృత్వంలో సాగుతున్న దౌత్యప్రయత్నాలను భగ్నంచేయడానికే రష్యా ఈ ప్రమాదకర ప్రయత్నాలుచేస్తోందని విమర్శించారు. పుతిన్‌నివాసంపైదాడి కథనం పూర్తిగా కల్పితమనిచెప్పిన జెలెన్‌స్కీ యుద్ధం ముగింపునకు చర్యలు తీసుకోకుండా తప్పించుకోడానికి ఇలాంటిసాకులు చెపుతున్నదన్నారు.

**స్వయంగా పుతిన్ ఫోన్‌చేసి చెప్పారు...డొనాల్డ్‌ట్రంప్**

ఈ డ్రోన్ దాడి వ్యవహారంపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఉక్రెయిన్‌పై తీవ్ర అసహనం వ్యక్తంచేసారు. ఈ సమాచారం స్వయంగా అధ్యక్షుడు పుతిన్ తనకు చెప్పారని అంటూనే అయితే దాడిపై ఆయన సందేహాలు వ్యక్తంచేసారు. డ్రోన్‌దాడి జరక్కపోయి ఉండొచ్చని అందుకు ఆస్కారం కూడా ఉందని అన్నారు. అవమానకరంగా ప్రవర్తించడం ఒక ఎత్తు అయితే ఇంటిపై దాడిచేయడం మరో ఎత్తు అని ఇపుడే అలాంటిపనులుచేయడానికిఇది సరైన సమయం కాదని అన్నారు. అయినా దౌత్యచర్చల సమయంలో ఇలాంటి దాడులు ఎంతమాత్రం మంచిదికాదన్నారు.

# చీనాబ్‌పై కొత్త ప్రాజెక్టుకు ఆమోదం..

### పాక్ దాహంతో అల్లాడిపోవాల్సిందే



**శ్రీనగర్, డిసెంబరు 30:** పాకిస్థాకు గడ్డు కాలం మొదలు కానుంది. పర్యావరణ మంత్రిత్వ శాఖకు చెందిన ఒక కమిటీ జమ్మూ కాశ్మీర్‌లోని కిష్త్వార్ జిల్లాలో చీనాబ్ నదిపై 260 మెగావాట్ల దుల్హస్తీ స్టేజ్-2 జలవిద్యుత్ ప్రాజెక్టుకు ఆమోదం తెలిపింది. పాకిస్థాన్‌లో ఉన్న ఇండస్ జల ఒప్పందం (ఇండస్ వాటర్స్ ట్రీటీ) ప్రస్తుతం నిలిపివేసిన విషయం తెలిసిందే. ఇండస్ నది, దాని ఉప నదుల నీటి సామర్థ్యాన్ని పూర్తిగా వినియోగించాలన్న కేంద్ర ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. పహల్గామ్‌లో జరిగిన పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రదాడి తర్వాత, 1960లో కుదిరిన ఇండస్ జల ఒప్పందాన్ని భారత్ తాత్కాలికంగా నిలిపివేసింది. ఒప్పందం ప్రకారం పాకిస్థాన్‌కు కేటాయించిన ఇండస్ నది పశ్చిమ ఉప నదులైన చీనాబ్, జీలమ్, ఇండస్‌లపై భారత్ తన హక్కులను వినియోగించుకునేందుకు వేగంగా చర్యలు ప్రారంభించింది. దీని లక్ష్యం జలవిద్యుత్ సామర్థ్యాన్ని పెంచడం, నీటి భద్రతను ప్రాధాన్యంగా తీసుకోవడం ప్రారంభించింది. దుల్హస్తీ స్టేజ్-2 ప్రాజెక్టుకు గ్రీన్‌సిగ్నల్ రావడం, జూలైలో ఇదే చీనాబ్ నదిపై 1,856 మెగావాట్ల సవాల్కోట్ జలవిద్యుత్ ప్రాజెక్టుకు అంతర్జాతీయ టెండర్లు పిలిచిన కొన్ని నెలల తర్వాత ఇది జరిగింది. ఇండస్ జల ఒప్పందం అమలులో ఉన్నప్పుడు, పశ్చిమ నదులపై భారత్‌కు కేవలం నీటిని వినియోగించకుండా విద్యుత్ ఉత్పత్తి చేసే హక్కు మాత్రమే ఉండేది. ఇప్పుడు ఒప్పందం నిలిపివేయబడినప్పటికీ, కొత్తగా ఆమోదించిన ప్రాజెక్టులన్నీ 'రన్-ఆఫ్-ది-రివర్' విధానంలోనే ఉండటం గమనార్హం.

## సంక్షిప్తంగా..

### ఐఐటి కాన్పూర్‌కు పూర్వ విద్యార్థులు రూ.100 కోట్ల విరాళం



**కాన్పూర్, డిసెంబరు 30:** ఐఐటీ కాన్పూర్ క్యాంపస్‌లో ఇటీవల నిర్వహించిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం దాతృత్వానికి ఒక మైలురాయిగా నిలిచింది. తమ కెరీర్, జీవితాల్ని తీర్చిదిద్దటంలో కీలకంగా నిలిచిన విద్యా సంస్థకు రూ.100 కోట్లు విరాళంగా అందజేస్తామని వాళ్లంతా ఉమ్మడిగా ప్రతిజ్ఞ చేశారు. దీనిపై ఐఐటీ కాన్పూర్ స్పందిస్తూ, దేశంలోనే అత్యధికం. పూర్వ విద్యార్థుల విరాళంలో ఇది చారిత్రక మైలురాయిని సూచిస్తున్నది. ఐఐటీ కాన్పూర్ పట్ల కృతజ్ఞతా భావాన్ని తెలుపుతుందని పేర్కొన్నది. ఐఐటీ కాన్పూర్‌లో మిలీనియం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సొసైటీని స్థాపించడానికి విరాళాల్ని ఉపయోగించాలని పూర్వ విద్యార్థులు ప్రతిపాదించారు. ఈ సమ్మేళనంలో పాల్గొనేందుకు ప్రపంచం నలుమూలల నుంచి పూర్వ విద్యార్థులు తరలివచ్చారు.

### ప్రియాంక కుమారుడు రెహాన్ నిశ్చితార్థం



**న్యూఢిల్లీ, డిసెంబరు 30:** కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకురాలు వాయనాడు ఎంపి ప్రియాంక గాంధీ వాద్రా కుమారుడు రేహాన్‌వాద్రా వివాహ నిశ్చితార్థం జరిగింది. తన స్నేహితురాలు అవీవాబేగ్‌తో రేహాన్ నిశ్చితార్థం జరిగినట్లు సమాచారం. రెండురోజులక్రితం వీరిద్దరూ దిగిన ఫోటోను అవీవా తన ఇన్‌స్టా స్టోరీస్‌లో పంచుకున్నారు. తర్వాత అదే ఫోటోను హైలైట్స్ సెక్షన్‌లో పోస్టుచేసారు. వీరి ఎంగేజ్‌మెంట్ వార్తలకు ఈ ఫోటోలు మరింత బలాన్నిచ్చాయి. రేహాన్ అవీవా ఏడేళ్లుగాస్నేహితులు. అవీవాముందు రేహాన్‌పెళ్లిప్రస్తావన తీసుకురాగా ఆమె ఆమోదించిందని తెలుస్తోంది. వీరి ప్రేమ బంధాన్ని ఇరుకుటుంబాలు అంగీకరించి నిశ్చితార్థం జరిపించినట్లు వార్తలు వచ్చాయి. దీనిపై గాంధీ, వాద్రా కుటుంబాలనుంచి ఎలాంటిప్రకటన ఇప్పటివరకూ రాలేదు. అవీవా కుటుంబసభ్యులు ఢిల్లీకి చెందినవారని రాబర్ట్ వాద్రా కుటుంబంతో వీరికి సన్నిహిత సంబంధాలున్నట్లు చెపుతున్నారు.

### ఉత్తరాఖండ్ లోయలో పడిన బస్సు.. ఏడుగురు మృతి!



**డెహ్రాడూన్, డిసెంబర్ 30:** ఉత్తరాఖండ్‌లో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. మంగళవారం తెల్లవారుజామున అల్మోరా జిల్లాలోని శిలాపానీ ప్రాంతంలో ప్రయాణికులతో వెళుతున్న బస్సు ప్రమాదవశాత్తు లోయలో పడిపోయింది. ఈ ఘటనలో ఏడుగురు మృతి చెందగా మరో 11 మంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఘటనా స్థలంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయని పోలీసు పేర్కొన్నారు. అయితే ప్రమాదం జరిగిన లోయ ప్రదేశం ఇబ్బందికరంగా ఉండడం, వాహనం కింద బురద పేరుకుపోవడంతో అందులో ఇరుక్కుపోయిన వారిని వారిని బయటకు తీయడం కష్టంగా మారిందన్నారు. స్థానికుల సహాయంతో క్షతగాత్రులను సమీపంలోని ఆసుపత్రికి తరలిస్తున్నట్లు తెలిపారు. బస్సు ద్వారహాత్ మీదుగా రాంనగర్‌కు వెళుతుండగా అదుపుతప్పి లోయలో పడినట్లు ప్రాథమిక దర్యాప్తులో గుర్తించామన్నారు.

### బంగ్లాదేశ్‌లో మరో హిందూ వ్యక్తి హత్య!



**ఢాకా, డిసెంబర్ 30:** బంగ్లాదేశ్‌లో దీపూ చంద్ర దాస్, అమృత్ మండల్ అనే హిందూ యువకుల హత్యోదంతాలు మరువకముందే మరో హిందువు హత్యకు గురయ్యాడు. మయమన్‌సింగ్ జిల్లాలోని ఒక కర్మాగారంలో సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వహిస్తున్న బజేంద్ర బిశ్వాస్ (42)ను అతడి సహోద్యోగి నోమన్ మియా కాల్చి చంపినట్లు స్థానిక మీడియా వర్గాలు వెల్లడించాయి. తాము ఇద్దరం ఫ్యాక్టరీ బారక్‌లో సరదాగా మాట్లాడుకుంటున్న సమయంలో భద్రత కోసం ఉపయోగించే తుపాకీని బిశ్వాస్‌వైపు గురిపెట్టానని అనుకోకుండా చేయి ట్రిగర్‌కు తాకడంతో తుపాకీ పేలి, బుల్లెట్ అతడికి తగిలిందని నోమన్ మియా పేర్కొన్నాడు. వెంటనే ఆసుపత్రికి తరలించగా అతడు మరణించినట్లు వైద్యులు ధృవీకరించినట్లు తెలిపాడు. కేసు నమోదు చేసిన పోలీసులు నోమన్ మియాను అరెస్టు చేశారు. బిశ్వాస్ మృతికి కారణాలపై దర్యాప్తు చేస్తున్నామన్నారు.

# రామతీర్థంలో మార్మోగిన రామనామస్మరణ



- ఘనంగా ముక్కోటి ఏకాదశి
- గిరిప్రదక్షిణకు పోటెత్తిన భక్తులు

నెల్లిమర్ల (విజయనగరం జిల్లా), డిసెంబరు 30 ప్రభాతవార్త: విజయనగరం జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం రామస్వామి వారి దేవస్థానం వద్ద ముక్కోటి ఏకాదశి పర్వదినం, గిరి ప్రదక్షిణ కార్యక్రమాల నేపథ్యంలో వచ్చిన వేలాది మంది భక్తులతో శ్రీరామ నామస్మరణ మార్మోగింది. అడుగడుగునా జైశ్రీరామ్ జైశ్రీరామ్ అంటూ భక్తులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. రామతీర్థం దేవస్థానం ఉత్తర ద్వారం గుండా వెళ్లి సీతారామ స్వాములను దర్శించుకున్నారు. అలాగే బోడికొండ మెట్ల వద్ద ఎమ్మెల్యే లోకం నాగ మాధవితో పాటు, సాధు పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసానంద సరస్వతి ఆధ్వర్యంలో మెట్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పలు సాంస్కృతిక ప్రదర్శనలతో భక్తులు గిరిప్రదక్షిణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సుమారు 9 కిలోమీటర్లు నిడివిగల గిరిప్రదక్షిణారోడ్డు మార్గం సుమారు ఐదు గంటల పాటు భక్తులతో కిటకిటలాడింది. బోడికొండ మెట్ల వద్ద ప్రారంభమైన గిరిప్రదక్షిణ కార్యక్రమం రామతీర్థం ఎస్ టి కాలనీ, మెయిన్ రోడ్, సీతారాముని పేట జంక్షన్, గొర్లపేట కల్లాలు మీదుగా బోడికొండ చుట్టూ వేలాదిమంది ప్రదక్షిణ చేశారు. ప్రదక్షిణ చేసిన భక్తులు బోడికొండ కొండ మీదకు వెళ్లి కోదండ రామాలయంలో రామస్వామిని దర్శించుకున్నారు. కొండపై ఉన్న వివిధ చారిత్రక చిహ్నాలను సందర్శించారు. గిరిప్రదక్షిణ ఊరేగింపులో భాగంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. గిరి ప్రదక్షణ ఊరేగింపు ఆద్యంతం ఎమ్మెల్యే లోకం నాగ మాధవి, సాధు పరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసనంద సరస్వతి పాల్గొన్నారు. పలు స్వచ్ఛంద సంస్థలు ప్రతినిధులు కొండ చుట్టూ గిరిప్రదక్షిణ మార్గంలో ఉచిత రీతిన మజ్జిగ ప్యాకెట్లను, బిస్కట్ ప్యాకెట్లను, మంచినీటి ప్యాకెట్లను వితరణగా అందజేశారు. అనంతరం దేవస్థానం వెనుక భాగాన ఉన్న ఖాళీ స్థలంలో వేలాది మంది భక్తులకు దేవస్థానం అధికారులు ఉచిత భోజన సదుపాయం ఏర్పాటు చేశారు.

### దైవదర్శనానికి ప్రముఖులు హాజరు

ముక్కోటి ఏకాదశి ప్రత్యేక దినాన్ని పురస్కరించుకొని ఉత్తర ద్వార దర్శనం చేసుకునేందుకు పలువురు ప్రముఖులు మంగళవారం రామతీర్థం రామస్వామి వారి దేవస్థానానికి చేరుకున్నారు. ఉత్తర ద్వార దర్శనం తలుపులు ఉదయం ఐదున్నర గంటలకు అర్చకులు తెరిచారు. ఉత్తర ద్వారంలో ఊయలపై స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఉంచి భక్తులకు దర్శనానికి అనుమతించారు. ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగ మాధవి దంపతులతో పాటు విజయనగరం ఎమ్మెల్యే, రామతీర్థం దేవస్థానం ఆలయ ధర్మకర్త పూసపాటి అశోక్ గజపతిరాజు కుమార్తె పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు, ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదుటి ఈశ్వరరావు, విజయనగరం జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్, పలువురు అధికారులు రాజకీయ నాయకులు హాజరై దర్శనం చేసుకున్నారు. రామతీర్థంలో జరిగిన కార్యక్రమాలకు సుమారు 20వేల మందికి పైగా హాజరైనట్లు అధికారుల అంచనా. దేవస్థానంలో ఏర్పాట్లను ఈవో వై.శ్రీనివాసరావు అనుక్షణం పర్యవేక్షించారు. వేడుకలను, గిరిప్రదక్షిణ పురస్కరించుకొని ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా భోగాపురం రూరల్ సిఐ బి.రామకృష్ణ పర్యవేక్షణలో నెల్లిమర్ల, డెంకాడ, పూసపాటిరేగ ఎస్ఐలు బి.గణేష్, సన్యాసినాయుడు, దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు ఏర్పాటయింది. ఉత్తర ద్వార దర్శనం, గిరి ప్రదక్షణ కార్యక్రమాలు విజయవంతంగా ముగియడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. భక్తుల క్రమబద్ధీకరణలో పోలీసులతో పాటు పలు ప్రాంతాలకు చెందిన శ్రీవారి సేవ మహిళలు ఉచిత రీతిన సేవలు అందించారు.

# వేణుగోపాలస్వామి రథాన్ని పునః ప్రారంభిస్తాం

## ఆలయ ధర్మకర్త ఆర్.వి.ఎస్.కె రంగారావు



బొబ్బిలి (విజయనగరం జిల్లా), డిసెంబరు 30 ప్రభాతవార్త: ఎంతో చరిత్ర కలిగిన 90 ఏళ్ల క్రితం ఆగిపోయిన రథోత్సవాన్ని మళ్లీ పునః ప్రారంభిస్తామని శ్రీ వేణుగోపాలస్వామి ఆలయ ధర్మకర్త ఆర్.వి.ఎస్.కే రంగారావు అన్నారు. 90 ఏళ్ల క్రితం ప్రతి ఏడాది శ్రీ వేణుగోపాలస్వామి వారిని దీపావళి అమావాస్య రోజున రాజ కుటుంబీకులు ఎంతో వైభవంగా రథోత్సవాన్ని నిర్వహించే వారని, 1930 దశకంలో ఒకసారి స్వామివారి రథోత్సవం ఏర్పాట్లు జరుగుతున్న రోజున అనుకోకుండా మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ బొబ్బిలిలో అదే రోజు స్వతంత్రోద్యమ సభ ఏర్పాటు చేయదలచినప్పుడు ఈ రథోత్సవం ఏర్పాట్లను బొబ్బిలి రాజులు ఉద్దేశపూర్వకంగా చేస్తున్నారని కొందరు సమాచారం అందించడంతో ఆ విషయం తెలిసిన బొబ్బిలి రాజావారు నెహ్రూ గారికి మధ్యవర్తిత్వం ద్వారా వాస్తవాన్ని తెలియపరిచే ప్రయత్నం చేసినా అది ఫలించిన కారణంగా ఆ రథాన్ని విరమించాలని అర్చక స్వాములను బొబ్బిలి రాజా వారు ఆదేశించడం జరిగిందని మరి ఏ కారణంతో ఆ వేడుకలు ఇప్పటివరకు జరిపించలేదని అన్నారు. మళ్లీ ఇప్పుడు రథోత్సవ వైభవాన్ని పునః ప్రారంభించే ఉద్దేశంతో చిన్న జీయర్ స్వామి కలిసినప్పుడు బేబీ నాయన తన ఆలోచనను ఆయనకు తెలిపారు. అది మీకు దక్కిన గొప్ప అదృష్టంగా భావించి సత్వరమే పనులు ప్రారంభించమని చెప్పారన్నారు. రథం తయారీకి 27 అడుగుల ఎత్తు సుమారు 40 లక్షల ఖర్చు అవుతుందని బొబ్బిలి రాజా కుటుంబం కొన్ని కోట్ల రూపాయలు వెచ్చించి శ్రీ వేణుగోపాల స్వామి వారి సేవ ని చేస్తున్నామని తాము సొంతంగా రథాన్ని చేయించగలిగినప్పటికీ బొబ్బిలి ప్రాంత ప్రజలందరికీ స్వామి వారి సేవా భాగ్యం కలిగించదలచి దాతలను ఆహ్వానించడం జరిగిందన్నారు. ఒకటి రెండు రోజుల్లో సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు ఇస్తామని ఇందులో ఎటువంటి సమస్య లేదని ఇష్టపూర్వకంగానే దాతలు విరాళాలు ఇవ్వాలని అది పది రూపాయలైనా పదివేలు అయినా తీసుకుంటామని చెప్పడం జరిగిందన్నారు. దీనికోసం ఒక హెల్ప్ లైన్ నెంబర్ ఇస్తామన్నారు. భక్తులు ఈ సదావకాశాన్ని వినియోగించుకొని రథాన్ని పునః ప్రారంభించడానికి మీరందరూ పాత్రులు కావాలని ఆయన కోరారు.

# శేషవాహనంపై శ్రీకాళహస్తీశ్వరుడు సింహవాహనంపై దేవేరి దర్శనం



బంగారు శేష,సింహ వాహనాలపై స్వామిఅమ్మవార్ల దర్శనం

శ్రీకాళహస్తి, డిసెంబరు 30 ప్రభాతవార్త: దక్షిణ కైలాసంగా ఖ్యాతిగడించిన శ్రీకాళహస్తీశ్వరాలయంలో మంగళవారం ముక్కోటి ఏకాదశి సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయానికి పూల సొగసులతో ముస్తాబు చేసారు. అలాగే ఆలయానికి అనుబంధంగా ఉన్న ప్రసన్న వరదరాజస్వామి ఆలయంలో ఏడు ద్వారాలతో పాటు ఉత్తరద్వారాన్ని ఏర్పాటు చేసారు. విద్యుత్ దీపాలతో కళ్ళు జిగేలు మనిపించే విధంగా తీర్చిదిద్దారు. భక్తులతో కిటకిట లాడింది. వేకువ జాము నుంచి ఆలయంలో భక్తుల తాకిడి అధికమైంది. ఉదయం ఆలయంలోని అలంకార మండపంలో స్వామి అమ్మవార్లను చక్కగా ముస్తాబు చేశారు. బోయిలు స్వామి అమ్మవార్లను మోసుకుంటూ వాహనాల మండపం వద్దకు తీసుకొచ్చారు. ఇక్కడ స్వామి వారిని బంగారు శేష వాహనంపై ప్రతిష్టించారు. దేవేరి జ్ఞాన ప్రసూనాంబ అమ్మవారిని బంగారు సింహావాహనంపై ప్రతిష్టించి మేళ తాళాలు మంగళ వాయిద్యాలతో గ్రామంలో ఊరేగించారు. ఈ ఉత్సవానికి భక్తుల నుంచి విశేష స్పందన వచ్చింది. తరువాత గొబ్బెమ్మను గ్రామోత్సవం నిర్వహించారు. ఉత్స వాలను సమయపాలనతో నిర్వహించుటకు ఆలయ ఇఒ డి.బాపిరెడ్డి ఆదేశాలతో టెంపుల్ ఇన్‌స్పెక్టర్ వెంకటస్వామి, దఫేదార్ రాజాల పర్యవేక్షణలో గ్రామోత్సవం నిర్వహించారు.

# 'మనమిత్ర వాట్సప్ యాప్‌పై' విస్తృత ప్రచారం

## కొత్త కౌంటర్లను పరిశీలించిన దేవాదాయశాఖ కమిషనర్



శ్రీకాళహస్తి, డిసెంబరు 30 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయంలో రూ.1.4కోట్లతో కొత్తగా ఒకేచోట ఏర్పాటు చేస్తున్న 8 కౌంటర్లను మంగళవారం దేవాదాయశాఖ కమిషనర్ రామచంద్రమోహన్ పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ భక్తులతో మమేక మయ్యారు. ఆలయ ఇఒ డి.బాపిరెడ్డికి పలు సూచనలు చేస్తూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'మన మిత్ర వాట్సప్‌'పై విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. ఇది భక్తులకు ఎంతో ఉపయోగ పడుతుందన్నారు. కొత్తగా ఏర్పాటు చేసిన కౌంటర్లను పరిశీలించిన కమిషనర్ ఇక్కడ భక్తులకు అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించాలన్నారు. టిక్కెట్లతో పాటు బస సదుపాయం, ఇతర సేవలకు సంబంధించిన అంశాలను పరిగణలోకి తీసుకొని ఏర్పాటు చేయాలని సూచించారు. ఇందుకు స్పందించిన ఇఒ వివరణ ఇస్తూ ఇక్కడ అనుబంధంగా మరెన్నో కౌంటర్లుకు ఇటీవల జరిగిన ధర్మకర్తల మండలిలో తీర్మానం చేసి ఉన్నట్లు వివరించారు. ఇక్కడే భక్తుల వస్తువులు భద్రపరచుటకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు.

### భక్తుల అభిప్రాయాలకు పెద్దపీట వేయాలి

ఈ సందర్భంగా పలువురు భక్తులతో కమిషనర్ రామచంద్రమోహన్ దర్శనం, సిబ్బంది ప్రవర్తన తీరు, నిత్యాన్న ప్రసాదంలో భోజనం నాణ్యత, ప్రసాదాల రుచికి సంబంధించి వాకబు చేసారు. దేవస్థానం విధి విధానాలపై ఏమైనా అసంతృప్తి ఉంటే రాతపూర్వకంగా భక్తుని నుంచి ఫిర్యాదు తీసుకొని తీసుకున్న చర్యలకు సంబంధించి ఆ భక్తునికి చరవాణి సమాచారం పంపాలని సూచించారు. ఆన్‌లైన్ సేవలకు సంబంధించి మారుమూల కూడా తెలిసే టట్లు 'మన మిత్రవాట్సప్' సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ యాప్‌పై భక్తులకు సక్రమంగా అవగాహన కల్గితే ఎంతో ప్రయోజనం ఉంటుందని వివరించారు. దర్శన విరామ సమయంలో దేవస్థానం మైకుల ద్వారా మన మిత్ర యాప్‌కు సంబంధించి ఎడతెరపి లేకుండా ప్రచారం చేసి భక్తులకు అవగాహన కల్పిస్తూ సమాచారం ఇవ్వాలని కమిషనర్ ఆదేశించారు. ఈ పరిశీలనల్లో కమిషర్ రామచంద్రమోహన్‌తో పాటు ధర్మకర్తల మండలి చైర్మన్ కొట్టె సాయిప్రసాద్, ధర్మకర్తల మండలి సభ్యులు దండి రాఘవయ్య మర్యాద పూర్వకంగా కలసినారు. కమిషనర్ పరిశీలనల్లో ఇఒ బాపిరెడ్డి, ఎఇఒలు హేమామాలిని, విద్యాసాగం రెడ్డి, మోహన్, సూపరింటెండెంట్‌లు రవి, నాగభూషనం యాదవ్, శ్రీహరి, ఇన్‌చార్జి ఇఒ శ్రీనివాసులు రెడ్డి, ఇంజనీరింగ్ విభాగానికి చెందిన కిషోర్ తదితరులున్నారు.

# మంగళగిరి పానకాల లక్ష్మీనరసింహస్వామి ఆలయం, భీమవరం మావుళ్ళమ్మ తల్లి దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యులు నియామకం

విజయవాడ, డిసెంబరు 30 ప్రభాతవార్త ప్రతినిధి: మంగళగిరి పానకాల లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యులను 12 మందిని నియమిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసింది. ఇంకొక సభ్యుడు జనరల్ కేటగిరి నుంచి నియామకానికి అవకాశం ఉందని.. తర్వాత నియమిస్తామని ఉత్తర్వుల్లో ప్రభుత్వం పేర్కొంది. ప.గో.జిల్లా, భీమవరం శ్రీ మావుళ్ళమ్మ అమ్మవారి దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యులను 13 మందిని నియమిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసింది. వీరంతా బాధ్యతలు స్వీకరించిన తేదీ నుంచి 2 సంవత్సరాల పాటు పదవిలో ఉంటారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



# వైద్య సిబ్బంది తీరు మారాలి

- ఆరోగ్య భద్రత నవ సంవత్సరంలో సంకల్పం కావాలి
- వైద్య సిబ్బంది, రాష్ట్ర ప్రజలకు మంత్రి సత్యకుమార్ నూతన సంవత్సర శుభాకాంక్షలు

సచివాలయం, డిసెంబరు 30 ప్రభాతవార్త: సమగ్ర ప్రజారోగ్య భద్రత సాధనకు వైద్యులు, ఇతర సిబ్బంది తీరు మారాలని, దీంతో పాటు ప్రజల ఆచార వ్యవహారాలు, జీవనశైలిలో సమగ్ర మార్పు రావాలని వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆకాంక్షించారు. ఈ దిశగా అందరూ నూతన సంవత్సరం సందర్భంగా సంకల్పం తీసుకోవాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. వైద్య సిబ్బందికి, రాష్ట్ర ప్రజలకు మంత్రి నూతన శుభాకాంక్షలు తెలిపారు. ప్రజారోగ్య పరిరక్షణ కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, ఈ లక్ష్య సాధనకు ప్రజల పూర్తి భాగస్వామ్యం కీలకమని మంగళవారంనాడు విడుదల చేసిన ఒక ప్రకటనలో మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పష్టం చేశారు.

వ్యక్తిగత పరిశుభ్రత, నివాస ప్రాంతాల్లో పారిశుద్ధ్యం, ఆరోగ్యకరమైన జీవన విధానం పట్ల ప్రజలు శ్రద్ధ వహించాలని మంత్రి కోరారు. వేగంగా విస్తరిస్తున్న మధుమేహం(బ్లడ్ షుగర్), రక్తపోటు(బ్లడ్ ప్రెషర్), క్యాన్సర్ వంటి అసంక్రమణ(నాన్ కమ్యునకబుల్ డిసీజెస్) వ్యాధులకు అరికట్టడానికి ప్రజల జీవన విధానంలో సమగ్ర మార్పుల అవసరాన్ని మంత్రి నొక్కివక్కాణించారు. ఆరోగ్యకరమైన ఆహారం, నిత్య వ్యాయామం, యోగా మరియు ధ్యానం ప్రక్రియల ద్వారా శారీరక, మానసిక ఆరోగ్య పరిరక్షణపై ప్రజలు దృష్టి పెట్టాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వాసుపత్రుల్లోని వైద్యులు, ఇతర సిబ్బంది విధుల నిర్వహణలో వెల్లడవుతున్న కొన్ని లోపాల పట్ల మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజారోగ్య పరిరక్షణ కోసం కూటమి ప్రభుత్వం భారీగా నిధులు కేటాయిస్తోందని, ఆశించిన ఫలితాలు రావాలంటే వైద్యులు, పారా మెడికల్ సిబ్బంది దృక్పథాల్లో మార్పులు రావాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పష్టం చేశారు. గత 19 నెలలుగా కూటమి ప్రభుత్వం ప్రయత్నాలతో కొంత మార్పు స్పష్టంగా వచ్చిందని, ఈ మార్పును మరింత విస్తృతంగా, లోతుగా సాధించాలని మంత్రి అభిప్రాయపడ్డారు. ఆరోగ్యాంధ్రప్రదేశ్ సాధనగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశయాలకనుగుణంగా అందరూ సమిష్టి కృషి చేయాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ విజ్ఞప్తి చేశారు.

# సమన్వయ లోపంతో దుర్గగుడిలో విద్యుత్ అంతరాయం

- తప్పు చేసిన వారిపై చర్యలు తప్పవు
- భక్తుల మనోభావాలకు కూటమి ప్రభుత్వం పెద్దపీట
- దుర్గగుడి ఘటనపై రాజకీయ విమర్శలు దురదృష్టకరం
- మంత్రి గొట్టిపాటి రవికుమార్



విజయవాడ, డిసెంబరు 30 ప్రభాతవార్త ప్రతినిధి: విజయవాడలోని దుర్గగుడిలో విద్యుత్ అంతరాయం అంశాన్ని కొందరు రాజకీయం చేయడం దురదృష్టకరమని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. మంగళవారం నాడు తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మంత్రి గొట్టిపాటి మాట్లాడారు. విజయవాడ కనకదుర్గమ్మ గుడిలో సుమారు 15 నిమిషాల పాటు విద్యుత్ అంతరాయం కలగడానికి గల కారణాలపై దేవాదాయ, విద్యుత్ శాఖాధికారులతో సమావేశం నిర్వహించినట్లు మంత్రి గొట్టిపాటి తెలిపారు. విద్యుత్ అంతరాయం విషయం తన దృష్టికి రాగానే... యుద్ధప్రాతిపదికన విద్యుత్ సరఫరా పునరుద్ధరిచామని వెల్లడించారు. అధికారుల మధ్య సమన్వయం లోపం వల్లే దుర్గ గుడిలో కరెంట్ సరఫరా నిలిచి పోయిందన్నారు. దీనిపై వెంటనే నివేదిక ఇవ్వాలని ఉన్నతాధికారులను ఆదేశించినట్లు స్పష్టం చేశారు. ఈ ఘటనకు సంబంధించి బాధ్యుల మీద చర్యలు తీసుకుంటామని అన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూస్తామని హామీ ఇచ్చారు. భక్తుల మనోభావాలకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని మంత్రి గొట్టిపాటి ఉద్ఘాటించారు. జనవరి 6, 7 తేదీలో దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో మరోసారి దుర్గ గుడి ఈవో, ముఖ్య అధికారులతో కలిసి సమావేశం కానున్నట్లు మంత్రి గొట్టిపాటి ప్రకటించారు. సమన్వయ లోపం వల్ల జరిగిన ఈ చిన్న పొరపాటును పట్టుకొని రాజకీయ విమర్శలు చేయడం తగదని మంత్రి గొట్టిపాటి హితవు పలికారు. ప్రతీ చిన్న విషయాన్ని కూడా రాజకీయ అవసరాలకు వినియోగించుకోవడం వైసీపీ నాయకులకు అలవాటుగా మారిపోయిందని విమర్శించారు. సనాతన ధర్మానికి మాత్రమే కాకుండా ఏ ధర్మానికైనా.. కూటమి ప్రభుత్వంలోనే న్యాయం జరుగుతుందని స్పష్టం చేశారు. ప్రజల ఆకాంక్షలకు తగ్గట్టుగా అద్దంకి, కందుకూరు నియోజకవర్గాలను ప్రకాశం జిల్లాలో కలపడం ఎంతో సంతోషదాయకమని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ అన్నారు. గత ప్రభుత్వం చేసిన తప్పులను సరి దిద్దుతూ.. జిల్లాల పునర్విభజన జరిగిందన్నారు. పాదయాత్రలో మంత్రి నారా లోకేష్ ఇచ్చిన హామీ ప్రకారం కందుకూరు, అద్దంకిని ప్రకాశం జిల్లాలో కలిపినట్లు పేర్కొన్నారు. 2012 నుంచి అద్దంకి రెవెన్యూ డివిజన్ కోసం పోరాడుతుండగా... కూటమి ప్రభుత్వంలో సాకారమైనట్లు మంత్రి గొట్టిపాటి తెలిపారు. అద్దంకిని రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు సహకరించిన సిఎం చంద్రబాబు, మంత్రి లోకేష్, రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్‌తో పాటు మంత్రి వర్గ ఉపసంఘానికి మంత్రి గొట్టిపాటి కృతజ్ఞతలు తెలిపారు.

# బెజవాడలో తగ్గిన నేరాలు

- గత ఏడాదితో పోలిస్తే 21శాతం తగ్గుదల
- గంజాయి, డ్రగ్స్‌పై ప్రత్యేక నిఘా
- ట్రాఫిక్ నియంత్రణకు కఠిన చర్యలు
- పోలీస్ కమిషనర్ రాజశేఖర్‌బాబు వెల్లడి



విజయవాడ, డిసెంబరు 30 ప్రభాతవార్త ప్రతినిధి: రాజధాని ప్రాంత పరిధిలో కీలకమైన విజయవాడ (ఎన్టీఆర్ జిల్లా) పోలీసు కమీషనరేట్ ప్రాంతంలో వచ్చే ఏడాదిలో సైబర్ నేరాల కట్టడిపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్లు సీపీ రాజశేఖర్‌బాబు తెలిపారు. 2024తో పోలిస్తే ఈ సంవత్సరం నేరాల లెక్క తగ్గినట్లు, వార్షిక నేర సమీక్ష 2025లో భాగంగా వెల్లడించారు. 2025లో సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి మంచి ఫలితాలు సాధించామన్నారు. సురక్ష ప్రాజెక్ట్ ద్వారా నగరంలో ఒకేసారి వెయ్యి కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. వచ్చే ఏడాది నార్కోటిక్, ఎకనామిక్ కేసులను అరికట్టే విధంగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా 21 శాతం క్రైం తగ్గించామని సీపీ రాజశేఖర్ బాబు తెలిపారు. ఎవిడెన్స్ బేస్ పోలీసింగ్‌కు ప్రాధాన్యత ఇచ్చామన్నారు. ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా 10 వేల సీసీ కెమెరాలు ఏర్పాటు చేసామని ఆలయాల్లో, ప్రార్థనా మందిరాల్లో కూడా కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. గంజాయి, మత్తు పదార్థాల రవాణాను నియంత్రణ చేశామని వ్యాఖ్యానించారు. అస్త్రం ద్వారా ట్రాఫిక్‌ను నియంత్రిస్తున్నామన్నారు. ఎక్కడా ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టామని వెల్లడించారు. సైబర్ క్రైం తగ్గినా నగదు నష్టం ఎక్కువగా ఉందని వెల్లడించారు. 80.70 శాతం రికవరీ ఉండటం ఒక రికార్డు. 2024లో 52శాతం మాత్రమే రికవరీ ఉందన్నారు. కన్విక్షన్ 50 శాతం నిందితులకు పడిందని తెలిపారు. హత్యలు, కిడ్నాప్‌లు, అత్యాచారాలు, రోడ్డు ప్రమాదాలు తగ్గాయన్నారు. రోడ్డు ప్రమాద మరణాలు ఇరవై శాతం తగ్గాయని హెల్మెట్, సీటు బెల్ట్ పై అవగాహన కల్పించడం ద్వారా మంచి ఫలితాలు వచ్చాయన్నారు. వచ్చే ఏడాదిలో ఈ ప్రమాదాలు, మరణాల సంఖ్య తగ్గించేలా చేస్తామని వెల్లడించారు. ద్విచక్ర వాహనదారులే ఎక్కువగా ప్రమాదాల్లో మరణిస్తున్నారని తప్పకుండా ప్రతి ఒక్కరూ హెల్మెట్ వాడాలని సూచించారు. హిట్ అండ్ రన్ కేసులు 328 ఉంటే 238 మందికి ఆర్థిక సాయం రూ.2 కోట్లతో అందించామన్నారు. దేశంలోనే ఇది 3వ స్థానంలో ఉండటం ఎన్టీఆర్ పోలీస్ గొప్పగా భావిస్తున్నామన్నారు. సైబర్ క్రైంలో 9.54 కోట్ల రూపాయలను నిందితుల ఖాతాల్లో సీజ్ చేశామని తెలిపారు. నార్కోటిక్ కేసుల్లో 22 మంది పై పిట్ ఎన్డిపియస్ అమలు చేసామని రాష్ట్రంలో తొలిసారిగా ఇక్కడే ఈ సెక్షన్ కింద కేసు పెట్టామన్నారు.

### అస్త్రం యాప్ ద్వారా ట్రాఫిక్ కష్టాలు లేకుండా చర్యలు

ఎన్టీఆర్ జిల్లా క్రైమ్‌కు ఎబీసీడీఅవార్డు వచ్చిందని టీంకు పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు అభినందనలు చెప్పారు. పసికందులను విక్రయించే ముఠాను అరెస్టు చేశామని కీలక వ్యక్తులను అరెస్టు చేసేందుకు బృందాలు పని చేస్తున్నాయన్నారు. అస్త్రం యాప్ ద్వారా ట్రాఫిక్ కష్టాలు లేకుండా చర్యలు తీసుకున్నామని ఆయా ప్రాంతాల్లో ఇన్‌స్పెక్టర్‌ల పనితీరు కూడా తెలిసిపోతుందన్నారు. వీటి ఆధారంగా వారి పనితీరులో మార్పు వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. రేపు ఏ జంక్షన్‌లో రద్దీ ఉండ బోతుందో కూడా ఈరోజు తెలుసుకుని ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని అస్త్రం టూల్ ద్వారా కచ్చితమైన ఫలితాలు సాధిస్తున్నామని వెల్లడించారు. ఈ పాథ్ ద్వారా అంబులెన్స్ మూవ్‌మెంట్ తెలియజేస్తే గ్రీన్ ఛానల్ ఇచ్చే అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు. మనం ఏ రూటులో వెళితే రద్దీ ఉండదు అని ప్రజలకు యాప్ ను అందుబాటులోకి తెస్తున్నామన్నారు. ఆయా ప్రాంతాల్లో రద్దీ, వీవీపీ మూవ్‌మెంట్ బట్టి ట్రాఫిక్ ఆగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ డిప్లాయిమెంట్ ద్వారానే సిబ్బందికి బందోబస్తు డ్యూటీలు వేస్తున్నామన్నారు. ఇప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా ఇదే విధానాన్ని అమలుకు చర్యలు తీసుకుంటున్నారని అన్నారు.

### పార్కింగ్ ప్రదేశాల్లోనూ కెమెరాలు

దసరా, భవానీ దీక్షల విరమణ, ఇతర భారీ ఉత్సవాలకు రద్దీని మానటరింగ్ చేయడంలో డ్రోన్‌లు కీలకంగా పని చేశాయని గుర్తు చేశారు. సాంకేతిక పరిజ్ఞానం ద్వారా అద్భుతంగా పని చేశామన్నారు. 18 లక్షల మంది దసరాకు వచ్చినా, భవానీ దీక్షల విరమణకు 6 లక్షలు వచ్చినా ఎక్కడా ఇబ్బంది లేకుండా చేశామన్నారు. క్యూలైన్లలో కౌంటింగ్ కెమెరాలు పెట్టి ఎప్పటికప్పుడు క్రౌడ్‌ను అంచనా వేశామని తెలిపారు. అన్ని ఆలయాల్లో వచ్చే ఏడాదిలో ఈ కౌంటింగ్ కెమెరాలు ఏర్పాటు చేస్తామన్నారు. వాటికి అనుసంధానించే సర్వర్, ఇతర పరికరాలు కొనుగోలు చేయాల్సి ఉందని వెల్లడించారు. పార్కింగ్ ప్రదేశాల్లో కూడా కౌంటింగ్ కెమెరాలు పెట్టబోతున్నామని సిపి వివరించారు.



# సారస్ మస్కట్ విడుదల

- గుంటూరులో జనవరి 6 నుండి 18 వరకు సారస్
- సారస్ మస్కట్‌గా గుంటూరు మిరపకాయ

సచివాలయం, డిసెంబరు 30 ప్రభాతవార్త: సారస్ (సేల్ ఆఫ్ ఆర్టికల్స్ ఆఫ్ రూరల్ ఆర్టిసన్స్ సొసైటీ) మస్కట్‌ను జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో విడుదల చేశారు. సారస్ ను రాష్ట్ర పేదరిక నిర్మూలన సంస్థ సౌజన్యంతో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ నిర్వహిస్తోంది. గుంటూరు మిరపకు ప్రసిద్ధి చెందడంతో "మిరప కాయ" నే మస్కట్ గా ఎంపిక చేసి రూపొందించారు. సారస్ ప్రదర్శన జనవరి 6వ తేదీ నుండి 18వ తేదీ వరకు గుంటూరులో నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గుంటూరు పట్టణంలో నర్సరావుపేట రహదారిలో రెడ్డి కళాశాల ఎదురుగా ఉన్న స్థలంలో ప్రదర్శనశాలల ఏర్పాటు జరుగుతుందన్నారు. రాష్ట్రంలో మొట్ట మొదటిసారిగా జాతీయ స్థాయి సారస్ కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రజలకు ఉచిత ప్రవేశం, పార్కింగ్ సదుపాయం ఉందన్నారు.

దేశంలోని అన్ని రాష్ట్రాల నుండి ఆయా రాష్ట్రాల సంస్కృతులను ప్రతిబింబించే చేనేతలు, హస్తకళలు, ఇతర సామగ్రిని ప్రదర్శించడం, విక్రయించడం జరుగుతుందని తెలిపారు. మినీ భారత సాంస్కృతిక, కళా సమ్మేళనంను తలపిస్తుందని చెప్పారు. ఆరు వందల మందికి పైగా చేనేత, హస్త కళాకారులు, సాంస్కృతిక కళాకారులు వస్తున్నారని, 250కు పైగా ప్రదర్శనశాలలు ఏర్పాటు చేస్తున్నారన్నారు. హ్యాండ్లూమ్స్, హ్యాండిక్రాఫ్ట్స్, చీరలు, షాల్స్, కార్పెట్లు, బెడ్ షీట్‌లు, వెదురు, లోహ, గాజు ఉత్పత్తులు, సాంప్రదాయ, ఆర్గానిక్ ఆహార పదార్థాలు, ఆభరణాలు, గృహ అలంకరణ వస్తువులు, ఆహార పదార్థాలు వంటి ఉత్పత్తులు ప్రదర్శన, విక్రయం జరుగుతుందన్నారు. ఈ మినీ భారత సమ్మేళనంలో గుంటూరు సంస్కృతి, సంప్రదాయాలు, చారిత్రక విశేషాలు తెలియజేసి జిల్లా విశిష్టతను చాటిచెప్పుటకు వేదికగా మలచాలని పిలుపునిచ్చారు. దేశం నలుమూలల నుండి స్వయం సహాయక సంఘాల సభ్యులు, కళాకారులు పెద్ద ఎత్తున పాల్గొంటున్నందున వారి సురక్షిత, భద్రత మన బాధ్యత అన్నారు. ఎట్టి పరిస్థితుల్లోను గుంటూరు గౌరవం, అభిమానం వారు చూరగోనలని పిలుపునిచ్చారు. స్వయం సహాయక సంఘాలు తయారు చేసే పర్యావరణ హిత సామాగ్రిని వినియోగిస్తూ ప్లాస్టిక్ నిషేధిత జోన్‌గా, స్వచ్ఛతకు శ్రీకారం చుట్టే విధంగా తీర్చిదిద్దాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి, తెనాలి సబ్ కలెక్టర్ సంజన సింహా, రెవిన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాస రావు, డి.ఆర్.డి.ఏ ప్రాజెక్టు డైరెక్టర్ టి. విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



# పేదల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

## - నెల్లూరులో రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ

నెల్లూరు, డిసెంబరు 30 ప్రభాతవార్త-వైద్యం: పేదల అభ్యున్నతి కూటమి ప్రభుత్వ ముఖ్య లక్ష్యమని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. నగరంలోని ఐదో డివిజన్లో వైకుంఠురంలో పర్యటించారు. వారం క్రితం ఆ ప్రాంత వాసుల ముంపు సమస్యను తన దృష్టికి తీసుకుని వచ్చారని, ఇచ్చిన మాట ప్రకారం అధికారులతో కలిసి వైకుంఠపురం ఏరియాలో పర్యటించినట్లు చెప్పారు. ఇంటింటికి వెళ్లి గిరిజనుల సమస్యలను తెలుసుకుని వారి సమస్యల పరిష్కారం కోసం అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఇబ్బందులు చెప్పిన వారంలోపే తమ ప్రాంతాన్ని పరిశీలించిన మంత్రికి స్థానిక ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మీడియాతో మాట్లాడారు. గత వారంలో ఇచ్చిన మాట ప్రకారం ఈ రోజు వైకుంఠపురానికి రావడం జరిగిందని, ప్రతి గడపకు వెళ్ళినప్పుడు వారి సమస్యను తెలియజేశారని తెలిపారు. అధికారులకు సమక్షంలోనే సమస్యను పరిష్కరిస్తామని మంత్రి చెప్పారు. వర్షాల్లో ముంపుకు గురయ్యే 22 ఇళ్ళను గుర్తించామని, వాళ్ళ సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. స్లమ్ ఏరియాల అభివృద్ధిపై సీఎం చంద్రబాబు ప్రత్యేక దృష్టి పెట్టారన్నారు. వైజాగ్ లక్ష్మీపురం స్లమ్ ప్రాంతంలో 170 కుటుంబాల కోసం పీపీపీలో 20 అంతస్తుల భవనం నిర్మిస్తున్నామన్నారు. పేదల అభ్యున్నతే మా ప్రభుత్వ లక్ష్యమని మంత్రి నారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో కమీషనర్ నందన్, ఇన్చార్జి మేయర్ రూప్ కుమార్ యాదవ్, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ అనురాధ, మాజీ జడ్పీటీసీ విజేతారెడ్డి, నగర పార్టీ అధ్యక్షుడు మామిడాల మధు, డివిజన్ ప్రెసిడెంట్ గంగాధర్, కోదండ రామాలయ చైర్మన్ సిరి శ్రీనివాస్, కార్పొరేషన్, రెవెన్యూ, ఎలక్ట్రికల్ డిపార్టుమెంట్ అధికారులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాలతో విద్యా వ్యవస్థ అస్తవ్యస్తం: మాజీ మంత్రి ఆదిమూలపు

విజయవాడ, డిసెంబరు 30 ప్రభాతవార్త ప్రతినిధి: కూటమి ప్రభుత్వంలో అనాలోచిత నిర్ణయాలు, ప్రయోగాలతో విద్యా వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైందని మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్ విమర్శించారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. విద్యారంగంలో ఇష్టం వచ్చినట్లు చేస్తున్న మార్పులతో విద్యార్థులు కూడా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రసుత్తం విద్యారంగం పూర్తిగా నిర్వీర్యమైందని, నాడునేడు, సిబిఎస్ఇ, ఐబి, టోఫెల్ మాయం అయ్యాయని అన్నారు. విద్యా పథకాలన్నీ బకాయిలతో కుదేలవుతున్నాయని పేర్కొన్నారు. సర్కారీ బడులను 4.6 లక్షల మంది విద్యార్థులు వీడిపోయారని అన్నారు. విద్యా సంవత్సరం ఆరంభంతోనే విద్యార్థులు రోడ్లపైకి వచ్చారని పేర్కొన్నారు. యాప్‌లు వద్దన్నవారే ఇప్పుడు యాప్‌లు తెస్తున్నారన్నారు. సింగిల్ టీచర్లు, సబ్జెక్టు టీచర్లు లేక స్కూళ్లలో అవస్థలు పడుతున్నారని అన్నారు.

### డిజిపి వాఖ్యలు చట్ట ఉల్లంఘన

పెట్రోలింగ్ వాహనం లేకపోవడంతో రోడ్డుపై నడిపించామని డిజిపి చెప్పడం చట్ట ఉల్లంఘనని వైసిపి లీగల్‌సెల్ వర్కింగు ప్రెసిడెంట్ జల్లా సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఆ వ్యాఖ్యలు చట్టాలను ఉల్లంఘిస్తున్న పోలీసులకు వంతపాడటమేనని అన్నారు. గాడి తప్పిన శాంతిభద్రతలకు ఇదే నిదర్శనమని, ఈ రకమైన పనితీరుతోనే పోలీసు వ్యవస్థ పనితీరు దిగజారిందని విమర్శించారు.

# సీమకు జలసిరులు

## • ధాన్య రాశులు... • గృహప్రవేశాలు.. • యేడాదిలో ఏపి అద్భుత విజయాలు

విజయవాడ, డిసెంబరు 30 ప్రభాతవార్త ప్రతినిధి: ఏపీ ప్రభుత్వం 2025 జలవనరులు, వ్యవసాయం, ఆక్వా రంగాల్లో అద్భుత ఫలితాలను సాధించింది. కీలకంగా ఇరిగేష్ పరంగా మంచి విజయాలను సాధించింది. 100 రోజుల్లోనే హంద్రీనీవా కాలువ విస్తరణ పనులు చేపట్టి రికార్డు సృష్టించింది కూటమి ప్రభుత్వం. చెరువులు, ప్రాజెక్టులు నింపి రాయలసీమకు సాగు, తాగునీటిని ప్రభుత్వం అందించింది. సమర్థ నీటి నిర్వహణతో 6.08 మీటర్లకు భూగర్భ జలాలు పెరిగాయి. ఇక పోలవరం పనుల్లో పురోగతి పరుగులు పెడుతోంది. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ చెల్లింపులను వేగవంతం చేశారు. వేగంగా వెలిగొండ పనులను ప్రారంభించి... 2026లో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అలాగే రికార్డ్ స్థాయిలో ధాన్యాన్ని సేకరించారు. 24 గంటల్లో రైతుల ఖాతాల్లో ధాన్యం సేకరణ డబ్బులను జమ చేసేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఈ ఖరీఫ్ సీజన్లో 34.23 లక్షల మెట్రిక్ న్నుల ధాన్యం సేకరించిన రాష్ట్ర ప్రభుత్వం... 5.48 లక్షల మంది రైతులకు రూ.8,120 కోట్లు జమ చేసింది. ఇక మార్కెట్ ఇంటర్వెన్షన్ ద్వారా పొగాకు, మామిడి, కోకో, ఉల్లి సహా పంటలకు రూ.1,100 కోట్లకు పైగా సాయం అందించింది. ఇలాంటి వివిధ రకాల చర్యల ద్వారా రాష్ట్ర ఆర్థిక అభివృద్ధి డబుల్ డిజిట్ గ్రోత్ చేరుకుంది. 11.28 శాతంగా నమోదు చేసుకుంది. అంతే కాకుండా... రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు పెట్టాల్సిన మూల ధన వ్యయం కూడా పెరిగింది. అలాగే రెవెన్యూ రంగంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు.. రైతుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేసింది. రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. రాజ ముద్రతో పట్టాదారు పాస్ పుస్తకాలు ఇచ్చారు. నాలా చట్టం రద్దు చేశారు. ఇళ్లు లేని పేదలకు గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్లు ఉచితంగా స్థలం, దరఖాస్తుల స్వీకరణ పూర్తి చేసింది. దీంతో పాటు 3 లక్షల ఇళ్లల్లో సామూహిక గృహ ప్రవేశాల కార్యక్రమాన్ని నిర్వహించి... లబ్దిదారులకు ఇళ్ల తాళాలను ఈ ఏడాదే ప్రభుత్వం అందచేసింది. ఇక గేట్స్ ఫౌండేషన్, టాటా సౌజన్యంతో సంజీవని ప్రాజెక్టు కుప్పంలో పైలెట్ గా ఏర్పాటు చేశారు. ఇది భవిష్యత్తులో రాష్ట్ర ప్రజలకు ఈ పథకం సంజీవనిగా మారనుంది. అలాగే డిజి హెల్త్ కేర్, యూనివర్సల్ హెల్త్ పాలసీల వంటి వాటితో వైద్యారోగ్య రంగంలో విప్లవాత్మక సంస్కరణలు తెచ్చింది కూటమి ప్రభుత్వం. విద్యా వ్యవస్థలో పెనుమార్పులను తీసుకొచ్చింది రాష్ట్ర ప్రభుత్వం. మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ నిర్వహించారు. అలాగే డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం, సర్వేపల్లి రాధాకృష్ణ కిట్లను విద్యార్థులకు ఎలాంటి రాజకీయ నేతల బొమ్మలు లేకుండా అందచేశారు. ఇక టీచర్ల బదిలీలను పారదర్శకంగా చేపట్టి... ఆదర్శంగా నిలిచింది విద్యా శాఖ. 1వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు 75 లక్షల విద్యార్థులకు హెల్త్ చెకప్, విద్యార్థుల్లో పరిశుభ్రత, ఆరోగ్యకరమైన అలవాట్లు పెంచేలా ముస్తాబు కార్యక్రమాన్ని చేపట్టింది రాష్ట్ర ప్రభుత్వం.

### ఛార్జీలు తగ్గాయి... నేరాలూ తగ్గాయి....

గత ప్రభుత్వం పీపీఏల రద్దుతో పూర్తిగా విద్యుత్ వ్యవస్థను నాశనం చేసింది. అలాంటి విద్యుత్ వ్యవస్థ ఈ ఏడాది గాడిన పడింది. విద్యుత్ ఛార్జీల పెంచుతూ... ప్రజలపై గత ప్రభుత్వం భారీ ఎత్తున ఆర్థిక భారాన్ని వేసింది. కానీ కూటమి ప్రభుత్వం తొలిసారిగా ట్రూ డౌన్ అమలు చేసింది. దీంతో విద్యుత్ ఛార్జీలు కొంత మేర



తగ్గాయి. ఇదే కాకుండా... విద్యుత్ కొనుగోళ్ల ధరలు తగ్గించేలా రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ రూపొందించింది. ప్రస్తుతం ప్రభుత్వం కొనుగోలు చేసే విద్యుత్ యూనిట్ ధర రూ.5.19 నుంచి రూ.4.80కు తగ్గేలా చర్యలు చేపట్టింది కూటమి ప్రభుత్వం. ఇక క్లీన్ ఎనర్జీ ప్లాంట్ల స్థాపనకు రూ.3 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. 20 లక్షల ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు ఉచితంగా సోలార్ రూఫ్ టాప్- బీసీలకు రూ.20 వేల అదనపు సాయం అందించనుంది ప్రభుత్వం. ఇక వైసీపీ ప్రభుత్వం హయాంలో క్రైమ్ రేట్ గరిష్టంగా ఉండేది. కానీ ఈ ఏడాది కూటమి ప్రభుత్వం తీసుకున్న చర్యలతో క్రైమ్ రేట్ తగ్గింది. నేరాలకు శిక్షలు పడ్డాయి. గంజాయిడ్రగ్స్ అరికట్టేలా ఈగల్ టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేశారు. ఇది చాలా వరకు సక్సెస్ అయింది. ఇక స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్, వాట్సప్ గవర్నెన్స్, డేటా డ్రివెన్ డెసిషన్స్, విపత్తుల నిర్వహణ, పీ4 వంటి వాటి ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఇక భవిష్యత్ అభివృద్ధి ప్రణాళికల్లో భాగంగా విశాఖపట్నం, అమరావతి, తిరుపతి కేంద్రంగా 3 రీజియన్లుగా అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ సిద్ధం చేసింది. కీలకమైన పూర్వోదయ పథకంలో రాష్ట్రానికి చోటు దక్కింది. విశాఖ రైల్వేజోన్ ప్రధాన కార్యాలయం పనులు ప్రారంభమయ్యాయి. ఇక కేంద్రంతో సమన్వయం చేసుకుంటూ దాదాపు 90 కేంద్ర పథకాలు పునరుద్ధరించారు. కేంద్రం, ప్రధాని మోదీ సహకారంతో రాష్ట్రానికి వివిధ పరిశ్రమలు వచ్చాయి. విశాఖ స్టీల్ ప్లాంట్ సెంటిమెంట్ నిలబడింది. రాష్ట్రానికి సెమీ కండక్టర్ పరిశ్రమలు వచ్చాయి. విశాఖ



స్టీల్ ప్లాంట్ కు రూ. 11440 కోట్లతో కేంద్రం ఊతమిచ్చింది. దీంతో లక్ష కోట్ల విలువైన నేషనల్ హైవే ప్రాజెక్టులు, రైల్వే ప్రాజెక్టులు వచ్చాయి. ఇక ఈ ఏడాది చివర్లో కొత్తగా మరో రెండు జిల్లాల ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి ప్రజామోదం లభించింది. దీంతో 26 నుంచి 28కి ఏపీలో జిల్లాల సంఖ్య పెరగనుంది.

### 2026లో ఘనమైన లక్ష్యాలు..

ఇక 2026వ ఏడాదిలో కూడా ఘనమైన లక్ష్యాలను ఏర్పాటు చేసుకుంది కూటమి ప్రభుత్వం. ముఖ్యంగా రెవెన్యూ సమస్యలను వీలైనంత ఎక్కువ స్థాయిలో పరిష్కరించాలని, వివాదాల్లేని భూములను రైతులకు, భూ యజమానులకు అందించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ప్రజలకు మరింతగా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు అందించడంతో పాటు... సంపద సృష్టి, పారిశ్రామికాభివృద్ధి వంటి అంశాలపై దృష్టిపెట్టేలా కూటమి ప్రభుత్వం నూతన ఏడాదివైపు ముందడుగు వేస్తోంది.



# ఎఫ్‌డిసి చైర్మన్‌గా శ్రీనివాసనాయక్

విజయవాడ (గన్నవరం), డిసెంబరు 30 ప్రభాతవార్త: రాష్ట్ర చలనచిత్ర, టెలివిజన్, నాటకరంగ అభివృద్ధిసంస్థ జనరల్ మేనేజర్‌గా పదోన్నతి పొందిన శ్రీనివాసనాయక్ బాధ్యతలు స్వీకరించారు. విజయవాడ ఆర్టీసి బస్టాండ్ ఆవరణలోని ఎఫ్‌డిసి కార్యాలయంలో మంగళవారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. ఉమ్మడి రాష్ట్రంలో ఎఫ్‌డిసిలో స్టెనోగ్రాఫర్‌గా ఉద్యోగజీవితాన్ని ప్రారంభించిన నాయక్ అంచెలంచెలుగా ఎదుగుతూ జనరల్ మేనేజర్‌స్థాయికి చేరుకున్నారు. సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి, ఉన్నతాధికారుల సహకారంతో సంస్థ అభివృద్ధితోపాటు, కళాకారుల సంక్షేమానికి కృషిచేస్తానని ఈ సందర్భంగా నాయక్ హామీ ఇచ్చారు. నాయక్‌కు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

# కాణిపాకంలో నేత్రపర్వంగా ఉత్తరద్వార దర్శనం

## • వైభవంగా వైకుంఠ ఏకాదశి వేడుకలు... పోటెత్తిన భక్తజనం




కాణిపాకం, డిసెంబరు 30 ప్రభాతవార్త: ముక్తిని ప్రసాదించే వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామివారి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీదేవి, భూదేవి పెరియదేవి సయిత శ్రీవరద రాజస్వామి ఆలయంలో మంగళవారం ఉత్తర ద్వార దర్శనం నేత్రపర్వంగా నిర్వహించారు. మంగళవారం ఆలయంలో వైకుంఠ ఏకాదశి వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో శ్రీదేవి, భూదేవి సయిత శ్రీవరదరాజ స్వాముల వారి మూల విరాట్‌లకు వేకువజామున 3 గంటలకు ఆలయ ప్రధాన అర్చకులు పరవస్తు శ్రీనివాస భట్టాచార్యులు ఆధ్వర్యంలో అర్చకులు, వేదపండితుల మంత్రోచ్ఛారణ నడుమ శాస్త్రోక్తంగా పంచామృతాభిషేకాలు, స్నపన తిరుమంజనం, ప్రత్యేక పూజలు నిర్వహించగా... అలంకరించిన శ్రీదేవి, భూదేవి సయిత శ్రీవరదరాజ స్వాముల వారి ఉత్సవమూర్తులను పవిత్రమైన ఉత్తరద్వారం వైపు వుంచి భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించారు. ఉత్తర ద్వారం ద్వారా స్వామివారిని దర్శించుకుని భక్తులు పునీతులయ్యారు. ఇదిలా వుండగా వైకుంఠ ఏకాదశి సందర్భంగా వరద రాజస్వామి వారి ఆలయాని ్న సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఈ సందర్భంగా శ్రీదేవి, భూదేవి సయిత శ్రీవరదరాజ స్వాముల వార్లకు ఆలయ ఛైర్మన్ వి.సురేంద్రబాబు, ఈఓ కె.పెంచల కిషోర్‌లు ఆలయ అధికారులు, అర్చకులు, పాలకమండలి సభ్యులతో కలిసి ప్రధాన ఆలయం నుండి పట్టువస్త్రాలను, పూజా సామాగ్రిని ఉదయం మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా తీసుకువెళ్ళి వరదరాజస్వామి ఆలయంలో ఆలయ అర్చకులకు సమర్పించారు. వీటిని ఆలయ అర్చకులు స్వామి, అమ్మవార్లకు అలంకరించారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా గతంలో ఎన్నడూ లేని విధంగా పెద్దఎత్తున పలువురు ప్రముఖులు కాణిపాకం ఆలయ దర్శనార్థం తరలిరావడం గమనార్హం. అలాగే వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చిన భక్తులతో ఆలయం ఉదయం నుండి రాత్రి వరకు కిక్కిరిసింది. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ ఈఓ పెంచల కిషోర్, ఏఈఓ రవీంద్రబాబు ఆధ్వర్యంలో అధికారులు ఏర్పాట్లు చేపట్టారు. ఈకార్యక్రమంలో ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, సూపరెండెంట్ వాసు, పాలక మండలి సభ్యులు నాగరాజునాయుడు, కత్తి సుధాకర్ రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, చంద్రకళ, కృష్ణవేణి, నరేష్, ఆలయ ప్రధాన అర్చకులు సోమశేఖర్ గురుకుల్, స్థానాచార్యులు పణిస్వామి, ఆలయ ఉభయదారులు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

### ఘనంగా గ్రామోత్సవం


వైకుంఠ ఏకాదశి పండుగ పర్వదినాన్ని పురస్కరించుకుని స్వామి అమ్మవార్లకు మంగళవారం ఉదయం గ్రామోత్సవను అత్యంత ఘనంగా నిర్వహించారు. భక్తులకు ఉదయం ఉత్తర ద్వారా దర్శనం కల్పించిన అనంతరం అలంకరించిన స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ప్రత్యేకపల్లకిపై వుంచి మంగళవాయిద్యాల నడుమ గ్రామ పురవీధుల గుండా ఘనంగా ఊరేగించారు. ఈసందర్భంగా భక్తులు మొక్కులు తీర్చుకున్నారు.

# కాణిపాకంలో విఐపిల రద్దీ

## - గణనాధుని దర్శించుకున్న పలువురు ప్రముఖులు



కాణిపాకం, డిసెంబరు 30 ప్రభాతవార్త: వైకుంఠ ఏకాదశి పండుగ పర్వదినం సందర్భంగా మంగళవారం పలువురు ప్రముఖులు కుటుంబసమేతంగా కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి వారిని వేర్వేరుగా దర్శించుకున్నారు. ఈమేరకు ప్రధాన ఆలయ పునర్నిర్మాణ, బంగారు, వెండి వాకిలి దాతలు ఐకా రవి, గుత్తికొండ శ్రీనివాస్, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మల్లిఖార్జునరావు, కృష్ణాజిల్లా పెడన ఎమ్మెల్యే కాగితపు కృష్ణప్రసాద్, తెలంగాణా శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్, తెలంగాణా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మాదశీదేవి, రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమీషనర్ చావలి సునీల్‌లు కుటుంబసమేతంగా వేర్వేరుగా దరి ్శంచుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ ఈఓ కె.పెంచల కిషోర్, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొన్నారు. అనంతరం శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలలో కూడా పూజలు నిర్వహించారు. వారికి వేదమంపడపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. వారి వెంట ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, సూపరింటెండెంట్‌లు వాసు, కోదండపాణి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు బాలాజినాయుడు, రవి, పాలకమండలి సభ్యులు నరేష్, సుబ్బారెడ్డి, చిత్తూరు కోర్టు సిబ్బంది, ప్రోటోకాల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# గరుడవాహనంపై శ్రీవారు

## ఉత్తర ద్వారంలో నృసింహుని దర్శించుకున్న భక్తులు

రాపూరు (నెల్లూరు), డిసెంబరు 30 ప్రభాతవార్త: ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో ముక్కోటి ఏకాదశి(వైకుంఠ ఏకాదశి)పర్వదినం సందర్భంగా మంగళవారం శ్రీ పెనుశిల లక్ష్మీనృసింహ స్వామి వారు ఉత్తర ద్వారంలో బంగారు గరుడవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఇందులో బాగంగా ఉదయం స్వామి వారి మూలమూర్తికి అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారికి ఏర్పాటు చేసిన ఉత్తర ద్వారం వద్ద ఆలయ అర్చక స్వాములు పూజలు నిర్వహించి, ఉత్తర ద్వారా దర్శనం తలుపులు తీశారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున గోవింద నామాలు పలుకుతూ ఉత్తర ద్వారం గుండా లోనికి వెళ్లి అక్కడ స్వర్ణ గరుడవాహనంపై కోలువుతీరి వున్న శ్రీ పెనుశిల లక్ష్మీనృసింహ స్వామిని దర్శించుకోని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం 8 గంటలకు గోనుపల్లి గ్రామంలో స్వామి వారికి గరుడవాహన క్షేత్రోత్సవం నిర్వహించారు. మద్యాహ్నం కోనలో పెద్ద ఎత్తున వచ్చిన భక్తులకు అన్నదానం నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు కోనలో వేదపండితుల వేద మంత్రోచ్చరణల మద్య, మంగళ వాయిద్యాలు, గిరిజన మేళాలతో కోనలోని మాఢవీదులలో స్వామి వారికి బంగారు గరుడవాహన క్షేత్రోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గోని స్వామివారిని దర్శించుకోని పూజలు నిర్వహించారు. ఆలయ ఉప కమీషనర్ పోరెడ్డి శ్రీనివాసుల రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆలయ సూపరిడెంట్ పాలవల్లి లక్ష్మీనారాయణ, సిబ్బంది నరసింహా, వెంకట సుబ్బయ్య, పెంచల స్వామి, హర్షా, ఆలయ ప్రధానార్చకులు గుండ్లూరు రామయ్య స్వామి, పెంచలయ్య స్వామి, ముఖ్య అర్చకుడు గుండ్లూరు శశి స్వామి, అర్చక స్వాములు మధు స్వామి, వర్ధన్ స్వామి, వెంకట బాలాజీ స్వామి, వినోద్ స్వామి, నాగరాజు స్వామి, సాయి స్వామి తదితరులు వున్నారు.

# శైవక్షేత్రం ద్రాక్షారామంలో అగంతకుల దుశ్చర్య



రామచంద్రపురం, డిసెంబరు 30 ప్రభాతవార్త: పవిత్ర వైకుంఠ ఏకాదశి రోజున హిందువుల మనోభావాలను దెబ్బతీసే విధంగా ద్రాక్షారామంలో శ్రీ మాణిక్యాంబా సమేత శ్రీ భీమేశ్వర స్వామి ఆలయానికి ఉత్తర దిశగా సప్త గోదావరి తీరాన గల కపాలేశ్వర స్వామి లింగాన్ని సోమవారం అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగులు విచ్ఛిన్నం చేసి అదృశ్యమయ్యారు. తెల్లవారుజామున స్వాములు సప్త గోదావరి నదీ స్నానం అనంతరం కపాలేశ్వర స్వామి లింగానికి జలాభిషేకం చేసేందుకు సిద్ధపడగా ఈ దుశ్చర్య బయట పడిందని స్థానికులు చెబుతున్నారు. శివలింగాన్ని ధ్వంసం చేయడాన్ని హైందవ సంఘాల తీవ్రంగా తప్పుపట్టాయి. ఈ ఘటనకు బాధ్యులైన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలంటూ నినాదాలు చేశాయి. శివలింగం విధ్వంసం ఘటన వార్త తెలియగానే పోలీస్, దేవాదాయ, పురావస్తు శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. క్షణాల్లో ఆ ప్రాంతాన్ని కట్టుదిట్టం చేశారు. శివలింగం ధ్వంసమైన ప్రాంతాన్ని అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ రాహుల్ మీనా పరిశీలించారు. పూర్తిస్థాయిలో భద్రత దళాలను ఏర్పాటు చేశారు. పోలీసు ఉన్నతాధికారులు దేవస్థానానికి చేరుకుని లింగ విధ్వంసానికి పాల్పడిన దుండగుల ఆచూకీ కోసం ప్రయత్నాలు మమ్మరం చేశారు. ఘటనకు సంబంధించిన నిందితులను గుర్తించేందుకు ఆరు పోలీస్ బృందాలను ఏర్పాటు చేసినట్లు ఎస్పీ వెల్లడించారు. దీనిలో భాగంగా డాగ్ స్క్వాడ్, క్లూస్ టీములు రంగ ప్రవేశం చేశాయి. అన్ని కోణాల్లో విచారణ చేసి దోషులను త్వరలోనే అరెస్టు చేస్తామని పోలీస్ వర్గాలు వెల్లడించాయి.

# ప్రతి హిందువు గుడికి వెళ్లడం అలవర్చుకోవాలి

## - శ్రీకమలానంద భారతి స్వామీజీ



ఐరాల, డిసెంబరు 30 ప్రభాతవార్త: ప్రతి హిందువు ప్రతి రోజూ గుడికి వెళ్ళడం అలవర్చుకోవాలని గన్నవరం భువనేశ్వరి పీఠం పీఠాధిపతి శ్రీకమలానంద భారతి స్వామీజీ ఉద్బోదించారు. మండల కేంద్రం ఐరాలలో మంగళవారం ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో హిందూ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా విచ్చేసిన కమలానంద భారతి స్వామి మాట్లాడుతూ హిందూ అంటేనే నాగరికత అని తెలిపారు. హిందువులు భిన్నత్వంలో ఏకత్వం ప్రదర్శిస్తారని, హిందూత్వం ప్రకృతితో ముడిపడి వుందన్నారు. చెట్టు, పుట్ట, జంతువులను పూజించే గుణం హిందువుల్లో వుందన్నారు. భూమిపై వున్న సమస్త జీవరాశులు దేవుని ప్రతిరూపాలని స్వామీజీ అన్నారు. ఈకారణంగా హిందువుగా జీవించు, హిందువుగా గర్వించు అని అన్నారు. ప్రతి హిందువు ప్రతి రోజూ గుడికి వెళ్ళడం అలవర్చుకోవాలని సపూచించారు. మన గుడికి వెళ్లడానికి నాయకుల సిపార్స్‌లు ఎందుకని, అక్కడే మన సామర్థ్యం తేటతెల్లమవుతోందన్నారు. తిరుమలకు వెళ్లే భక్తులు ఒక్కరోజులో స్వామివారి దర్శనం చేసుకుని తిరిగి వచ్చేయాలన్న ఆలోచన మానుకుని ఎన్ని రోజులైనా వేచివుండి స్వామివారిని దర్శించుకుని ఇంటికి రావాలన్నారు. అలాగే హిందూత్వం గురించి పిల్లలకు తల్లిదండ్రులు చిన్నతనం నుండి తెలియజేయాల్సిన అవసరం వుందన్నారు. హిందువులపై ఇతర రాష్ట్రాల్లో జరుగుతున్న దాడులు మన రాష్ట్రంలో ప్రారంభం కాకముందే హిందువులందరూ మేల్కొనాలని స్వామీజీ సూచించారు. ఈకార ్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు సీతాపతినాయుడు, విభాగ్ సహకార్యవాహ రెడ్డెప్పలతో పాటు అధిక సంఖ్యలో హిందువులు పాల్గొన్నారు.




# బ్యాంకు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

సచివాలయం, డిసెంబరు 30 ప్రభాతవార్త: దేశంలో 9బ్యాంకు ఉద్యోగుల సంఘాలు వారి డిమాండ్లలో భాగంగా మంగళవారం యూనైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్(యుఎఫ్‌బియు) తరపున దేశవ్యాప్తంగా అన్ని సెంటర్లలోను జిల్లా హెడ్ క్వార్టర్స్‌ల్లో జరిపిన నిరసన ప్రదర్శనలో బ్యాంకు ఉద్యోగులు పెద్దసంఖ్యలో పాల్గొని నిరసన తెలిపారు. ముఖ్యంగా బ్యాంకుల్లో అన్ని విభాగాల్లో రిక్రూట్‌మెంట్, వారానికి 5రోజుల పనిదినాలు, ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో వర్క్‌మెన్, ఆఫీసర్ డైరెక్టర్ల పోస్టుల భర్తీని డిమాండ్ చేస్తుంది. ప్రధానంగా ఎస్‌బిఐ గుంటూరు మెయిన్ బ్రాంచ్ వద్ద జరిగిన ఈ నిరసన ప్రదర్శనలో గుంటూరు మాడ్యూల్ ఎస్‌బిఐ ఆఫీసర్స్ అసోసియేషన్ చీఫ్ రిజీనల్ సెక్రటరీ కె.ఆర్.వి.జయకుమార్, ఎస్‌బిఐ స్టాఫ్ యూనియన్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ కె.కోటిరెడ్డి, ఎజిఎస్ వి.నరేంద్రకుమార్, ఎజిఎస్ పి.ఎస్.రంగసాయి, యుఎఫ్‌బియు అడ్వైయిజర్ పి.కిషోర్, యుఎఫ్‌బియు ప్రెసిడెంట్ ఇ.రవిచంద్రారెడ్డి, యుఎఫ్‌బియు జిల్లా కన్వీనర్ మహ్మద్ సయ్యద్ భాషా, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆఫీసర్స్ సెక్రటరీ ఎమ్.రాంబాబు, పి.కళ్యాణ్, ఎపిటిబిఈఎఫ్ ప్రెసిడెంట్ రామకృష్ణ, బెఫి స్టేట్ ప్రెసిడెంట్ ఎమ్.సాంబశివరావు, మిగిలిన నాయకులతోపాటు వివిధ శాఖల లోకల్ సెక్రటరీలు, బ్యాంకు సిబ్బంది పాల్గొని తమ నిరసన తెలియచేశారు.

# రాజకీయ వేధింపులు మితిమీరిపోతున్నాయి

## - వైసిపి స్టేట్ కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి



విజయవాడ, డిసెంబరు 30 ప్రభాతవార్త ప్రతినిధి: ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయ వేధింపులు మితిమీరి పోతున్నాయని వైసీపీ స్టేట్ కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి తీవ్రంగా విమర్శించారు. పార్టీ లీగల్ సెల్ నేతలతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సజ్జల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ, వైఎస్ జగన్ పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించడాన్ని ఓర్వలేక వైసీపీ కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు. నియంతృత్వ పాలనకు ఇంతకంటే నిదర్శనం ఏముంటుందని ఆయన ప్రశ్నించారు. చంద్రబాబు, లోకేశ్‌లు విచ్చలవిడిగా వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. కూటమి ప్రభుత్వానికి వంత పాడుతున్న పోలీసుల చర్యలను ధీటుగా ఎదుర్కొందామని పిలుపునిచ్చారు. చట్టాన్ని అతిక్రమిస్తున్న పోలీసులపై ప్రైవేట్ కేసులు వేద్దామని ఆయన అన్నారు. రెడ్‌బుక్ రాజ్యాంగంపై పోరాటం చేస్తూ ముందుకెళ్తున్న పార్టీ లీగల్ సెల్‌ను ఆయన అభినందించారు. చంద్రబాబు, బాలకృష్ణ ఫ్లెక్సీలకు పొట్టేళ్ల తలలతో హారం వేసిన ఘటనపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. ఇటీవల ఒకరిపై రాజద్రోహం కేసు పెట్టారని, దీనికంటే దారుణం మరొకటి ఉండదని సజ్జల అన్నారు. హక్కుల కోసం పోరాడినందుకు కమ్యూనిస్ట్ నాయకుడిపై పీడీ యాక్ట్ కేసు పెట్టడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. వైఎస్ జగన్ మరింత పట్టుదలతో పార్టీని నడిపిస్తూ, ప్రతి ప్రజా సమస్యపై ముందుండి పోరాడుతున్నారని చెప్పారు. కూటమి ప్రభుత్వ దమనకాండను తిప్పికొట్టేందుకు వైసీపీ సైన్యం పోరాట పటిమతో ముందుకు సాగుతుందని సజ్జల రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు.



## వరల్డ్ బ్లిడ్జ్ ఛాంపియన్‌షిప్‌లో
# అర్జున్ చేతిలో కార్ల్‌సెన్ చిత్తు

**న్యూఢిల్లీ:** ప్రపంచ బ్లిట్జ్ ఛాంపియన్‌షిప్-2025లో భారత్ గ్రాండ్ మాస్టర్ ఎరిగైసి అర్జున్ చేతిలో రాపిడ్ ఛాంపియన్ మాగ్నస్ కార్ల్‌సెన్ చిత్తుగా ఓటమి చెందాడు. ఖతర్‌లో జరిగిన టోర్నమెంట్‌లో 13 రౌండ్ల తర్వాత దోహాలో మంచి ఫామ్‌ను కొనసాగించాడు. అతను 9వ రౌండ్‌లో ఛాంపియన్ కార్ల్‌సెన్‌ను కూడా మట్టికరిపించగా, ఇప్పుడు 10/13 పాయింట్లతో యుఎస్‌కు చెందిన ఫాబియానో కరువానా మరియు మాక్సిమ్ వాచియర్ లాగ్రేవ్ (ఎఫ్ఆర్ఎ) లతో సమంగా అగ్రస్థానంలో ఉన్నాడు. అర్జున్ అద్భుతంగా ప్రారంభించి మొదటి ఐదు వరుస గేమ్‌లను గెలుచుకున్నాడు. కానీ ఆ తర్వాత అతను రౌండ్ 6లో డచ్ గ్రాండ్ మాస్టర్ జోర్డెన్ వాన్ ఫారెస్ట్ చేతిలో తన తొలి ఓటమిని ఎదుర్కొన్నాడు. అతనికి ఎదురైన ఏకైక ఓటమి ఇదే, అయితే తర్వాత 7 ఆటలలో అర్జున్ అజేయంగా నిలిచాడు. 3 విజయాలు మరియు 4 డ్రాలతో రోజును మరో ఇద్దరు ఆటగాళ్లతో కలిసి అగ్రస్థానంలో ముగించాడు. ఇక మహిళల విభాగంలో టాప్ 30లో ఒక్క భారత్‌కు చెందినవారు కూడా లేరు. మహిళల విభాగంలో మొదటి రోజు మొదటి 10 ఆటల తర్వాత టాప్30లో ఎవరూ లేకపోవడంతో భారత్ చాలా పేలవంగా ఆడింది. రాపిడ్ విభాగంలో మూడు టాప్5 ఫినిషింగ్‌లను సాధించిన తర్వాత, భారత ఆటగాళ్ళు మొదటి రోజు బ్లిట్జ్ ప్రదర్శనతో నిరాశ చెందారు. ప్రస్తుతం మహిళల విభాగంలో అత్యుత్తమ ర్యాంక్‌లో ఉన్న భారత క్రీడాకారిణిల్లో దివ్య దేశ్‌ముఖ్ (34వ స్థానం), రక్షిత రవి (41), రాపిడ్ పతక విజేత కోనేరు హంపి 5 పాయింట్లు మాత్రమే గెలుచుకోని 61వ స్థానంలో ఉన్నారు.



## మహిళల షూటింగ్‌లో..
# నీరూ, ఆర్యవంశికి స్వర్ణాలు

**న్యూఢిల్లీ:** జాతీయ షూటింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలలో (షాట్‌గన్) ఆసియా ఛాంపియన్‌షిప్ బంగారు పతక విజేత నీరు దండ అద్భుతమైన ప్రదర్శన ఇచ్చి మహిళల ట్రాప్ బంగారు పతకం సాధించింది. ఫైనల్లో నీరూ 41 హిట్స్ తో అగ్రస్థానంలో నిలిచింది. ఢిల్లీకి చెందిన కీర్తి గుప్తా 40 హిట్స్‌తో రజతం, ప్రగతి దూబే 32 హిట్స్‌తో కాంస్యన్ని గెలుచుకుంది. జూనియర్ పురుషుల ట్రాప్ ఫైనల్‌లో ఆర్యవంశ్ త్యాగి 42 పాయింట్లు సాధించి స్వర్ణాన్ని, పంజాబ్‌కు చెందిన కేశవ్ చౌహాన్ 37 పాయింట్లతో రజతం, ఉత్తరప్రదేశ్‌కు చెందిన జుహైర్ ఖాన్ 30 పాయింట్లతో కాంస్యం సాధించాడు. టీమ్ ఈవెంట్లలో, మహిళల ట్రాప్ టీమ్ ఈవెంట్‌లో మధ్యప్రదేశ్ ఆధిపత్యం చెలాయించింది. ప్రగతి దుబే, నీరు దండా మరియు మనీషా కీర్ మొత్తం 339 పాయింట్లతో స్వర్ణం గెలుచుకుంది. అద్యా కత్యాల్, కీర్తి గుప్తా, భవ్య త్రిపాఠి 333 పాయింట్లతో ఢిల్లీ రజత పతకాన్ని గెలుచుకోగా, పంజాబ్ 319 పాయింట్లతో (రాజేశ్వరి కుమారి, పుఖ్రాజ్ కౌర్ చాహల్, క్రిషికా జోషి) కాంస్య పతకాన్ని గెలుచుకుంది.అలాగే అర్జున్, లక్ష్య అత్రీ, ప్రిక్షిత్ ఆర్య సౌజన్యంతో 336 స్కోరుతో జూనియర్ పురుషుల ట్రాప్ టీమ్ స్వర్ణాన్ని హర్యానా కైవసం చేసుకుంది. గుజరాత్ 327 (ఆర్యన్ సింగ్, భఖ్త్యార్ ఉద్దీన్ మహ్మద్ముజాహిద్, మానవరాజ్‌సింగ్ రాజేంద్రసింగ్ చుడాసమా) రజతంతో రెండో స్థానంలో, ఉదవ్ సింగ్ రాథోడ్, పృథ్వీరాజ్ సింగ్ రాథోడ్, వినయ్ ప్రతాప్ సింగ్ సి ద్వారా రాజస్థాన్ 326తో కాంస్యం సాధించింది. జూనియర్ మహిళల ట్రాప్ టీమ్ ఈవెంట్‌లో ఢిల్లీ స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది, ఆద్య కత్యాల్, భవ్య త్రిపాఠి మరియు అనన్య యదువంశి కలిసి 323 పాయింట్లతో విజయం సాధించారు. తమిళనాడు 295 పాయింట్లతో రెండవ స్థానంలో నిలవగా, రాజస్థాన్ 274 పాయింట్లతో కాంస్య పతకాన్ని సాధించింది.

## 2025 అన్ని ఫార్మాట్‌లలో..
# దుమ్మురేపిన హీరోస్
### టాప్ 5లో భారత్ యశస్వికి చోటు

**న్యూఢిల్లీ:** ప్రేక్షకులకు అత్యంత వినోదం అందిస్తున్న క్రికెట్‌లో వన్డే, టీ20, టెస్టు ఫార్మాట్లు మూడు ఉన్నాయి. ఈ మూడు ఫార్మాట్‌లలోనూ సత్తా చాటే ఆటగాళ్లు తగ్గిపోతున్నారు.ఈ ఏడాది 2025లో మరో 48 గంటల్లో ముగియనున్ననేపథ్యంలో అన్నీ ఫార్మాట్‌లలో సత్తాచాటిన ఆటగాళ్ల గూర్చి తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. మూడు ఫార్మాట్‌లలో సత్తా చాటేవారిలో ఐదుగురు క్రికెటర్లు ముందంజలో ఉన్నారు. టెస్టు, వన్డే, టీ20 ఫార్మాట్‌కు సరిపోయే ఆటగాళ్లలో మన భారత్ నుంచి యశస్వి జైస్వాల్ చోటు దక్కించుకోగా, మార్కో యాన్సెన్, జేకబ్ డఫీ, కామెరాన్ గ్రీన్, హ్యారీ బ్రూక్ ఉన్నారు. భారత యువ కెరటం యశస్వి జైస్వాల్ అద్భుత ప్రదర్శనతో దూసుకెళ్తున్నాడు. రెండున్నరేళ్ల



కిందట భారత జట్టులోకి ఎంట్రీ ఇచ్చిన ముంబై పోరడు యశస్వి జైస్వాల్ ఫార్మాట్‌తో సంబంధం లేకుండా అదరగొడుతున్నాడు. టెస్టుల్లో సెంచరీలు, డబుల్ సెంచరీతో ఈ లెఫ్టాండర్ బ్యాటర్ ఓపెనర్‌గా రాణిస్తుండగా, వన్డే, టీ20లలో కూడా ఆడగల సత్తా ఉన్నాడు. 23 ఏళ్ల యశస్వి 28 టెస్టుల్లో ఏడు శతకాలు, రెండు డబుల్ సెంచరీలు బాదగా, 4 వన్డేల్లో 171, 23 టీ20 మ్యాచ్‌లు ఆడాడు. ఇంగ్లండ్ ఆటగాడు హ్యారీ బ్రూక్ వచ్చి జట్టుకు ఊపిరిలూదాడు. టెస్టు, వన్డే, టీ20లలో రాణిస్తున్న బ్రూక్ ఇంగ్లండ్ జట్టుకు మిడిలార్డర్ సమస్యను తీర్చాడు. 26 ఏళ్లకే బ్రూక్ ఆ దేశ జట్టుకు వన్డే, టీ20 జట్లకు కెప్టెన్ అయ్యాడు. ఇప్పటివరకు 34 టెస్టులు, 35 వన్డేలు, 52 టీ20లు ఆడిన బ్రూక్ అన్నీ ఫార్మాట్లలో అదరగొడుతున్నాడు. సౌతాఫ్రికా పేస్ బౌలింగ్ ఆల్‌రౌండర్ మార్కో యాన్సెన్ ఆల్ ఫార్మాట్ స్టార్‌గా మారాడు. అత్యంత పొడవైన ఈ క్రికెటర్ మూడు ఫార్మాట్లలో దుమ్మురేపుతున్నాడు. ఐపీఎల్‌లో అత్యధిక వేలానికి అమ్ముడుపోయిన ఆస్ట్రేలియా యువ ఆల్‌రౌండర్ కామెరాన్ గ్రీన్ అద్భుతంగా ఆడుతున్నాడు. 26 ఏళ్ల ఆల్‌రౌండర్ గ్రీన్ ఐపీఎల్‌లో రూ.25.20 కోట్ల వేలం పలికిన విషయం తెలిసిందే. 36 టెస్టులు, 31 వన్డేలు, 21 టీ20లు గ్రీన్ ఆడాడు. న్యూజిలాండ్‌కు చెందిన 31 ఏళ్ల జేకబ్ డఫీ అన్నీ ఫార్మాట్‌లలో సత్తా చాటుతున్నాడు. కుడిచేతి వాటం బౌలర్ ఇప్పటికీ 4 మ్యాచ్‌లు ఆడి 25 వికెట్లు తీయగా, 19 వన్డేలు, 38 టీ20 మ్యాచ్‌లు ఆకట్టుకున్నాడు.




## మహిళల టి20 ఆల్ రౌండర్ ర్యాంకింగ్స్‌లో
# వరల్డ్ నం.1 దీప్తి


**న్యూఢిల్లీ:** ఐసీసీ మహిళల టి20 ప్రపంచ ర్యాంకింగ్స్‌లో దీప్తి నంబర్ 1 స్థానంలో కొనసాగుతోంది. ఇటీవలే వన్డే వరల్డ్ కప్ ఫైనల్లో 87 పరుగులతో పాటు రెండు వికెట్లు తీసి భారత్‌కు కప్ అందించడంలో కీలక పాత్ర పోషించిన ఓపెనర్ షఫాలీ టీ20 ఫార్మాట్‌లోనూ అదే జోరు కొనసాగిస్తోంది. తాజాగా అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) మంగళవారం విడుదల చేసిన ర్యాంకింగ్స్‌లో భారత క్రికెటర్లు సత్తా చాటారు. ముఖ్యంగా శ్రీలంకతో జరుగుతున్న సిరీస్‌లో అద్భుత ప్రదర్శన కనబరుస్తున్న భారత క్రీడాకారిణుల ర్యాంకులు గణనీయంగా మెరుగుపడ్డాయి. బౌలింగ్ విభాగంలో టీమిండియా స్టార్ ఆల్ రౌండర్ దీప్తి శర్మ తన అగ్రస్థానాన్ని పదిలం చేసుకుంది. శ్రీలంక సిరీస్‌లో ఇప్పటికే మూడు అర్ధసెంచరీలు సాధించిన షఫాలీ, తాజా బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో నాలుగు స్థానాలు ఎగబాకి 6వ ర్యాంకుకు చేరుకుంది. ప్రస్తుతం ఆమె నెంబర్ వన్ ర్యాంకులో ఉన్న బెత్ మూనీకి కేవలం 60 పాయింట్ల దూరంలో ఉంది. అలాగే వికెట్ కీపర్ బ్యాటర్ రిచా ఘోష్ కూడా ఏడు స్థానాలు మెరుగుపరచుకుని 20వ స్థానంలో నిలిచింది. బౌలింగ్ విభాగంలో పేసర్ రేణుకా సింగ్ ఎనిమిది స్థానాలు ఎగబాకి టాప్6లో చోటు దక్కించుకుంది. మూడో టీ20లో నాలుగు వికెట్లు తీసి ఆమె ఈ ఘనత సాధించింది. ఇక యువ బౌలర్లు శ్రీ చరణి 52వ స్థానానికి చేరుకోగా, అరంగేట్రం సిరీస్‌తోనే వైష్ణవి శర్మ ఏకంగా 390 స్థానాలు దాటి 124వ ర్యాంకుకు చేరుకోవడం విశేషం. వెస్టిండీస్ కెప్టెన్ హేలీ మాథ్యూస్ ఆల్ రౌండర్ల విభాగంలో అగ్రస్థానంలో కొనసాగుతోంది. ప్రస్తుతం భారత్ శ్రీలంకపై 5 మ్యాచ్‌ల సిరీస్‌లో 40 ఆధిక్యంలో ఉంది.



## సౌతాఫ్రికా టి-20 లీగ్‌లో..
# సన్‌రైజర్స్ రెండో హ్యాట్రిక్
### క్యాపిటల్స్ 48 రన్స్‌తో ఓటమి

**న్యూఢిల్లీ:** సౌతాఫ్రికా టీ20 లీగ్ 2025-26లో సన్‌రైజర్స్ హైదరాబాద్ అనుబంధ సంస్థ సన్‌రైజర్స్ ఈస్టర్న్ కేప్ వరుసగా రెండో విజయాన్ని నమోదు చేసింది. ఈ లీగ్‌లో భాగంగా ప్రిటోరియా క్యాపిటల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 48 పరుగుల తేడాతో సన్‌రైజర్స్ గెలుపొందింది. ఈ విజయంతో సన్‌రైజర్స్‌కు అదనంగా ఒక బోనస్ పాయింట్ కూడా లభించింది. ఇక ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన సన్‌రైజర్స్ ఈస్టర్నన కేప్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లు నష్టానికి 188 పరుగులు చేసింది. స్టార్ ఓపెనర్ క్వింటన్ డికాక్ మరోసారి చెలరేగాడు. 47 బంతులు ఎదుర్కొన్న డికాక్ 5 ఫోర్లు, 6 సిక్సర్లతో 77 పరుగులు చేశాడు. అతడితో పాటు, మాథ్యూ బ్రీట్జ్కే (33 బంతుల్లో 52 పరుగులు), జోర్డాన్ హెర్మాన్ (20 బంతుల్లో 37) మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. ప్రిటోరియా క్యాపిటల్స్ బౌలర్లలో టైమల్ మిల్స్ రెండు వికెట్లు పడగొట్టగా, లుంగి ఎంగిడీ, లుబ్బే తలా వికెట్ సాధించారు. అనంతరం 189 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ప్రిటోరియా క్యాపిటల్స్ 18 ఓవర్లలో 140 పరుగులకే కుప్పకూలింది. సన్‌రైజర్స్ స్పీడ్ స్టార్ ఆడమ్ మిల్నే 4 వికెట్లు పడగొట్టగా, రత్నాయకే రెండు, మార్కో జాన్సెన్, ముత్తుసామి తలా వికెట్ సాధించారు. ప్రిటోరియా ఇన్నింగ్స్‌లో షాయ్ హోప్ (36) టాప్ స్కోరర్‌గా నిలవగా, స్మిడ్ (35), రూథర్ ఫర్డ్ (25) ఫర్వాలేదనిపించారు. కాగా ప్రిటోరియా క్యాపిటల్స్ హెడ్ కోచ్‌గా భారత్ మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ వ్యవహరిస్తున్నాడు.

# ముక్కోటి రోజున సెన్సెక్స్, నిఫ్టీలు వెనక్కి
### స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్‌లదీ అదే దారి




**ముంబయి, డిసెంబరు 30:** ఈక్విటీ మార్కెట్లలో సెన్సెక్స్,నిఫ్టీలు దిగువ స్థాయిలోనే ట్రేడింగ్ ముగించాయి. విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు అమ్మకాలకు మొగ్గుచూపించడంతో షేర్లపై ఒత్తిడిపెరిగింది. దీనితో మార్కెట్లు దిగువ స్థాయికే దిగజారాయి. దీనికితోడు దేశీయంగా కూడా సంవత్సరాంతపు హాలిడే మూడ్ కనిపించింది. ఇన్వెస్టర్లు కార్పొరేట్ ఫలితాల సీజన్ వస్తుండటంతో కొంత ఆచితూచి పెట్టుబడులు పెట్టారు. నిఫ్టీ 25,950 మార్కు దిగువన ముగిసింది. బిఎస్ఇ సెన్సెక్స్ 20.46 పాయింట్లు క్షీణించి 84,675.08 పాయింట్లవద్దట్రేడింగ్ ముగిస్తే నిఫ్టీ 50 సూచీ 3.25 పాయింట్లు క్షీణించి 25,938.85 పాయింట్లవద్దట్రేడింగ్ నిలిపివేసింది. బిఎస్ఇలో మిడ్‌క్యాప్‌సూచీ 0.05శాతం, స్మాల్‌క్యాప్‌సూచీ 0.20శాతం క్షీణించాయి. మార్కెట్లపరంగా ప్రతికూలంగానే కనిపించింది. బిఎస్ఇలో 1936 కంపెనీలు పెరిగితే 2252 కంపెనీలు క్షీణించాయి. మొత్తంగా 171 కంపెనీలు షేర్లు మాత్రం స్థిరంగానే కనిపించాయి. కొత్త లిస్టింగ్‌లలో గుజరాత్ కిడ్నీసూపర్‌స్పెషాలిటీ ప్రస్తుతం 9.37శాతం డిస్కౌంట్‌కు 103.35 వద్ద కొనుగోళ్లుజరిగాయి. ఇక నిఫ్టీలో మెటల్‌సూచీ ఒక్కసారిగా జంప్‌చేసింది. 203శాతంపెరిగింది హిందూస్థాన్ కాపర్9.42, జిందాల్ స్టెయిన్‌లెస్ 6.52శాతం, నేషనల్ అల్యూమినియం కంపెనీ 5.18శాతం, స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా 5.15శాతం, ఎన్ఎండిసి 3.22శాతం, జిందాల్ స్టీల్ 3.14శాతం,హిందాల్కో ఇండస్ట్రీస్ 2.22 శాతం,వేదాంత 2.11శాతం, టాటాస్టీల్ 2.04శాతం, జెఎస్‌డబ్ల్యుస్టీల్ 1.75శాతంచొప్పున పెరిగాయి. ఓరియంట్ టెక్నాలజీస్ 20శాతం ఎగువ సర్క్యూట్‌కు వెళ్లింది. బిల్ 0.04శాతం పెరిగింది. కంపెనీ 569 కోట్ల అదనపు ఆర్డర్లు రాబట్టింది. ప్రైమ్ ఫోకస్ 2.07శాతం పెరిగింది. ఎన్టీపీసీ గ్రీన్ ఎనర్జీ 1.39 శాతం క్షీణించింది. గుజరాత్ నర్మదా వ్యాలీ ఫర్టిలైజర్స్ 1.82శాతం వారీ ఎనర్జీస్ 0.12శాతం క్షీణించాయి. లెమన్‌ట్రీ హోటల్స్ 0.87 శాతం పెరిగింది. నీరజ్ సిమెంట్ స్ట్రక్చర్స్ 1.22శాతం పెరిగి 34.86 వద్ద ట్రేడ్ అయింది.ఫార్మాలో 0.07 శాతంతో లూపిన్‌షేర్లు ట్రేడ్ అయ్యాయి. యూరోపియన్ మార్కెట్లు లాభాల్లోనే ముగిస్తే ఆసియా మార్కెట్లు మిశ్రమంగా కనిపించాయి.వాల్‌స్ట్రీట్ మొత్తం కృత్రిమ మేధ భయాలతోనే ఊగిసలాడింది. రాత్రికి రాత్రే అమెరికాలో స్టాక్స్ క్షీణించాయి. ప్రత్యేకించి టెక్నాలజీరంగంలో భారీ పతనం చవిచూసాయి. ఎస్అండ్‌పి 500 0.35శాతం, నాస్‌డాక్ కాంపోజిట్ 0.50 శాతం, డౌజోన్స్ పారిశ్రామిక సగటు 249.04 పాయింట్లు చొప్పున క్షీణించాయి. ఇదిలా ఉంటే ఒక్కసారిగాపెరిగిన వెండి ఆరుశాతం క్షీణించింది. ఔన్స్ 80 డాలర్లకు పెరిగిన తర్వాత అనూహ్యంగా దిగి వచ్చింది.

# కృత్రిమ మేధ మిషన్‌కు రూ.10,300 కోట్లు




**న్యూఢిల్లీ,డిసెంబరు 30:**భారత్ కృత్రిమ మేధ మిషన్‌కు కేంద్రం రూ.10,300కోట్లు కేటా యించింది. ఐదేళ్లపాటు ఈనిధులు ఎఐని మరింత వృద్ధిలోకి తీసుకువచ్చేందుకు వినియో గిస్తుంది. భారత్ రానురాను కృత్రిమమేధ వినియోగం, అమలులో గ్లోబల్ లీడర్‌గా మారుతున్నది. ఇందుకోసమే కేంద్రం ఇండియా ఎఐ మిషన్ ఏర్పాటుచేసింది. 38వేలకుపైగా గ్రాఫిక్స్ ప్రాసెసింగ్ యూనిట్లు పర్యవేక్షిస్తున్న మిషన్ స్టార్టప్‌లు, పరిశోధకులకు అందుబాటులో కంప్యూటింగ్ వనరులు అందించడమే లక్ష్యంగా పనిచేస్తోంది. భారత్‌లో కృత్రిమ మేధ, భారత్‌కోసం కృత్రిమ మేధగా రూపాంతరం చేయాలన్నదే లక్ష్యమని ఎలక్ట్రానిక్స్, ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ పరిధిలోని ఇండియా ఎఐ డివిజన్ ప్రకటించింది. అత్యున్నతస్థాయి ఎఐ కంప్యూటింగ్ మౌలికవనరులు ఏర్పాటు చేయడంతోపాటు జిపియుల పర్యవేక్షణ, పరిశోధకులు, స్టార్టప్‌లకు రాయితీతో కూడిన ధరలతో అందుబాటులోకి తీసుకురావడం లక్ష్యం. ఇక ఇండియా ఎఐ ఇన్నొవేషన్ కేంద్రం స్వదేశీ ఎఐ మోడళ్లను కీలకరంగాలయిన హెల్త్‌కేర్, వ్యవసాయ రంగాల్లో అమలుచేస్తోంది. డేటాసెట్స్ ప్లాట్‌ఫామ్ ఎఐ ఖోష్ పరిధిలో ఎఐ మోడళ్లలోశిక్షణకు ఉన్నత ప్రమాణాలను అనుసరిం చడం, సామాజిక ఆర్థిక సవాళ్లను అధిగమిం చేందుకుగాను కొత్తకొత్త ఎఐ పరిష్కారాలు అన్వే షించడం ప్రభుత్వ మంత్రిత్వశాఖలకు అవసరమైన రీతిలో ఎఐని అందుబాటులోకి తీసుకు రావడం ప్రధాన బాధ్యతలుగా ఇండియా ఎఐ మిషన్‌చూస్తోంది. ఇక విద్యాబోధనలో కూడా ఎఐని తప్పనిసరి చేసేవిధంగా ఇండియా ఎఐ భవిష్యత్తు నైపుణ్య సామర్థ్యం పెంచుతోంది. అలాగే డీప్‌టెక్ ఎఐ స్టార్టప్‌లకు ఆర్థిక సాయం అందించడం కూడా చేస్తుంది. పూర్తి రక్షణా త్మకంగాను, భద్రతాపూర్వకమైన కృత్రిమమేథ టెక్నాలజీని అందించే లక్ష్యంతోనే కేంద్రం ఈ నిధులను కేటాయించినట్లు ఎంఇఐటివై చెపుతోంది.

# బ్యాంకింగ్ రంగంలో తగ్గుతున్న ఏటీఎంలు



**ముంబయి, డిసెంబరు 30:** దేశంలో డిజిటల్ చెల్లింపుల వినియోగం భారీగా పెరగడంతో ఏటీఎంల వాడకం క్రమంగా తగ్గుతోంది. 2025 ఆర్థిక సంవత్సరంలో దేశవ్యాప్తంగా ఏటీఎంల సంఖ్య భారీగా తగ్గిందని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తాజాగా విడుదల చేసిన ట్రెండ్ అండ్ ప్రోగ్రెస్ ఆఫ్ బ్యాంకింగ్ నివేదికలో వెల్లడించింది. నిర్వహణ ఖర్చులు పెరగడం, ఆన్‌లైన్ లావాదేవీలకు ప్రజలు మొగ్గుచూపుతుండటంతో బ్యాంకులు ఏటీఎంల సంఖ్యను తగ్గించుకుంటున్నాయి. ఆర్‌బీఐ నివేదిక ప్రకారం 2024 మార్చి నాటికి 2,53,417గా ఉన్న ఏటీఎంల సంఖ్య 2025 మార్చి 31 నాటికి 2,51,057కు పడిపోయింది. ముఖ్యంగా ప్రైవేట్ రంగ బ్యాంకులు తమ ఏటీఎం నెట్‌వర్క్‌ను భారీగా కుదించుకున్నాయి. గత ఏడాది 79,884గా ఉన్న ప్రైవేట్ బ్యాంక్ ఏటీఎంలు, ఈ ఏడాది 77,117కు తగ్గాయి. ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో కూడా ఈ సంఖ్య 1,34,694 నుంచి 1,33,544కు స్వల్పంగా తగ్గింది. ఆఫ్ సైట్ ఏటీఎంల మూసివేత ఇందుకు ప్రధాన కారణమని తెలుస్తోంది. బ్యాంకేతర సంస్థలు నిర్వహించే వైట్ లేబుల్ ఏటీఎంల సంఖ్య మాత్రం 34,602 నుంచి 36,216కు పెరగడం విశేషం. ప్రభుత్వ బ్యాంకులు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సమానంగా సేవలు అందిస్తుండగా, ప్రైవేట్ బ్యాంకులు మాత్రం ఎక్కువగా మెట్రో నగరాలకే పరిమితమయ్యాయి. మరో ఆసక్తికరమైన విషయం ఏంటంటే ఏటీఎంలు తగ్గుతున్నప్పటికీ, బ్యాంక్ బ్రాంచుల సంఖ్య మాత్రం పెరుగుతూనే ఉంది. 2025 మార్చి నాటికి దేశంలో బ్యాంక్ శాఖల సంఖ్య 2.8 శాతం పెరిగి 1.64 లక్షలకు చేరింది. కొత్త బ్రాంచుల ఏర్పాటులో ప్రైవేట్ బ్యాంకుల కంటే ప్రభుత్వ రంగ బ్యాంకులే దూకుడుగా ఉన్నాయని ఆర్బీఐ నివేదిక స్పష్టం చేసింది.

# జిడిపిని దాటేసిన భారతీయ కుటుంబాల్లోని పసిడి నిల్వలు
### జిడిపి 4.1లక్షలకోట్ల డాలర్లు ఉంటే, బంగారం నిల్వల విలువ ఐదు లక్షలకోట్ల డాలర్లు



**న్యూఢిల్లీ,డిసెంబరు 30:** భారతీయుల కుటుంబాల్లో ఉన్న బంగారం దేశ ప్రస్తుత జిడిపి విలువలకు మించి ఉంటుందని నిపుణులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్లో బంగారం ధరలు రికార్డు స్థాయిలో పెరగడంతో భారతీయ కుటుంబాల వద్ద ఉన్న బంగారం మొత్తం విలువ మన స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) పరిమాణాన్ని మించిపోయింది. అంత ర్జాతీయంగా స్పాట్ మార్కెట్లో బంగారం ధర ఔన్సుకు 4,500 డాలర్లు దాటడంతో ఈ పరిస్థితి నెలకొంది. మోర్గాన్ స్టాన్లీ అంచనాల ప్రకారం భారతీయ ఇళ్లలో దాదాపు 34,600 టన్నుల బంగారం నిల్వ ఉంది. మార్కెట్ ధరల ప్రకారం లెక్కిస్తే భారతీయుల వద్ద ఉన్న ఈ బంగారం విలువ 5 లక్షల కోట్ల డాలర్ల కంటే ఎక్కువ. అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) అంచనాల ప్రకారం భారత జీడీపీ సుమారు 4.1 లక్షల కోట్ల డాలర్లుగా ఉంది. అంటే దేశం మొత్తం ఉత్పత్తి చేసే ఆదాయం కంటే ప్రజల ఇళ్లలో ఉన్న పసిడి విలువే ఎక్కువగా ఉండటం గమనార్హం. ఈ అంశంపై ఇన్ఫోమెరిక్స్ వాల్యుయేషన్ అండ్ రేటింగ్స్ చీఫ్ ఎకనామిస్ట్ డాక్టర్ మనోరంజన్ శర్మ మాట్లాడుతూ జీడీపీ అనేది ఒక ప్రవాహం లాంటిది, బంగారం అనేది నిల్వ ఉండే ఆస్తి. ఈ రెండింటిని నేరుగా పోల్చలేం. కానీ, భారత ఆర్థిక వ్యవస్థలో బంగారానికి ఉన్న సామాజిక, ఆర్థిక, మానసిక ప్రాధాన్యతను ఈ గణాంకాలు స్పష్టంగా చూపిస్తున్నాయన్నారు. బంగారం విలువ పెరగడం వల్ల గృహాల బ్యాలెన్స్ షీట్లు బలపడతాయని మోర్గాన్ స్టాన్లీ వంటి సంస్థలు చెబుతున్నప్పటికీ, భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. ఎమ్కే గ్లోబల్ విశ్లేషణ ప్రకారం ఇళ్లలో ఉండే బంగారంలో దాదాపు 75 నుంచి 80 శాతం ఆభరణాల రూపంలోనే ఉంటుంది. భారతీయులు దీన్ని పొదుపుగా భావిస్తారు తప్ప, విక్రయించి సొమ్ము చేసుకునే ఆస్తిగా చూడరు. అందుకే ధరలు పెరిగినా వినియోగంపై పెద్దగా ప్రభావం ఉండదని నిపుణులు అంటున్నారు. కేవలం ప్రజలే కాదు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) కూడా తన బంగారం నిల్వలను పెంచుకుంటోంది. 2024 నుంచి ఇప్పటివరకు ఆర్బీఐ సుమారు 75 టన్నుల బంగారాన్ని కొనుగోలు చేయడంతో మొత్తం నిల్వలు 880 టన్నులకు చేరాయి. యుద్ధాలు, ఆర్థిక అనిశ్చితి సమయాల్లో బంగారం సురక్షితమైన పెట్టుబడి కావడంతో కేంద్ర బ్యాంకులు కూడా దీని వైపు మొగ్గు చూపుతున్నాయి. అయితే ఆర్థిక పరంగా చూస్తే బంగారం ఒక ఉత్పాదకత లేని ఆస్తి అని, ప్రజలు ఈటీఎఫ్ వంటి బాండ్ల వైపు మళ్లాలని నిపుణులు సూచిస్తున్నా, భౌతిక బంగారంపై మోజు మాత్రం తగ్గడం లేదు.

# రూ.32వేల కోట్ల బాండ్ల విక్రయానికి కేంద్రం సిద్ధం

**ముంబయి,డిసెంబరు 30:**దేశీయ మార్కెట్ నుంచి నిధులు సమీకరించేందుకు రూ.32,000కోట్ల విలువైన ప్రభుత్వసెక్యూరిటీలను విక్రయించనున్నట్లు కేంద్రంప్రకటించింది. 6.48శాతం ప్రభుత్వ సెక్యూరిటీ 2035 రీఇష్యూ కింద ఈ విక్రయాలు జరుగుతాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ముంబై కార్యాలయం ఆధ్వర్యంలో జనవరి2న ఈ వేలంజరగనుంది.మల్టిపుల్ ప్రైస్ విధానంలో ఈ వేలాన్ని నిర్వహిస్తారు. ఈ సెక్యూరిటీపై మరో రూ.2,000కోట్ల వరకు అదనపు సబ్‌స్క్రిప్షన్‌ను నిలుపుకునే వెసులు బాటు ప్రభుత్వానికి ఉంటుందని కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ స్పష్టంచేసింది. ఈ వేలంలో పాల్గొనేవారు ఆర్బీఐ కోర్ బ్యాంకింగ్ సొల్యూషన్ (ఈకుబేర్) ప్లాట్‌ఫామ్ ద్వారా ఎలక్ట్రానిక్ రూపంలో బిడ్లను దాఖలు చేయాలి. నాన్‌కాంపిటీటివ్ బిడ్లను ఉదయం 10:30నుంచి 11:00 గంటల మధ్య, కాంపిటీటివ్ బిడ్లను ఉదయం 10:30నుంచి 11:30గంటల మధ్య సమర్పించాల్సి ఉంటుంది. అర్హులైన వ్యక్తులు, సంస్థల కోసం మొత్తం నోటిఫైడ్ మొత్తంలో 5శాతం నాన్‌కాంపిటీటివ్ బిడ్డింగ్‌కింద కేటాయించారు. సాధారణంగా ప్రభుత్వాలు తమ బడ్జెట్‌లోటును భర్తీ చేసుకోవడానికి, మౌలిక సదుపాయాలు, సంక్షేమపథకాల వంటి ప్రజా ఖర్చులకునిధులు సమీకరించడానికే ఇలా బాండ్లను విక్రయిస్తాయి. వేలం ఫలితాలను జనవరి 2న ప్రకటిస్తారు. విజయవంతమైన బిడ్డర్లు జనవరి5న చెల్లింపులు చేయాల్సి ఉంటుంది. ప్రభుత్వ హామీ ఉండటం తో ఈబాండ్లను సురక్షితమైన, తక్కువ రిస్క్ ఉన్నగా పరిగణిస్తారు.




# ప్యూరిఫయర్లపై ఇక 5% మాత్రమే జిఎస్టీ

**న్యూఢిల్లీ, డిసెంబరు 30:** జిఎస్టీ మండలి సమావేశంలో ఈసారి వస్తుసేవల పన్ను మరోసారి సవరణలు తెస్తోంది. వాటర్ ప్యూరిఫయర్లు, ఎయిర్ ప్యూరిఫయర్లపై ఉన్న జిఎస్టీ 18శాతాన్ని ఐదుశాతానికి తీసుకువచ్చేందుకు నిర్ణయించిందని సమాచారం. దేశరాజధాని ఢిల్లీలోనుపరిసర రాష్ట్రాల్లోనే కాకుండా పర్యావరణ కాలుష్యం, జలకాలుష్యం ఎక్కువ కనిపిస్తుండటంతో జిఎస్టీని ప్రస్తుతం ఉన్న 18శాతం నుంచి ఐదుశాతానికి తగ్గించాలని నిర్ణయించింది. ఇప్పటికే ఢిల్లీహైకోర్టు, సుప్రీం కోర్టులు సైతం ఎయిర్‌ప్యూరిఫయర్లపై పన్నులు తగ్గించాలని కూడా సూచించింది. ఈ పరికరాలు మరింతగా ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చి కాలుష్యానికి గురికాకుండా చూడాలన్న లక్ష్యంతోనే జిఎస్టీని కుదిస్తున్నట్లు కేంద్రం చెపుతోంది. అలాగే సురక్షిత మంచినీరు లభించడం కూడా ఇపుడు దేశంలో అందని ద్రాక్షగా ఉంది. ప్రత్యేకించి ఈశాన్య ప్రాంతాల్లో సురక్షిత మంచినీరు లభించకపోవడం ఆపై వాటర్ ప్యూరిఫయర్లపైనా అధికపనులతో అందుబాటులోకి రాకపోవడంతోకేంద్రం దృష్టిసారించింది. అందువల్లనే ఇపుడు జలశుద్ధిసామగ్రి, వాయు శుద్ధిపరికరాలపై జిఎస్టీని 5శాతానికి తీసుకురావాలని నిర్ణయించింది. వచ్చే జిఎస్టీ సమావేశంలోనే ఈనిర్ణయం ప్రకటిస్తారని తెలుస్తోంది.

Print and Published by Gireesh Sangh, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd, at 11-37, Moramputi, Rajamahendravaram-533 103. Phone: 24 2460408. RNI No.64863/96, Editor: Damerla Sai Baba, Responsible for selection of News-under the PRB Act. Regd: No.H/SD/337/09-11 . Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.




# జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు

## జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా (బ్యూరో)** నూతన సంవత్సర వేడుకలను సంయమనం, సామాజిక బాధ్యతతో కూడిన నూతన సాంప్రదాయానికి ప్రతీకగా జరుపుకోవాలని జిల్లా మెజిస్ట్రేట్ %aa% కలెక్టర్ కీర్తి చేకూరి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కుటుంబ సభ్యులతో ఇంటి వద్దనే నూతన సంవత్సరాన్ని స్వాగతిస్తూ, మంచి విలువలు ప్రతిబింబించే విధంగా వేడుకలు నిర్వహించుకోవాలని సూచించారు. జిల్లా ప్రజలకు, ప్రజా ప్రతినిధులకు, అధికారులకు కలెక్టర్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియ జేశారు. రానున్న సంవత్సరం జిల్లాలో శాంతి, అభివృద్ధి, ప్రజల సంక్షేమం మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ సమాజ పురోగతికి సహకరించాలని అన్నారు. నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలియజేయడానికి వచ్చే వారు పుష్పగుచ్ఛాలు, పూలదండలు, శాలువాలు వంటివి తీసుకురావద్దని ఆమె విజ్ఞప్తి చేశారు. వాటికి బదులుగా విద్యార్థులకు ఉపయోగపడే నోటు పుస్తకాలు, పెన్నులు, విజ్ఞానాన్ని పెంపొందించే టెక్స్ట్ బుక్స్ తీసుకుని రావాలని కోరారు. విద్యను ప్రోత్సహించే ఆలోచనతో నూతన సంవత్సరాన్ని ప్రారంభించడం ఒక మంచి సంప్రదాయంగా నిలుస్తుందని పేర్కొంటూ, ఈ మేరకు జిల్లా ప్రజలందరూ సహకరించాలని ఆమె కోరారు.

# వైభవంగా వెండి రథోత్సవం

## తరలివచ్చిన అశేష భక్తజనం



**ఉమ్మడి తూర్పుగోదావరి బ్యూరో,డిసెంబర్ 30, (ప్రభాత వార్త).** కాకినాడ జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివారి సన్నిధిలో మంగళవారం శ్రీ సత్యదేవుని వెండిరథోత్సవం వైభవంగా నిర్వహించారు. ముందుగా ఆలయ అర్చకులు శ్రీస్వామి,అమ్మవార్ల ఉత్సవ మూర్తులను వివిధ రకముల సుగంధభరితమైన పుష్పములు, ధివ్యాభరణములతో అలంకరించి వెండిరథంపై ఆశీనులు గావించారు.దేవస్థానం ఈఓ వేంద్ర త్రినాధరావు కొబ్బరికాయ కొట్టి రథోత్సవం ప్రారంభించారు.వేదపండితుల మంత్రోచ్ఛరణ, మంగళవాయిద్యాలు, వేలాధి భక్తుల సత్యదేవుని నామస్మరణ నడుమ ఆలయ ప్రాకారం చుట్టూ ముమ్మార్లు వెండిరథంతో ప్రదక్షిణ గావించారు.ఈ కార్యక్రమంలో, ఆస్థాన వేధ పండితులు, అర్చకులు,వ్రత పురోహితులు,దేవస్థానం అధికారులు,సిబ్బంది,అధిక సంఖ్యలో భక్తులు,గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు. గ్రామంలో వెండి గరుఢవాహన సేవ

ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా రాత్రి గ్రామంలో స్వామి, అమ్మవారు వెండి గరుఢ వాహనంపై ఊరేగారు. రత్నగిరిపై నుండి స్వామి, అమ్మవారిని పల్లకీలో కొండదిగువకు తోడ్కొని వచ్చి తొలిపావంచాల వద్ద సిద్ధంగా ఉంచిన వండి గరుఢ వాహనంపై ఆశీనులు గావించి మంగళవాయిధ్యాలు, వేధమంత్రోఛ్ఛరణ నడుమ గ్రామంలోని ప్రధాన రహదారి మీదుగా ఊరేగింపు నిర్వహించారు. వెండి గరుఢ వాహనంపై ఊరేగుచున్న స్వామి, అమ్మవారిని దర్శించుకొనుటకు భక్తులు, గ్రామస్థులు ప్రధాన రహదారులకు ఇరువైపులా బారులు తీరారు. అనంతరం స్వామి, అమ్మవారికి పల్లకిలో గ్రామోత్సవం నిర్వహించారు.

# రత్నగిరిపై వైభవంగా ముక్కోటి ఏకాదశి వేడుకలు

## ఉత్తర ద్వారం గూండా సత్యదేవున్ని దర్శించిన వేలాధి భక్తజనం - సత్యదేవునికి స్వర్ణ పుష్పార్చణ



**ఉమ్మడి తూర్పుగోదావరి బ్యూరో,డిసెంబర్ 30, (ప్రభాతవార్త).** అన్నవరం శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి రత్నగిరిపై మంగళవారం ముక్కోటి ఏకాదశి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈసందర్భంగా ప్రధానాలయ ప్రాంగణాలను ప్రత్యేక పుష్పాలంకరణతో రమణీయంగా తీర్చిదిద్దారు. తెల్లవారుజామున 3 గంటలకు సుప్రభాత సేవతో స్వామి, అమ్మవారిని మేల్కొలిపి విశేష అభిషేకాలనంతరం పట్టువస్త్రాలు,వజ్ర,వైఢూర్య ధివ్యాభరణాలతో సత్యదేవున్ని, అనంతలక్ష్మి సత్యవతి అమ్మవారిని అలంకరించి మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, వివిధ వైధిక కార్యక్రమాలు, పంచహారతులు అనంతరం 108 బంగారు పుష్పాలతో స్వర్ణపుష్పార్చణ నిర్వహించారు. తెల్లవారు 5 గంటలనుండి ఉత్తర ద్వారా దర్శణం ప్రారంభించారు. ప్రతీ రోజు దక్షిణ ద్వారం గూండా ప్రధానాలయంలో సత్యదేవున్ని దర్శించుకునే భక్తులు, ధనుర్మాసం, ముక్కోటి ఏకాదశి పర్వదినాన్న శేషతల్పంపై పవళించే శ్రీ మహావిష్ణువుగా సత్యదేవుడు, స్వామి పాదాలవద్ద లక్ష్మీదేవిగా అనంతలక్ష్మీ సత్యవతి అమ్మవారిని ప్రత్యేకాలంకరణ గావించి ఉత్తర ద్వారం గూండా భక్తులు దర్శించుకునేలా సిద్ధం చేసారు. ప్రత్యేక పుష్పాలంకరణ నడుమ శోభాయమానంగా దర్శణమిస్తున్న స్వామి, అమ్మవారిని ఉత్తర ద్వారం ద్వారా భక్తజనం దర్శించుకుని తరించారు. ఉదయం నుండి సాయంత్రం వరకూ వేలాదిగా భక్తులు ఉత్తర ద్వారం ద్వారా దర్శించారు.రద్దీ దృష్ట్యా దేవస్థానం ఈఓ వేంద్ర త్రినాథరావు, చైర్మన్ రాజా ఐవి రోహిత్ ఆద్వర్యంలో ఆలయం వద్ద అదనపు సిబ్బందితో ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. క్యూలైన్లో భక్తులు త్వరగా ముందుకు సాగేలా "సేవా బృందం సభ్యులు" సేవలందించారు.దర్శణం అనంతరం భక్తులకు కదంభాన్ని స్వామి ప్రసాదంగా అందజేశారు.

**అధికంగా భక్తుల తాకిడి**

ముక్కోటి ఏకాదశి పురస్కరించుకొని రత్నగిరికి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. గతెడాది కంటే రెట్టింపు సంఖ్యలో భక్తులు సత్యదేవుని వ్రతాలాచరించి, ఉత్తర ద్వారం ద్వారా స్వామివారిని దర్శించారు. దర్శణం అనంతరం భక్తులు ఆలయ ప్రాంగణంలో సంచరిస్తూ ప్రత్యేక పుష్పాలంకరణను తిలకిస్తూ, సెల్ ఫోన్లలో ఫొటోలు తీసుకుంటూ సందడిచేసారు. నయనానందకరమైన పుష్పాలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఉదయం 10.30 నుండీ రత్నగిరికి విచ్చేసిన భక్తులందరికీ స్వామివారి అన్న ప్రసాద పథకం ద్వారా నిరంతరాయంగా భోజన సదుపాయం కల్పించారు.

**ఈఓ, చైర్మన్ ప్రత్యేక పూజలు**

ముక్కోటి ఏకాదశి సందర్భంగా దేవస్థానం ఈఓ వేంద్ర త్రినాధరావు దంపతులు, చైర్మన్ రాజా ఐవి రోహిత్ వేకువజామునే ఉత్తర ద్వారం ద్వారా స్వామి, అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆస్థాన వేదపండితులు వీరికి మహాదాశీర్వచనం గావించి వేధాశీస్సులు అందజేసారు. ముక్కోటి ఏకాదశి ఉత్తరద్వార ప్రత్యేక ఏర్పాట్లలో ఈఓ, చైర్మన్ లు అహర్నిశలు శ్రమించారు.

**ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు**

ముక్కోటి ఏకాదశి సందర్భంగా రత్నగిరిపై ఏర్పాటు చేసిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కోలాటనృత్యం, భరతనాట్యం, భక్తిగీతాలాపన,భజనలు వంటి కార్యక్రమాలు నిర్వహించారు.



# వాడపల్లి క్షేత్రానికి ముక్కోటి ఏకాదశి శోభ...

**ఉత్తర ద్వార దర్శనం తో పులకించిన భక్తులు.**
**వెంకన్న తొలి హారతి - ఉత్తర ద్వార దర్శనంలో పాల్గొన్న ఎంపీ హరీష్, ఎమ్మెల్యే బండారు...**




**ఆత్రేయపురం, డిసెంబర్, 39,(ప్రభాత వార్త)** ఏడువారాల వెంకన్నగా ప్రసిద్ధిచెందిన కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయం మంగళవారం ముక్కోటి ఏకాదశి మహా పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులు వైకుంఠ ద్వార దర్శనంతో స్వామివారిని దర్శించుకొని తరించారు. ఆలయ అర్చకులు వేకువజామున గౌతమి గోదావరి నది జలాల సేకరణ మేల్కొలుపు అర్చన లక్ష్మి ఐశ్వర్య హోమం స్వామివారికి నిర్వహించి పంచామృత అభిషేకాలు ప్రత్యేక పూజలు, చేశారు. తొలి హారతితో ప్రారంభమైన దర్శనాలు ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక కాంతులతో పరవశించింది.ఆలయాన్ని వివిధ సుగంధ పుష్పలతో ప్రత్యేక అలంకరణ చేసారు. దీంతో భక్తులు ఆలయ ప్రాంగణమంతా సెల్ఫీ లతో సందడి చేశారు. వైకుంఠ ద్వారం గుండా దర్శనం లభిస్తే మహావిష్ణువు గరుడ వాహనదారుడై ముక్కోటి దేవతలతో భూలోకానికి దిగివచ్చి భక్తులకు దర్శనమిస్తాడు కనుక దీనికి ముక్కోటి ఏకాదశి రోజున శ్రీహరిని పూజిస్తే అష్టైశ్వర్యాలు సిద్ధిస్తాయని విశ్వాసం విశ్వాసంతో తెల్లవారుజామున నుంచే వేలాది మంది భక్తులు ఆలయానికి తరలివచ్చారు. అర్చకులు వేద మంత్రోచ్ఛారణల నడుమ విశేష పూజలు నిర్వహించి అనంతరం ఉత్తర ద్వార దర్శనం కల్పించారు. భక్తులతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. తొలి దర్శన కార్యక్రమంలో అమలాపురం పార్లమెంటు సభ్యులు గంటి హరీష్ బాలయోగి, కొత్తపేట నియోజకవర్గ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, కొత్తపేట జనసేన పార్టీ ఇంచార్జ్ బండారు శ్రీనివాసరావు, జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గుత్తుల సాయి, పార్టీ ప్రధాన కార్యదర్శి గంధం పల్లంరాజులతో కలిసి సకుటుంబ సమేతంగా పాల్గొని స్వామివారి దర్శించుకున్నారు. వారికి ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వేదపండితులు వేద ఆశీర్వచనం అందించగా ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు ఆలయ చైర్మన్ ముదునూరి వెంకటరాజు, ధర్మకర్తలు, స్వామివారి చిత్రపటం తీర్థప్రసాదాలు అందజేశారు. దర్శనానంతరం ఎంపీ గంటి హరీష్ కుమార్ మధుర్ మాట్లాడుతూ, ముక్కోటి ఏకాదశి రోజున సాక్షాత్తు మహావిష్ణువు గరుడ వాహనదారుడై ముక్కోటి దేవతలు వైకుంఠమునకు వాడపల్లి వెంకటేశ్వర స్వామి దర్శనం లభించడం అదృష్టంగా భావిస్తున్నామని తెలిపారు. కోనసీమ ప్రాంతం సర్వతోముఖాభివృద్ధి చెందాలని, రాష్ట్ర ప్రజలంతా సుఖసంతోషాలతో వర్ధిల్లాలని స్వామివారిని ప్రార్థించినట్లు పేర్కొన్నారు. అలాగే ఎమ్మెల్యే బండారు సత్యానందరావు మాట్లాడుతూ, వాడపల్లి వెంకన్న దయతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రజల జీవితాల్లో శాంతి, భద్రత, సంక్షేమం మరింత పెరగాలని ఆకాంక్షించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి-సంక్షేమం రెండింటినీ సమానంగా సాధించాలని స్వామివారిని కోరుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కొత్తపేట నియోజకవర్గ ప్రజలకు, మీడియా మిత్రులకు, అధికారులకు, ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలకు ముక్కోటి ఏకాదశి, ఆంగ్ల నూతన సంవత్సరం, సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. వేడుకలలో భాగంగా ఆలయాన్ని పుష్పాలతో సుందరంగా అలంకరించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన చిత్రపటాలను ప్రజాప్రతినిధులు తిలకించారు. చక్కని ఏర్పాట్లకు ఆలయ చైర్మన్ ముదునూరి వెంకటరాజు, డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావులను అభినందించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా దర్శన ఏర్పాట్లు పకడ్బందీగా నిర్వహించిన ఆలయ యాజమాన్యాన్ని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు బండారు సంజీవ్ , బండారు సచిన్,ఆలయ ధర్మకర్తలు, అధికారులు, అర్చకులు, ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, వేలాది సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు అలాగే మధ్యాహ్నం గరుడ వాహనదారుడై మహావిష్ణువు ముక్కోటి దేవతలతో భూలోకానికి దిగివచ్చి భక్తులకు దర్శనమిస్తాడు ఆలయ మా అడవిలో గ్రామోత్సవం భక్తిశ్రద్ధలతో సన్నాయి మేళాలతో విహరించారు. ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

## శారీరక ధృఢత్వానికి క్రీడలు దోహదం తలపంటి బుజ్జి



**శంఖవరం, డిసెంబర్30 (ప్రభాతవార్త):** క్రీడల ద్వారానే శారీర ధృఢత్వం సాధించవచ్చని శంకవరం మండల జనసేన పార్టీ ఉపాధ్యక్షులు తలపంటి బుజ్జి పేర్కొన్నారుశంఖవరం మండలం నెల్లిపూడి గ్రామంలో క్రీడాకారులకు తలపంటి బుజ్జి వాలీబాల్ నెట్ బహుకరించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడారంగంలో పిల్లలు ఉన్నత స్థానానికి చేరాలని, గ్రామంలో క్రీడా రంగాన్ని ఆట తీరు లో మరింత నైపుణ్యత సాధించాలని, ఎప్పటికప్పుడు గ్రామంలో పిల్లలను ప్రోత్సహించడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో సతీష్, ప్రణయ, శ్యామ్, అరవింద్, శివ, శ్యాంపాల్, ఆపిల్, చెర్రీ, రాందాస్ , నెల్లిపూడి జనసేన నాయకులు పాల్గొన్నారు

## భక్త జనసంద్రమైన బెండపూడి వెంకన్న ఆలయం



**శంఖవరం , డిసెంబర్ 30, (ప్రభాతవార్త):** శంఖవరం మండలంలోని నెల్లిపూడి శివారు తిరుపతి అగ్రహారం (బెండపూడి) వెంకటేశ్వరస్వామి వారి ఆలయం ముక్కోటి ఏకాదశి పర్వదినం పురష్కరించుకుని భక్తజన సంద్రంగా మారిపోయింది. ఈ ప్రాంతంలోనే అత్యంత పురాతన ఆలయం(చాళుక్యల పాలనలో)గా పేరుగాంచిన వెంకటేశ్వర స్వామి వారిని దర్శించేందుకు జిల్లా నలుమూలల నుండి భక్తులు తరలివచ్చారు. ఏకాదశి పర్వదినం పురష్కరించుకుని ఆలయ ధర్మకర్త పీతాంబరం ప్రసాద్, ఆలయ అర్చకులు రంగనాథ జ్యోతి ఆధ్వర్యంలో ఆలయాన్ని విధ్యుద్దీపాలు, పుష్పాలు, పత్రులతో సుంధరంగా అలంకరించారు. ఆలయ ఆవరణలో పుష్పాలతో అలంకరించిన పల్లకీలో గోదాదేవి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి వార్లను సుగంధ పుష్పాలతో సుందరంగా అలంకరించి, ఆశీనులు గావించి, భక్త జనులకు స్వామి, అమ్మవార్ల దర్శనం కల్పించారు. ముక్కోటి ఏకాదశితో 15 పాశం పూర్తి చేసినట్లు ధర్మకర్త ప్రసాద్ తెలిపారు. ఆలయ ఆవరణలో ధర్మకర్తలతో పాటు, భక్తులు స్వామివారికి నైవేద్యాలు సమర్పించగా, భక్తులకు ప్రసాద వితరణ గావించారు.

**వచ్చే శనివారం గోదాదేవి అమ్మవారికి సారె సమర్పణ :**

ప్రతీ ఏడాది భోగి నాడు నిర్వహించే గోదాదేవి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి వార్ల కళ్యాణమహోత్సవం పురష్కరించుకుని బెండపూడి గ్రామస్తులు అమ్మవారికి వచ్చే శనివారం సారె సమర్పణ ఉత్సవం వైభవంగా జరుగుతుందని ధర్మకర్త పీతాంబరం ప్రసాద్ వెల్లడించారు.

## ఆక్వా అభివృద్ధి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ కొండబాబుకు సన్మానం



**యు.కొత్తపల్లి, డిసెంబర్ 30(ప్రభాతవార్త):** మండలంలోని అమీనాబాదు గ్రామానికి చెందిన ఆక్వా అభివృద్ధి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ వంకా కొండబాబును మంగళవారం కాకినాడ మత్స్యశాఖ కార్యాలయంలో కాకినాడ జనసేన పార్టీ జిల్లా ఇంచార్జీ, డీసీసీబీ ఛైర్మన్ తుమ్మల రామస్వామి, జనసేన నాయకులు ఘనంగా సన్మానించారు. అనంతరం మత్స్యశాఖపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రామస్వామి మాట్లాడుతూ జనసేన పార్టీలో కష్టపడిన ప్రతి ఒక్కరికి గుర్తింపు లభిస్తుందన్నారు. అందులో భాగంగానే ఆక్వా అభివృద్ధి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గా కొండబాబు అవకాశం లభించిందనన్నారు. ఈ కార్యక్రమంలో కాకినాడ మత్స్యశాఖ డీడీ వి.కృష్ణారావు, ఏడీ కరుణాకర్, ఎఫ్.డీ.ఓ శ్రీరామకృష్ణ, జనసేన నాయకులు తెలగంశెట్టి వెంకటేశ్వరరావు, సానా నాగు, బండి ధర్మరాజు(దావీదు), ఉమ్మిడి జాన్, అమీనాబాదు సర్పంచ్ నక్కా మణికంఠ బాబు, ధనబాబు తదితరులు పాల్గొన్నారు.

## నర్సరీల సమస్యలపై కలెక్టర్ కు ఫార్మర్స్ అసోసియేషన్ వినతి




**కడియం, డిసెంబరు 30 (ప్రభాత వార్త ) :**కడియం మండలం కడియపులంక గ్రామానికి చెందిన సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ ప్రతినిధులు మంగళవారం జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి ని కలిసి నర్సరీ రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు రత్నం అయ్యప్ప మాట్లాడుతూ కడియం నర్సరీల్లో ఉత్పత్తి అవుతున్న మొక్కలను అంతర్జాతీయంగా ఎగుమతి చేసే అవకాశాలు విస్తృతంగా ఉన్నాయని తెలిపారు. అయితే ఎగుమతుల సమయంలో సాంకేతిక సమస్యలు, విధానపరమైన అడ్డంకులు ఎదురవుతున్నాయని ప్రభుత్వం నుంచి మరిన్ని ప్రోత్సాహకాలు అందిస్తే నర్సరీ రైతులు అంతర్జాతీయ మార్కెట్లో నిలదొక్కుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నర్సరీ రైతుల సమస్యలపై జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి సంబంధిత శాఖాధికారులతో సమన్వయం చేసుకుని తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అలాగే నర్సరీ రైతులకు సబ్సిడీపై సోలార్ మోటార్లు త్వరితగతిన అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. మట్టికి ప్రత్యామ్నాయంగా సాయిల్‌లెస్ మీడియా వినియోగం, కోకోపిట్ స్టబిలైజేషన్, టిషట్యు కల్చర్ ల్యాబ్‌ల ఏర్పాటు వంటి అంశాలపై దృష్టి సారించాలని . వీటివల్ల నర్సరీ రంగం మరింత అభివృద్ధి చెందుతుందని కలెక్టర్ పేర్కొన్నారు . ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ మేఘస్వరూప్, జిల్లా ఉద్యానశాఖ అధికారి ఎన్. మల్లిఖార్జున, కడియం ఉద్యానశాఖ అధికారి పి. లావణ్య, అసోసియేషన్ ఉపాధ్యక్షులు బోడపాటి గోపి, జనరల్ సెక్రటరీ కొండేపూడి నాగు, సెక్రటరీ తడాల నాగేశ్వరరావు, ట్రెజరర్ రత్నం బాబ్జీ, జాయింట్ ట్రెజరర్ పిల్లా శ్రీనివాస్, పీఆర్ఓ బోడపాటి సత్యనారాయణ, ఆంధ్రప్రదేశ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ వడగల బుచ్చిరాజు తదితరులు పాల్గొన్నారు.

## పదవులకు ఎంపీపీ రాజీనామ చెయ్యాలి : గోపాలపురం వైసీపీ డిమాండ్




**గోపాలపురం డిసెంబర్ 30, (ప్రభాతవార్త):** పార్టీ పేరుతో విజయం సాధించి పదవులు అనుభవిస్తూ పార్టీకి వెన్నుపోటు పొడిచిన ఎంపీపీ ఉండవల్లి సత్యనారాయణ ఎంపీటీసీకి, ఎంపీపీ పదవులకు రాజీనామ చెయ్యాలని గోపాలపురం మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. గోపాలపురం వైసీపీ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఎంపీపీ ఉండవల్లి సత్యనారాయణతో పాటు పలువురు కార్యకర్తలు తెలుగుదేశం పార్టీలో ఎమ్మెల్యే సమక్షంలో టీడీపీలోకి చేరిన సంగతి తెలిసిందే. దీనిని గోపాలపురం మండల వైసీపీ నాయకులు తీవ్రంగా ఖండించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పేరు చెప్పుకుని 7 సంవత్సరాలు సొసైటీ అధ్యక్షులుగా, అదే జగన్ పేరు చెప్పుకుని ఎంపీటీసీగా గెలుపొంది 3 సంవత్సరాలు ఎంపీపీ పదవును అనుభవించి స్వార్థ ప్రయోజనాల కోసం తల్లిలాంటి పార్టీకి ద్రోహం చేయటం సిగ్గుచేటని దుయ్యబట్టారు. వ్యక్తిగత ప్రయోజనాలు ఆశిసించి అధికార పార్టీకి వెళ్ళిపోవడం సరైన చర్య కాదని విమర్శించారు. మీ వాదాలకుంట గ్రామంలో మిమ్మల్ని నమ్ముకున్న కార్యకర్తలకు ద్రోహం చేశారని విమర్శించారు. మీరు డప్పు కొట్టుకుంటున్న విధంగా రాజీనామ చేసింది 60 మంది కాదు, కేవలం 15 మంది లోపు మాత్రమే ఉంటారని ఆరోపించారు. ఇప్పటికైన మనసాక్షి ఉంటే వైసీపీ తరుపున గెలుపొంది, 18 ఎంపీటీసీలు నిలబెడితేనే మీరు ఎంపీపీ అయ్యావు అన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని హితవు పలికారు. ఆత్మాభిమానం అన్నది మీకుంటే పదవులకు రాజీనామా చేసి, మరల మీ బలాన్ని నిరూపించుకోవాలాని సవాల్ విసిరారు. ఇంచార్జ్, మాజీ మంత్రి తానేటి వనిత ఆధ్వర్యంలో గోపాలపురం నియోజకవర్గంలో వైసీపీ ఎంతో పటిష్టంగా ఉందని, కార్యకర్తలు ఎంతో ఉత్సాహంగా పని చేస్తున్నారని పేర్కొన్నారు. ఎంపీపీ రాజీనామ వలన పార్టీకి వచ్చిన నష్టం ఎం లేదని తెలిపారు. ఈ సమావేశంలో మండల అధ్యక్షులు వెలగ శ్రీరామ్మూర్తి, పిన్నమనేని చిన్నబాబు, కూరుకూరి నాగేశ్వరావు, పోతిరెడ్డి నాగరాజు, వల్లభని సత్యనారాయణ, కూసం రామ్మోహన్ రెడ్డి, సాలి వేణు, బొమ్మ మురళి, బొమ్మిన నాగరాజు, అన్సర్ బాషా, జుజ్జవరపు అన్నవరం, శ్యాం సుందర్ రెడ్డి, ముల్లంగి శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## దానా పథకం జిల్లాలో సత్ఫలితాలు...కలెక్టర్ మహేష్ కుమార్



**అమలాపురం కలెక్టరేట్,డిసెంబర్ 30, (ప్రభాతవార్త):** జిల్లా యంత్రాంగం ప్రత్యేక చొరవతో దానా కంపెనీల ప్రతినిధులతో పలుమార్లు సంప్రదింపులు జరిపి అత్యంత పోషక విలువలు కలిగిన జిల్లా వ్యాప్తంగా అమలు చేస్తున్న కోనసీమ దానా పథకం జిల్లాలో సత్ఫలితాలను ఇస్తోందని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ వెల్లడించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ నందు పశు సంవర్ధక, ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల అధికారులతో సమావేశం నిర్వహించి కోనసీమ పశుదాన పథకం వల్ల కలిగిన లబ్ది పురోగతి అంశాలను సమీ క్షించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు జిల్లావ్యాప్తంగా సరఫరా చేసిన కోనసీమ పశు దాన పథకం ద్వారా 6, లక్షల30 కేజీలు 67 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల ద్వారా పంపిణీ చేసి నట్లు తెలిపారు. కోనసీమ పశు దాన పంపిణీ మూలంగా గతంలో కన్నా పశువులలో పాల దిగుబడి రోజువారి ఒక లీటరు పెరిగిందని, ఫ్యాక్ట్ 20 శాతం పెరిగి మంచి ధర లభిస్తోందని రైతులు సంతృప్తిని వ్యక్తం చేసినట్లు అధికారులు జిల్లా కలెక్టర్ వారికి వివరించారు గతంలో మామూలుగా ఖరీదు ?100 అయితే ప్రస్తుతం 80 రూపాయలకే కోనసీమ పశు ధాన లభించి 20 రూపా యలు మిగులుతోంద న్నారు. దానా మూలంగా రైతు లకు ఇప్పటి వరకు రూ ఒక కోటి 20 లక్షలు అయిందని పాల దిగుబడి పెరగడం ద్వారా ఒక కోటి 30 లక్షలు లాభం పాడి రైతాంగం ఆర్జించినట్లు తెలిపారు. సాధారణంగా వాడే పశుదానా కంటే కోనసీమ పశుదాన వల్ల కలిగే లాభాలను ఒక సంవ త్సరం పాటు విశ్లేషించాలని ఆదేశించారు అదేవిధంగా దూడలు చూడు కట్టడం ఎదకు రావడం ఇతర కలిగే ప్రయోజ నాలను క్షుణ్ణంగా విశ్లేషించాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా కోనసీమ పశుదాన విక్రయాలను క్రమబద్ధీకరించి రైతులకు అదనపు ఆదాయం లభిం చేందుకు ఇరు శాఖలు పూర్తి సమన్వయం వహించాలన్నారు పచ్చి పశుగ్రాసం మూలంగా ఖ నిజాలు లవణాలు శాతం పోషకాలు సమతుల్యంగా సుస్థిరమైన పాల దిగుబడి ఉంటుంద న్నారు.వ్యాధుల నిరోధక శక్తి బాగుండే అవకాశం ఉందన్నారు ఈ కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి మనోజ్ కుమార్, నోడల్ అధికారి డాక్టర్ అనిత, డాక్టర్ విజయ రెడ్డి, వినోద్ కుమార్ జిల్లా ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ ప్రసన్న ఆంజనేయ స్వామి ఆలయం వద్ద ఘనంగా ముక్కోటి పూజలు....



**కాకినాడ రూరల్, డిసెంబర్ 30 (ప్రభాతవార్త)** కాకినాడ రూరల్ మండలం సర్పవరం గ్రామం పూల మార్కెట్ సమీపంలో వేంచేసి ఉన్న శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం వద్ద ముక్కోటి ఏకాదశి పూజలు ఘనంగా నిర్వహించారు. బ్రహ్మశ్రీ కొండబాబు శర్మ వారిచే ఆంజనేయ స్వామి వారికి ఏకాదశి రుద్రాభిషేకాలు , లక్ష తమలపాకులతో స్వామివారిని అభిషేకించి సింధూరం పూజలు చేశారు. అనంతరం సీతారామ భజన సమాజం వారిచే నిర్వహించిన ఏకాహం భజన కార్యక్రమం భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. కార్యక్రమంలో రెడ్డి సత్యానందం, ఏసు, పూల వర్తక వ్యాపార సంఘం సభ్యులు, మానేపల్లి ప్రసాద్,పుల్ల రామకృష్ణ,వెన్నపు స్వామితదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 4న.హిందూ సమ్మేళనం



**మామిడికుదురు.డిసెంబర్ 30(ప్రభాతవార్త)** ఈనెల 4వ తేదీ ఆదివారం పాశర్లపూడిలో హిందూ సమ్మేళనం సభ జరుగుతుందని నిర్వాహక కమిటీ వారు పేర్కొన్నారు.పాశర్లపూడి అమ్మ సూపర్ మార్కెట్ సమీపంలో ఉదయం 9గంటలకు సభ జరుగుతుందని తెలిపారు.ఈ సమ్మేళనానికి సంబందించిన కరపత్రాలను మంగళవారం సభా ప్రాంగణంలో ఆవిష్కరించారు.హిందూ ధర్మ పరిరక్షణ, హిందూ సమాజాన్ని చైతన్యవంతం చేసే చర్యల్లో భాగంగా ఈ సమ్మేళనం నిర్వహిస్తున్నామన్నారు.వాసవీ మహా పీఠాధీశ్వరులు శ్రీధర్ స్వామీజీ తోపాటు పలువురు ప్రముఖులు సమ్మేళనానికి హాజరు అవుతున్నారన్నారు.ప్రతీ హిందువూ సభకు హాజరై ఈసమ్మేళనాన్ని విజయవంతం చేయాలని నిర్వాహక కమిటీ సభ్యులు పిలుపునిచ్చారు.

## భక్తులతో కిక్కిరిసిన బాల బాలాజీ స్వామి ఆలయం.



**మామిడికుదురు.డిసెంబర్ 30(ప్రభాతవార్త)** వైకుంఠ ఏకాదశి సందర్భంగా అప్పనపల్లి శ్రీ బాల బాలాజీ స్వామి వారి ఆలయం మంగళవారం భక్తులతో కిక్కిరిసి పోయింది. శ్రీ బాల బాలాజీ స్వామి దేవస్థానంలో నిర్వహించిన వైకుంఠ ఏకాదశి ఉత్సవాలు అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధల మధ్య విజయవంతంగా ముగిశాయి. ఈ సందర్భంగా ఉదయం నుండి సాయంత్రం 4 గంటల వరకు మొత్తం 26,600 మంది భక్తులు శ్రీ స్వామివారిని దర్శించుకున్నారని ఆలయ కార్యనిర్వాహణాధికారి ముదునూరి సత్యనారాయణ రాజు తెలిపారు.పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ కూటమి నేతలతో కలిసి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దర్శనం,అన్నప్రసాద వితరణకు ఏర్పాటు చేశామన్నారు.మధ్యాహ్నం 3గంటలకు శ్రీ స్వామివారికి వివిధ రకాల సంప్రదాయ వాయిద్య బృందాల మధ్య గ్రామోత్సవం జరిగింది.భక్తులు ఆలయ ప్రాంగణ పరిశుభ్రత,ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పూల అలంకరణపై విశేషంగా స్పందిస్తూ తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు.ఉత్సవం విజయవంతంగా నిర్వహించడంలో స్థానిక పోలీసు శాఖ, గ్రామస్తులు,ఆలయ సిబ్బంది కీలక పాత్ర పోషించారని ఏ.సీ తెలిపారు.

## శైవక్షేత్రం ద్రాక్షారామంలో ఆగంతకుల దుశ్చర్య



**రామచంద్రపురం,డిసెంబర్30(ప్రభాతవార్త):** పవిత్ర వైకుంఠ ఏకాదశి రోజున హిందువుల మనోభావాలను దెబ్బతీసే విధంగా ద్రాక్షారామంలో శ్రీ మాణిక్యాంబా సమేత శ్రీ భీమేశ్వర స్వామి ఆలయానికి ఉత్తర దిశగా సప్త గోదావరి తీరాన గల కపాలేశ్వర స్వామి లింగాన్ని సోమవారం అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగులు విచ్ఛిన్నం చేసి అదృశ్యమయ్యారు. తెల్లవారుజామున స్వాములు సప్త గోదావరి నదీ స్నానం అనంతరం కపాలేశ్వర స్వామి లింగానికి జలాభిషేకం చేసేందుకు సిద్ధపడగా ఈ దుశ్చర్య బయట పడిందని స్థానికులు చెబుతున్నారు.శివలింగాన్ని ధ్వంసం చేయడాన్ని హైందవ సంఘాల తీవ్రంగా తప్పుపట్టాయి.ఈ ఘటనకు బాధ్యులైన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలంటూ నినాదాలు చేశాయి.శివలింగం విధ్వంసం ఘటన వార్త తెలియగానే పోలీస్,దేవాదాయ,పురావస్తు శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు.క్షణాల్లో ఆ ప్రాంతాన్ని కట్టుదిట్టం చేశారు.శివలింగం ధ్వంసమైన ప్రాంతాన్ని అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ రాహుల్ మీనా పరిశీలించారు.పూర్తిస్థాయిలో భద్రత దళాలను ఏర్పాటు చేశారు.పోలీసు ఉన్నతాధికారులు దేవస్థానానికి చేరుకుని లింగ విధ్వంసానికి పాల్పడిన దుండగుల ఆచూకీ కోసం ప్రయత్నాలు ముమ్మరం చేశారు.ఘటనకు సంబంధించిన నిందితులను గుర్తించేందుకు ఆరు పోలీస్ బృందాలను ఏర్పాటు చేసినట్లు ఎస్పీ వెల్లడించారు.దీనిలో భాగంగా డాగ్ స్క్వాడ్,క్లూస్ టీములు రంగ ప్రవేశం చేశాయి.అన్ని కోణాల్లో విచారణ చేసి దోషులను త్వరలోనే అరెస్టు చేస్తామని పోలీస్ వర్గాలు వెల్లడించాయి...


# అరాచక పాలన నుంచి అభివృద్ధి వైపు

### కొత్తపేట నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి కృషి - ఎమ్మెల్యే బండారు సత్యానందరావు



**రావులపాలెం ,డిసెంబర్ 30,(ప్రభాతవార్త)** వైసిపి అరాచక పాలనలో కుదేలైన రాష్ట్రాన్ని గాడిలో పెట్టి 18 నెలల కూటమి పాలనలో ఎనలేని అభివృద్ధి సంక్షేమంతో రాష్ట్రాన్ని ముందుకు నడిపిస్తున్నామని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు స్పష్టం చేశారు మంగళవారం ఆయన రావులపాలెం క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు 2025లో కూటమి ప్రభుత్వం సాధించిన 60 విజయాలను వివరించారు ప్రధాని మోదీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల నేతృత్వంలో కూటమి ప్రభుత్వంలో కొత్తపేట నియోజకవర్గం అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందని తెలిపారు సూపర్ సిక్స్ సూపర్ హిట్ అయ్యిందన్నారు తల్లికి వందనం కింద 67.27 లక్షల మంది విద్యార్థులకు రూ10,090 కోట్లు అందజేశామని తెలిపారు స్త్రీ శక్తి పథకం కింద మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించామన్నారు దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించామన్నారు అన్నదాత సుఖీభవ కింద 46 లక్షల మంది రైతులకు రూ 6,310 కోట్లను రైతుల ఖాతాలో జమ చేశామన్నారు ధాన్యం అమ్మిన 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ చేయడం జరుగుతుందని తెలిపారు దీపం 2 క్రింద ఏడాదికి 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు అందిస్తున్నామన్నారు ఎన్టీఆర్ భరోసా పింఛన్ల కింద ఇప్పటివరకు రూ750,000 కోట్లకు పైగా పెన్షన్ల కోసం వ్యయం చేయడం జరిగిందని 2025లో రూ33,000 కోట్లు పంపిణీ చేశామన్నారు మత్స్యకార భరోసా కింద ఏడాదికి 20 వేల చొప్పున 1.25 లక్షల మందికి రూ250 కోట్లు పంపిణీ చేయడం జరిగిందని తెలియజేశారు నేతన్నలకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని మర మగ్గాలకు నెలకు 500 యూనిట్లు మగ్గాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని తెలిపారు ఆటో డ్రైవర్ల సేవలో పథకం కింద ఏడాదికి రూ15,000లను 2.90 లక్షల మంది లబ్దిదారులకు రూ436 కోట్లు జమ చేశామన్నారు 204 అన్నా క్యాంటిన్లు నిర్వహిస్తూ పేదలకు 5రూపాయలకే మంచి భోజనం అందిస్తున్నామని త్వరలో కొత్తపేటలో సైతం అన్నా క్యాంటీన్ ప్రారంభిస్తున్నామని తెలిపారు గీత కార్మికులకు 10 శాతం మద్యం షాపులను కేటాయించామన్నారు వివాదాలకు తావివ్వకుండా ఎస్సీ వర్గీకరణ జరిపిన సంగతి గుర్తు చేశారు స్వర్ణకారులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు మైనారిటీ సంక్షేమానికి రూ3,670 కోట్లు వ్యయం చేశామని 8,427 మంది పాస్టర్లకు నెలకు రూ 5,000 చొప్పున గౌరవ వేతనం రూ 51 కోట్లు అందజేశామని తెలిపారు ఇమామ్లకు నెలకు రూ10,000 మౌజన్లకు రూ5,000 చొప్పున ఏడాదికి రూ 90 కోట్లు అందజేసినట్లు తెలిపారు పురోహితులకు నెలకు రూ15,000కు వేతనాలను పెంచామన్నారు నాయీ బ్రాహ్మణులకు నెలకు రూ25,000కు వేతనాల పెంచామని జూనియర్ లాయర్లకు రూ10,000 గౌరవ వేతనం అందించామని మహిళలకు లక్ష కుట్టు మిషన్ల పంపిణీ చేశామన్నారు మెగా డీఎస్సీ కింద 15,941 టీచర్ పోస్టులను భర్తీ చేశామన్నారు 5,757 కానిస్టేబుల్ పోస్టుల నియామకం పూర్తి చేశామని రూ.4,500 నుంచి రూ12,500కు స్టైఫండ్ పెంచామని తెలిపారురూ1,000 కోట్లతో రోడ్ల మరమ్మతులు చేపట్టామని మరో రూ3,000 కోట్లతో రహదారుల నిర్మాణం చేశామన్నారు కొత్తపేటలో డివిజనల్ కార్యాలయాల ఏర్పాటు జరిగిందని అన్నారు వాడపల్లి దేవస్థానం అభివృద్ధి జరుగుతుందన్నారు రూ80కోట్లతో ఆర్ అండ్ బి పంచాయతీ రాజ్ ఎన్ ఆర్ జీ ఎస్ లో రహదారుల అభివృద్ధి జరుగుతుందన్నారు డ్రాగన్ పడవల పోటీలతో పర్యాటక పరంగా అభివృద్ధి చేస్తున్నామన్నారు గత ప్రభుత్వ పాలనలో నియోజకవర్గంలో ఏ మాత్రం అభివృద్ధి జరగదు అనే పరిస్థితి ప్రజల్లో ఉండేదని ఆ స్థితి నుంచి ఊహించని విధంగా అభివృద్ధి చేశామన్నారు సాగు నీరు తాగు నీరు ఇబ్బందులు లేకుండా అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు లొల్ల లాకుల పునర్నిర్మాణానికి ప్రతిపాదనలు పంపామని తెలిపారు శక్తి వంచన లేకుండా రాష్ట్రం నియోజకవర్గం గ్రామాల అభివృద్ధికి అన్ని విధాల కృషి చేస్తున్నామని తెలిపారు ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ముత్యాల బాబ్జి బూసి జయలక్ష్మి భాస్కరరావు కంఠంశెట్టి శ్రీనివాస్ సాధనల శ్రీను సరిపెల్ల శ్రీనివాసరాజు అత్తిలి వెంకటేశ్వరావు సిద్దిరెడ్డి శ్రీను పసుపులేటి రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు

## ఘనంగా తాళ్లూరులో ముక్కోటి ఏకాదశి పర్వదినం



**గండేపల్లి డిసెంబర్ 30(ప్రభాతవార్త):** గండేపల్లి మండలం తాళ్లూరు మఠంలో వేంచేసి ఉన్న శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి జీయర్ స్వామి ఆలయంలో ముక్కోటి పర్వదినం పురస్కరించుకుని భక్తులు ఉత్తర ద్వారం నుండి ఆలయంలోనికి ప్రవేశించి స్వామివారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ పురోహితులు వేదమంత్రోచ్ఛారణల మధ్య స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం స్వామివారిని హంస గరుడ శేష పల్లకి వాహనాలపై బాణాసంచా, సన్నాయి వాయిద్యాలు కోలాటంతో భక్తుల గోవింద నామస్మరణల మధ్య గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు.

## వేణు మాధవస్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి పూజలు



**శంఖవరం, డిసెంబర్ 30, (ప్రభాతవార్త):** శంఖవరం మండలంలోని [illegible]

## రఘుదేవపురంలో రీసర్వే గ్రామసభ




**సీతానగరం, డిసెంబర్ 30, (ప్రభాత వార్త) :** మండలంలోని రఘుదేవపురం గ్రామంలో [illegible]

## పొలంబడి పిలుస్తుంది కార్యక్రమంలో పాల్గొన్న ఏడీఏ



**కె.గంగవరం,డిసెంబర్ 30, (ప్రభాతవార్త):** [illegible] పంట వస్తుందని, అలాగే కొనుగోలు చేసే ప్రతి విత్తనం, ఎరువు, పురుగుమందుకు రసీదు పొంది పంట కోత వరకు వాటిని జాగ్రత్తపరచాలని కోరారు. ఈ కార్యక్రమంలో అముజూరు సొసైటీ డైరెక్టర్ నేమాని సత్తిబాబు, రాహుల్, భూషణం, రైతులు పాల్గొన్నారు.

## రేషన్ సరుకుల పంపిణీ సక్రమంగా నిర్వహించాలి..



**అంబాజీపేట,డిసెంబర్ 30, (ప్రభాతవార్త):** ప్రభుత్వ నిత్యావసర సరుకుల పంపిణీ దుకాణాలకు సరుకులను సక్రమంగా పంపిణీ చేసేలా తగు చర్యలు తీసుకోవాలని జిల్లా ఇన్చార్జి రెవెన్యూ అధికారి, అమలాపురం ఆర్డీవో మాధవి అన్నారు. అంబాజీపేట మార్కెట్ యార్డు ఆవరణలో ఉన్న స్టాక్ గోడౌన్లను ఆమె మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గోడౌన్లో ఉన్న స్టాకును పరిశీలించారు. అనంతరం స్టాకు రిజిష్టర్లను పరిశీలించి, సిబ్బందికి తగు సూచనలు చేశారు. ఆమె వెంట తహసీల్దార్ బి.చినబాబు, ఎంఎస్వో పూర్ణిమ,ఆర్ఐ కె. ఏడుకొండలు,వీఆర్వో జి. వెంకటరమణలు ఉన్నారు.

## దర్శించుకున్న పొలిట్ బ్యూరో సభ్యులు రెడ్డి సుబ్రహ్మణ్యం దంపతులు జిల్లా జాయింట్ కలెక్టర్ నిశాంతి..



**ఆత్రేయపురం, డిసెంబర్, 30,(ప్రభాత వార్త)** ప్రముఖ పుణ్యక్షేత్రం వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామివారిని మంగళవారం ముక్కోటి ఏకాదశి సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ నిశాంతి, రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యులు రెడ్డి సుబ్రహ్మణ్యం , రాష్ట్ర బీసీ కార్పొరేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ రెడ్డి అనంతకుమారి దంపతులు స్వామివారిని దర్శించుకున్నారు. వారికి ఆలయ అర్చకులు వేదమంత్రాలతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు దర్శనం అనంతరం ఆలయ అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వచనాలు అందించగా ఆలయ చైర్మన్ ముదునూరి వెంకటరాజు, ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు, శ్రీ స్వామివారి చిత్రపటం ప్రసాదాలను అందజేశారు. అలాగే పశ్చిమగోదావరి జిల్లా, నిడదవోలు చెందిన దురుపూడి సిద్దార్థ దురుపూడి వెంకట అభిరామ్ వారి కుటుంబ సభ్యులు నిత్యాన్నదాన పథకానికి రూ. 1,02,000/- విరాళంగా అందించారు. వారికి ఆలయ అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వచనాలు అందించగా ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు శ్రీ స్వామివారి చిత్రపటం ప్రసాదాలను అందజేశారు.వివిధ సేవల స్వామివారికి రూ, 16లక్షలు ఆదాయం సమకూరినట్లు దేవస్థానం అధికారులు ఒక ప్రకటన ద్వారా తెలియజేసారు.

# రమణ తత్వం మానవాళికి ఆదర్శం..

### రాచపల్లి రమణ సేవాశ్రమంలో రమణ మహర్షి జయంతి వేడుకలు



**ప్రత్తిపాడు,డిసెంబరు30(ప్రభాతవార్త)** రమణ తత్వం మానవాళికి ఆదర్శమని పలువురు స్వామీజీలు అన్నారు. ప్రత్తిపాడు మండలం రాచపల్లి రమణ సేవాశ్రమంలో రమణ మహర్షి 146వ జయంతి వేడుకలు మంగళవారం స్వామి రామానంద ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ఏలూరు జిల్లా ముందూరు గ్రామ అఖిలాంధ్ర సాధు పరిషత్ కార్యదర్శి కృష్ణ చరణానంద భారతీ స్వామి, కొప్పవరం ప్రణవాశ్రమం సుమిత్రానంద సరస్వతి మాతాజీ, ఎరుకుంపాలెం శ్రీ స్కంద దేశికాశ్రమము లక్ష్మణానంద స్వామి, వంగలపూడి గీతాశ్రమము విజ్ఞాన నందగిరి మాతాజీ, రాజమండ్రి చైల్డ్ వెల్ఫేర్ బి పద్మావతి, గాజువాక అరుణాచల ధ్యానపీఠం ఉదయ స్వామి తదితరులు రమణతత్వం బాహ్య ప్రపంచపు ఆడంబరాలకు దూరంగా, నిరాడంబరమైన జీవితాన్ని గడిపారన్నారు. సకల జీవుల పట్ల అపారమైన ప్రేమను ప్రదర్శించిన ఆయన సందేశం సర్వకాలీనమని స్పష్టం చేశారు. ప్రజలంతా రమణ మహర్షి చూపిన సత్యం, శాంతి మార్గంలో పయనిస్తూ లోక కల్యాణానికి పాటుపడాలని వారు ఆకాంక్షించారు.

## క్రీస్తు ప్రవచించిన శాంతి మార్గమే శరణ్యం : బిషప్ డా హెరెత్ బి మల్లిపూడి



**కొత్తపేట, డిసెంబర్ 30, (ప్రభాతవార్త)** క్రీస్తు ప్రవచించిన కరుణ ప్రేమ క్షమాగుణం శాంతి మార్గాలే మనకు శరణ్యాములని తణుకు కు చెందిన ఆర్ పి ఎఫ్ మినిస్ట్రీస్ అధ్యక్షులు బిషప్ డా హెరత్ బి మల్లిపూడి అన్నారు కొత్తపేట మండల పరిధిలో ని వానపల్లి సువారు నారాయణలంకలో సోమవారం రాత్రి క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు రివైవల్ ప్రేయర్ ఫెలోషిప్ పాస్టర్ కె పాల్ తిమోతి ఆధ్వర్యంలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో బిషప్ మల్లిపూడి మాట్లాడుతూ ప్రపంచంలో అత్యధికంగా జరుగుతున్న పండుగ క్రిస్మస్ అని అన్నారు వాడపాలెం కు చెందిన పాస్టర్ బిషప్ డా అడపా ప్రసాద్ మాట్లాడుతూ సర్వ మానవ పాప పరిహారార్థం ప్రభువు తాను సిలువమాను పై రక్తాన్ని చిందించి ప్రాణార్పణ చేశారన్నారు పాస్టర్ పాల్ తిమోతి మాట్లాడుతూ విశ్వాసులు ప్రేమ త్యాగం క్షమాగుణం అలవర్చుకోవడం ద్వారా ప్రభువు మార్గానికి చేరువవుతామని అన్నారు కార్యక్రమంలో బాలలు క్రిస్మస్ గేయాలు ఆలపించారు క్యాండిల్స్ వెలిగించి క్రిస్మస్ సంబరాలు జరుపుకున్నారు ప్రేమ విందు ఏర్పాటు చేశారు తన గానంతో మాధుర్యాన్ని పంచారు కొత్తపేట వాడపాలెం సద్దిచార ప్రాంత విశ్వాసులు క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్నారు

## వాడపల్లి దేవస్థానం చైర్మన్ ని సత్కరించిన నర్సరీ అసోసియేషన్ సభ్యులు



**కడియం, డిసెంబర్ 30 (ప్రభాతవార్త)** మండలంలోని కడియపులంక గ్రామానికి చెందిన సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ అధ్యక్షులు రత్నం అయ్యప్ప ఆధ్వర్యంలో కోనసీమ తిరుమల గా పేరుగాంచిన వాడపల్లి దేవస్థానం చైర్మన్గా నియమితులైన ముదునూరు వెంకటరాజుని ఆత్రేయపురంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు రత్నం అయ్యప్ప, ఉపాధ్యక్షులు బోడపాటి గోపి, జనరల్ సెక్రటరీ కొండేపూడి నాగు, సెక్రటరీ తడాల నాగేశ్వరరావు, జాయింట్ సెక్రెటరీ గాజుల రత్తయ్య, ట్రెజరర్ రత్నం బాబ్జి, జాయింట్ ట్రెజరర్ పిల్ల శ్రీనివాస్, డైరెక్టర్ గాథ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ భావనారాయణ స్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు




**కాకినాడ రూరల్, డిసెంబర్ 30 (ప్రభాత వార్త):** రూరల్ మండలం సర్పవరం గ్రామంలో కొలువు తీరిన శ్రీ రాజ్యలక్ష్మి సమేత శ్రీ భావనారాయణ స్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని వేకువజాముల నుండి అధిక సంఖ్యలో భక్తులు పోటెత్తారు. ఆలయ కార్య నిర్వహణ అధికారి రాపాక శ్రీనివాసరావు భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా క్యూలైన్లను ఏర్పాటు చేసి ఉత్తర ద్వారం ద్వారా స్వామివారి దర్శనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పాతాళ భావనారాయణ స్వామిని దర్శించుకుని భక్తులు వేద పండితులచే వేద ఆశీర్వచనాన్ని తీసుకుని దేవస్థానం వారు ఏర్పాటుచేసిన స్వామివారి కండువాలను భక్తులకు అందజేశారు . స్వామివారి ఆలయాన్ని సుగంధ పరిమళ పుష్పాలతో ప్రత్యేక అలంకరణ చేశారు. జై శ్రీ భావనారాయణ అంటూ ఆలయ ప్రాంగణం అంతా మారుమొగింది. ఆలయంలో ఇటీవల స్థానిక శాసనసభ్యులు పంతం నానాజీ ప్రారంభించిన నిత్యాన్నదాన పథకానికి భక్తులు విరాళాలు ఇచ్చి సహకరించాలని ఈవో శ్రీనివాసరావు భక్తులను కోరారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి విచ్చేసి స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## ఆదిత్య సతీష్ రెడ్డికి ఎడ్యుకేషన్ ఛేంజ్ మేకర్ అవార్డు



**గండేపల్లి డిసెంబర్ 30(ప్రభాతవార్త):** భారత ప్రభుత్వానికి చెందిన ఐ.సి.టి. అకాడమీ సంస్థ విజయవాడలో నిర్వహించిన 71వ ఐ.సి.టి. అకాడమీ బ్రిడ్జ్ కాన్ఫరెన్స్లో ప్రతిష్టాత్మకమైన ఎడ్యుకేషన్ చేంజ్ మేకర్ అవార్డును ఆదిత్య యూనివర్సిటీ ప్రో.ఛాన్సలర్ డాక్టర్ ఎన్.సతీష్ రెడ్డి కి ప్రధానం చేసినట్లు ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ ఆదిత్య యూనివర్సిటీ ఛాన్సలర్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి తెలిపారు. ప్రతిష్టాత్మకమైన ఎడ్యుకేషన్ ఛేంజ్ మేకర్ అవార్డు ను పొందిన డాక్టర్ సతీష్ రెడ్డి కి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సతీష్ రెడ్డి మాట్లాడుతూ అవార్డు అందుకోవడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. ఉన్నత విద్య లో అసాధారణ నాయకత్వాన్ని విద్యా నైపుణ్యాన్ని ముందుకు తీసుకెళ్లడంలో ఆదిత్య అనుసరిస్తున్న ప్రతిభావంతమైన ప్రయత్నాలను అభినందిస్తూ, ఐ.సి.టి అకాడమీ బోర్డు ఈ ప్రతిష్టాత్మక గుర్తింపు ప్రధానం చేసింది అన్నారు. ఈ అవార్డు తో మరింత సంస్కరణలతో విద్యార్థులకు మెరుగైన విద్యను అందించడానికి మరింత ఉత్సాహంగా ముందుకు వెళతామని అన్నారు. ఐసిటి అకాడమీ భారత ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం పరిశ్రమల సహకారంతో చేపట్టిన ఒక కార్యక్రమం. ఐసిటి అకాడమీ ఒక లాభాపేక్ష లేని సంస్థ. ఈ సంస్థ ద్వారా ప్రతిష్టాత్మకమైన ఎడ్యుకేషన్ ఛేంజ్ మేకర్ అవార్డు అందుకోవడం ఆనందంగా ఉందని అన్నారు. అవార్డు గ్రహీత డాక్టర్ నల్లమిల్లి సతీష్ రెడ్డి కి డిప్యూటీ ప్రో.ఛాన్సలర్ డా. ఎం. శ్రీనివాస రెడ్డి, వైస్ ఛాన్సలర్ ప్రో. ఎం.బి. శ్రీనివాస్, ప్రో. వైస్ ఛాన్సలర్లు డా. ఎస్. రమాశ్రీ,డా. ఆదిరెడ్డి రమేష్, డా. రవి తంగజన్, రిజిస్ట్రార్ డా. జి. సురేష్, వివిధ విభాగాల డీన్ లు విభాగాధిపతులు అభినందనలు తెలిపారు.


## పట్టించుకోని ఏలేశ్వరం నగర పంచాయతీ



**ఏలేశ్వరం, డిసెంబర్ 30 (ప్రభాతవార్త)** ఏలేశ్వరం మార్కెట్లో చెత్తాచెదారం పెరిగిపోయి ఇళ్ల మధ్యలో చెత్తంతా తీసుకుని వచ్చి పడి వేస్తున్నారు. ఎక్కడెక్కడ నుంచో వచ్చిన వ్యర్థాలు, చెత్తాచెదారాలు తీసుకుని వచ్చి మార్కెట్లో ఇళ్ల మధ్యలో వేస్తున్నారు. ఇళ్ల మధ్యలో చెత్తంతా పెరిగిపోయి అక్కడ ఉన్న ప్రదేశం అంతా ఒక డంపింగ్ యార్డ్ లో తయారయింది. ఈ విషయం కోసం ఏలేశ్వరం నగర పంచాయతీలో కంప్లైంట్ చేసిన పట్టించుకోని అధికారులు. చెత్తా, వ్యర్థాలతో కాలవలు మూసిపోయి డ్రైనేజ్ వాటర్ లాగకుండా డ్రైనేజీ లో ఉన్న వాటర్ రోడ్ల మీదకు వచ్చిన అక్కడ ఉన్న నగర పంచాయతీ సిబ్బంది ఏ మాత్రం పట్టించుకోవడంలేదని అక్కడ ఉన్న స్థానిక ప్రజలు మీడియా వద్దకు వచ్చి వాపోతున్నారు. ఇప్పటికైనా నగర పంచాయతీ సిబ్బంది వచ్చి మార్కెట్లో ఉన్న చెత్త, వ్యర్థాలు తొలగించి డ్రైనేజీలు శుభ్రపరిస్తే మంచిదని అక్కడ ఉన్న స్థానికులు తెలుపుతున్నారు.

## గోవింద నామస్మరణతో మారుమ్రోగిన వైష్ణవాలయాలు

### ఉత్తర ద్వార దర్శనంతో పులకించిన భక్తులు




**తుని, డిసెంబర్ 30,( ప్రభాతవార్త )** వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని తుని మండలంలోని వైష్ణవాలయాలన్ని గోవింద నామస్మరణతో మారుమ్రోగాయి. తుని పట్టణంలో పాతబజారు వీధిలో వేంచేసియున్న స్వయంభు శ్రీఅలివేలుమంగా సమేత వేంకటేశ్వర స్వామివారి దేవస్థానంలో వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని వేకువ జాము నుండి స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు అభిషేకములు వేద పండితులు అత్యంత వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ఉత్తర ద్వార దర్శనం చేసుకుని తీర్థప్రసాదాలు స్వీకరించి తరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ చైర్మన్ కుక్కడపు బాలాజీ, ఈవో అయ్యప్పరాజు ఏర్పాట్లను పర్యవేక్షించారు. తుని మండలం ఎస్. అన్నవరంలో వేంచేసియున్న శ్రీ భూదేవి శ్రీదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు అభిషేకములు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. తుని మండలం టి. తిమ్మాపురం గ్రామం లో వేంచేసియున్న మహావిష్ణు దేవస్థానంలో వైకుంఠ ఏకాదశి పర్వదిన వేడుకలను ఆలయ ధర్మకర్త పోల్నాటి శేషగిరిరావు ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. తుని మండలం ఎన్. సురవరం గ్రామంలో వేంచేసియున్న శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి వారి సన్నిధిలో ప్రత్యేక పూజలు అభిషేకములను నిర్వహించారు. ఆలయ కమిటీ ధర్మకర్త చింతమనీడి అబ్బాయి ఆధ్వర్యంలో స్వామివారి దర్శనార్థం వచ్చే భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని తుని పట్టణ, గ్రామాలలోని వైష్ణవాలయాలన్ని గోవింద నామస్మరణతో మార్మ్రుగాయి.

## క్రికెట్ పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే మద్దిపాటి



**గోపాలపురం డిసెంబర్ 30, ప్రభాతవార్త:** గ్రామీణ ప్రాంతాల్లో సాంప్రదాయబద్ధంగా క్రీడలు నిర్వహించడం యువతకు ఎంతో మేలని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు అన్నారు. గోపాలపురం మండలంలోని, వేళ్లచింతలగూడెంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఆర్అండ్ఎం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతియేట మాదిరిగా నిర్వహిస్తున్న క్రీడల్లో భాగంగా మంగళవారం ఎమ్మెల్యే మద్దిపాటి క్రికెట్ పోటీలను ప్రారంభించారు. జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం ఎమ్మెల్యే బ్యాటింగ్ చేస్తుండగా.. ఆర్&ఎం ఫౌండేషన్ అధినేత ఘంటా మధుకృష్ణ బౌలింగ్ చేసి క్రీడాకారులను ఉత్సాహ పరిచారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. క్రీడాకారులు గెలుపే లక్ష్యంగా ఆటలు ఆడాలన్నారు. సంక్రాంతి పండుగ సంప్రదాయమైనదని, దూరప్రాంతాల వారు కూడా తమ ఊళ్లకు చేరుకుని పండుగను ఎంతో సంబరంగా జరుపుకుంటారన్నారు. ఆర్అండ్ఎం ఫౌండేషన్ ఆధ్వర్యంలో వేళ్లచింతలగూడెంలో ఈ సారి గతంలో కంటే మరింత ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. యువత చెడు వ్యసనాలకు వెళ్లకుండా ఇలాంటి సంప్రదాయబద్ధ క్రీడల్లో పాల్గొనాలని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఉండవల్లి సత్యనారాయణ, సర్పంచ్ గొల్ల కుమార్, నాయకులు కొర్లపాటి రాము, కొర్లపాటి అన్నవరం, పిన్నమనేని చినబాబు, గన్నిన మురళి, విల్లూరి రాంబాబు, గద్దె హరిబాబు, జ్యేష్ఠ శ్రీధర్, పరిమి జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తర ద్వార దర్శనానికి పోటెత్తిన భక్తులు..



**అంబాజీపేట,డిసెంబర్ 30, (ప్రభాతవార్త):** ముక్కోటి ఏకాదశి పర్వదినంను పురస్కరించుకుని స్థానిక కొర్లపాటివారిపాలెంలో వేంచేసియున్న శ్రీ భూసమేత శ్రీ వెంకటేశ్వరస్వామి వారి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆలయ అర్చకులు పాణింగపల్లి నరసింహాచార్యులు ఆధ్వర్యంలో వెంకటేశ్వరస్వామి వారికి చామంతి పూలతో ప్రత్యేక పూజలు జరిపారు. సామూహిక పూజల్లో మహిళలు అత్యధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని వివిధ రంగుల పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక మండపమును ఏర్పాటు చేసి చామంతి పూలతో సామూహిక అభిషేకములు నిర్వహించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాటు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదములు అందజేశారు. మండలంలోని పలు వైష్ణవాలయాల్లో తెల్లవారుజాము నుండి ఉత్తర ద్వారం ద్వారా భక్తులకు ప్రవేశం కల్పించారు. పుల్లేటికుర్రు వెంకటేశ్వర స్వామి ఆలయం, వ్యాఘ్రేశ్వరం,ఇరుసుమండ, నందంపూడి,తొండవరం వాకలగరువు,చిరతపూడి: ఇసుకపూడి,కె.పెదపూడి. గంగలకుర్రు, గంగలకుర్రు అగ్రహారం,ముక్కామల, మొసలపల్లి,పసుపల్లి, కముజువారిలంక,మాచవరం గ్రామాల్లో ఉన్న వైష్ణవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

Print and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at 11-37, Morampudi, Rajamahendravaram-533 103. Phone : 2469407, 2469408. RNI No.64863/96, Editor : Damerla Sai Baba, Responsible for s election of News-under the PRB Act. Regd.: No.H/SD/337/09-11 Air Surcharge: Delhi : 40Ps